ఆంధ్ర సచిత్ర వారపత్రిక

30-12-83
150 పైసలు




ఈ రోజు
మంచి రోజనే
భావనలో
ధుర స్వప్నాలేవేవో
మఫత్‌లాల్
బట్టలతో
అనుక్షణం
తీరేను తీయని
కోరికలవేవో.
సరదాగా, సున్నితంగా హాయిని గొల్పేలా
బట్టలు—పాలియెస్టర్, పాలియెస్టర్
బ్లెండ్ లలోనే గాక కాటన్ లలో కూడా—
క్షణక్షణం, అనుక్షణం, రోజూ, ప్రతిరోజూ
మిమ్మల్ని మరింత అందంగా రూపొందించ
గల రంగుల్లో, నేతలలో, డిజైన్లలో.
మఫత్‌లాల్
ఫ్యాబ్రిక్స్



మా శ్రీవారు మనస్సు మార్చుకున్నారు

ఆయన నిజంగా నాకు మంచి స్టయిలుగావుండే ఆ ఫ్రెంచి సూపర్ బైక్ బుక్ చేశారు.

ప్రతి రోజూ నేను నా బ్యాంకుకి సరిగ్గా టైముకి వెళ్ళడానికి రెండు బస్సులు మారాలి. ఎంత హడావడో, ఎంతకంగారో.

శ్రీ వారి కాలేజి దగ్గరే, పదేపది నిమిషాల నడక. ఆయన రాం అని సాయంత్రము 4.30 గం॥కి ఇంటికి చేరుకుంటారు. నేను రాత్రి ఏ ఏడు గంటలకో కాళ్ళు ఈడ్చుకుంటూ వస్తాను.

ఔను మరి. నాకో మోపెడ్ కొని పెట్టమని రోజూ అడగటం, ఆయన వద్దనడం. మోపెడ్ మీద వెళ్ళడం తనకు ఇష్టలేదుట, "అది అపాయం", అంటారు.

మొన్న స్పోర్టిఫ్ బుక్ చేసిన రసీదు చూపించారు ఆశ్చర్యం కలిగింది అంటే నమ్మండి. "ఇది నీకే నీకోనమే" అని చెప్పారు.

నిజంగా నమ్మలేకపోయాను! కాని ఆ మర్నాడు షో రూముకి తీసుకెళ్ళినప్పుడు స్పోర్టిఫ్ చూశాను అప్పుడు అనుకున్నా ఆయన మనస్సు ఎందుకు మార్చుకున్నారో.

స్పోర్టిఫ్ ఎందుకు విశిష్టమైనది

- మంచి వేగం అందుకుంటుంది: గం॥కి 60 కి.మీ.
  —డబుల్ వేరియేటర్ ప్లాప్ వాల్వ్ ఇంజను బాగా వేగం అందుకుంటుంది గం॥కి 60 కి.మీ. మంచి అధిక టార్క్ నిర్మించుకొని నిమ్నప్రదేశాలలో కూడా ఇద్దరిని సౌలభ్యంగా తీసుకుపోతుంది.
- లీటరుకి 80 కి.మీ. మైలేజి — మీకు లీటరుకి 80 కి.మీ. వేగం ఇవ్వడానికి ఇంజను ట్రాన్స్‌మిషన్‌తోను గియర్స్‌తోను చేరి వుంటుంది.
- దొంగిలిపోవడానికి వీలులేని పెట్రోల్ ట్యాంక్ — అద్వితీయమైన పెట్రోల్ ట్యాంక్ డిజైనువల్ల అనవసరంగా దాని జోలికి పోవడానికి వీలులేకుండా తాళం వేయగల సౌకర్యం. ఇంకా అంతర్నిర్మితమైన ఇంధనపు మట్టపు సూచి.
- బటన్ నొక్కితే చాలు స్టార్టు అవుతుంది. — సెల్ఫ్‌స్టార్టింగ్ మెకానిజంకు ప్రత్యేకంగా డిజైను చేయబడిన మాగ్నెటో బాగా పనిచేసే బ్యాటరీకి వైరు చేయబడివుంటుంది.
  స్పోర్టిఫ్‌కి కిక్ స్టార్టుకూడా వుంటుంది. ఇంకా మీకు అవసరమైతే పెడల్ స్టార్టు చేసుకోవచ్చు.
- గియర్లు-వాటంతటవే మారతాయి — ఆటో గియరు విధానం వేగము మరియు టార్క్ వేరియేటర్లతో ఆటో గియర్ల విధానంతో గియర్లు బండి నడుస్తూండగానే వాటంతటవే మారతాయి. సాధారణ గియరు డిజైనుకంటె ఎంతో విశిష్టమైన విధానము
- ఈ 80ల నాటి నూతన స్టైయిలు — ధారావాహికంగా దిట్టంగా వుండే డిజైను దాని స్టైయిలుకి అనుగుణ్యంగా ఏర్పరచిన మాగ్ చక్రాలు — కాంటూర్ సీటింగ్ ఇద్దరు కూర్చుని సౌకర్యంగా స్వారి చేయడానికి అనువుగా వుంటుంది.
- ముఖ్యమైన విడిభాగాలన్నీ ప్యూజో వారు తయారుచేసినవే.



SPORTIF
సూపర్ బైక్

ఇప్పుడు భారతదేశంలో లభిస్తుంది.

శ్రీ చాముండి మోపెడ్స్ లిమిటెడ్
ఫ్రాన్స్ **PEUGEOT** వారి సహకారంతో
స్పోర్టిఫ్
దిట్టమైనది. ఠీవిలోవుండేది. ఫ్రెంచిది.
అధిక శక్తి 50cc ఇంజనుతో ఇద్దరికి బైక్

HTK-SCM-1472-B

మీరు మీ స్పోర్టిఫ్‌కి ఇక బుక్ చేసుకోవచ్చు

స్పోర్టిఫ్ చిహ్నము (Logo) భారత ప్రభుత్వమువారు అంగీకారమును అనుసరించి.

ముఖచిత్రం

శృంగార శాస్త్ర శోభిత
సమ్మోహ నాస్త్ర విరిత
ప్రియంవద జయప్రద
నట విశారదా శుభప్రద
హావ భావ మహాప్రియ
భావుకతా జ్వలితక్రియ
నయనాల తళుకులతో
చెక్కిళ్ళ నునుపులతో
అధరాల మెరుపులతో
పాఠక హృదయాల మరుల్గొలుపు
రసిక మానసాల రగుల్గొలుపు

ఆవుల రమణారెడ్డి, జమ్మలమడుగు.

* * *

అమితాబ్ బచ్చన్ ముఖచిత్రం చాలబాగుంది.

పిల్లి మాణిక్యప్రభు, ఇతరులు, సికింద్రాబాద్.

* * *

అందాలతార 'జయప్రద' ముఖచిత్రము ఎంత బాగుందంటే కట్ చేసి గదిలో అతికించి పెట్టుకున్నాము.

టి. వి. రమణారెడ్డి, సంగారెడ్డి.

* * *

ఆ లేత ఆకుపచ్చని ఆకులమధ్య; పసుపు రంగుచీరలో చూడముచ్చటగాను వీనుల విందుగాను; ఎంతో అందంగాను ఉన్నది జయప్రద.

పి. బి. రాధాకృష్ణమూర్తి, భువనేశ్వరం.

* * *

ముఖచిత్రం జయప్రద గ్లామరెస్‌గావుండి పాఠకుల్ని అలరించింది.

హిమబిందు, నాగినీప్రియ, డోర్నకల్.



ఆంధ్ర సచిత్ర వారపత్రిక ముఖచిత్రం ఎన్.టి.ఆర్., శ్రీదేవి జంటగా వేయవలనని మా కోరిక. ఇది వేయకపోతే కృష్ణ, శ్రీదేవిని వేయవలెను.

ఎల్లమ్మ, ఇతరులు, బళ్లారి.

* * *

అమితాబ్ బచ్చన్ ముఖచిత్రం బాగుంది.

శ్రావణ్ కుమార్, వీరవల్లి.

సీరియల్స్

స్వర్గీయ శ్రీమతి మాదిరెడ్డి సులోచనగారి ''యక్షగానం'' చాలా బావుంది. కొన్ని దశాబ్దాలుగా పాఠకలోకంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని నిలుపుకొన్న ఆ మహా రచయిత్రి కలం నుండి వెలువడిన ఆఖరు నవల నిజంగా ''యక్షుల — గానం'' కన్నా, బావుంది. చనిపోయిన వారిలో మంచివారు స్వర్గానికి, చెడ్డవారు నరకానికి వెళతారట! స్వర్గంలో ఉన్న శ్రీమతి మాదిరెడ్డిగారికి నా హృదయపూర్వక అభినందనలు, శ్రద్ధాంజలి తెలియచేస్తున్నాను.

జైన శ్రీనివాస్, ముదిమాణిక్యం



నటి జయప్రద ముఖచిత్ర సంచికలో ప్రారంభించిన సీరియల్ — ''గోరంత దీపం'' చాలా 'ఫెంటాస్టిక్'గా వుంది.

గుమ్మమూరు స్వర్ణశ్రీ, పూర్ణశ్రీ, అలూరు.

* * *

నటి — 'జయప్రద' ముఖచిత్రంతో వెలువడిన సంచికలో శ్రీమతి వింధ్యవాసిని గారి ''గోరంత దీపం'' సీరియల్ ప్రారంభం చాలా బావుంది!

జి. తరంగిణి, ఆదోని.

* * *

వింధ్య వాసినిగారి 'గోరంతదీపం' కొత్త సీరియల్ ఆదిలోనే ఆసక్తిని కలిగించింది. పరశురాంగారి కూతురు కరుణ ప్రైవేట్ టీచర్ హరిప్రసాద్ పరశురాంగారిని కలిసికొనడం, అతనిలో 'హీరో' లక్షణాలను పరశురాంగారు గుర్తించి తన ప్రెస్ ఆఫీసులో ఆర్గనైజరుగా నియమించడం; గోరంతదీపం సంపాదకులు విశ్వమూర్తిగారి కుమార్తె రమణను చూడటం అంతా సినిమా చూస్తున్నట్టుగావుంది.

స్వరాజ్యలక్ష్మి, ఆనందగజపతిరావు, తెట్టంగి.

* * *

అమ్మమనసు కథ చాలా బావుంది. అలాగే సీరియల్స్‌లో శ్రీమతి మాదిరెడ్డి సులోచనగారి నవల 'యక్షగానం' రసవత్తరంగా సాగుతున్నది.

ఆకురాతి నాగశ్రీనివాస్, గొల్లపూడి.

న్యూఢిల్లీ లేఖ

'జయ్‌దుబాషీ'గారి లేఖ పత్రికకు ఆణిముత్యం! ప్రతివారం మీ (మా) పత్రిక కోసం ఎదురుచూడకుండా వుండలేం ... !

ఆర్. డేవిడ్ విల్సన్, ఐ. జోసఫ్, కావలి.

* * *

డా॥ జయ్‌దుబాషీగారి విదేశీ ప్రయాణాల అనుభవాలు అద్భుతంగా ఉండి మమల్ని అహ్లాద పరిచాయి. వీటి ద్వారా తెలియని విషయాల నెన్నింటినో తెలుసుకున్నాము. ఆయన పర్యటించిన ఆయా దేశాల — సంస్కృతి, సభ్యత, నాగరికతల గురించి కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారాయన.

సి. ప్రతాప్, సి. ప్రకాష్, విశాఖపట్నం.

కథలు

మాచర్ల హేమగారి 'తోటమాలి' కథ బాగుంది. రసదృష్టి కొరవడితే. జీవితంలో యాంత్రికత చోటు చేసుకొని, ఆశ్వాశితమైన మానవ జీవితం అశాంతితో, అసంపూర్తితో, ద్వేషంతో, నిండి జీవితం పరిపూర్ణతను పొందడం లేదన్న విషయాన్ని రచయిత 'జాక్' పాత్ర ద్వారా చెప్పించారు.

తాటికొండ సుదర్శనాచారి, తాల్చరు థర్మల్

[66వ పేజీ చూడండి]

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

వాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 30–12–'83

రుధిరోద్గారి నామ సం. మార్గశిర బ. ఏకాదశి

సంపుటము 76 సంచిక 16

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 1-50
ఆరు మాసాల చందా	రు. 42-90
పోస్ట్‌లో ఏడాది చందా	రు. 85-80

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం. విజయవాడ-520 003.


విషయానుక్రమణిక

లోకం పోకడ-ఊహామెక్









గ్రామాలలో బావులూ - కొత్త ఆర్థిక వ్యవస్థా

శ్రీమతి గాంధీ మంత్రులు మాటలతో బాగా గారడి చేస్తారు. ధరలు పెరుగుతున్నాయా, అని అడగండి; "ధరలా ? ఏమి ధరలు ?" అని ఎదురు ప్రశ్న వేస్తారు. మొన్న పార్లమెంటులో ప్రణబ్‌ముఖర్జీ తడుముకోకుండా ఇలాగే మాట్లాడారు. ఆయన అసలు ఎప్పుడయినా బజారుకెళ్లి ఏమయినా కొన్నారా? కొని ఉండరు. ఆ పని చేసేందుకు ఎందరో సేవకులు కదా ?

ప్రకాష్‌చంద్రసేఠీని ఢిల్లీలో నేరాలని గురించి అడగండి. ఒక ఫయిలు తీసి చూసి "నేరాలు తగ్గుతున్నాయి" అని సమాధానం చెబుతారు బహుశ. ఈ ఏడాది సెప్టెంబరులో 19 హత్యలూ, పోయిన సంవత్సరం సెప్టెంబరులో 20 హత్యలూ జరిగాయని వివరిస్తారు. కాని ఈ సంవత్సరం 27 బందిపోటు దొంగతనాలు జరిగితే కిందటి సంవత్సరం 10 మాత్రమే జరిగాయని ఆయన చెప్పరు.

అలాగే నారాయణదత్ తివారీని అడగండి. స్విట్జర్‌లాండ్‌లో ఏదో పరిశోధనా సంస్థ వెలువరించిన నివేదికలోని భాగాలని చదివి వినిపిస్తారు. ఈ మధ్య మన మంత్రులు తెగ వెడుతున్నారు లెండి స్విట్జర్‌లాండ్‌కి. ఎన్నికలు రాబోతున్నాయి కదా ?

తివారీగారు దేశంలో పరిశ్రమలు బాగుపడిపోతున్నాయి; అని నిరూపించగలరు.

అన్ని ప్రభుత్వాలూ లెక్కలని వాడి అసత్యాలు చెబుతూ ఉంటాయి. అందుకనే లెక్కలని చెత్తకాగితాల బుట్టలో పడెయ్యటం మంచిది. ఈ ఏడాది ద్రవ్యోల్బణం పోయిన ఏడాది ద్రవ్యోల్బణం కన్నా కొంచెమే ఎక్కువ అని ఆయన అంటే, ఎందుకు అన్నారో చెప్పటానికి ప్రయత్నిస్తే, ఆయనకి కావలసిన లెక్కలు ఉన్నాయని గ్రహించవచ్చు. మంత్రులకి కావలసిన అంకెలకి కొదువా ? వాటిని వెతికి పయికితీసే అధికారులకీ, గుమాస్తాలకీ కొదువా?

వీళ్లంతా (గుమాస్తాలూ, ఆఫీసరులూ) పనిచేసే కర్మాగారం పేరు ప్రణాళికా సంఘం. ఈ ప్రపంచంలో భారతదేశంకన్నా వేగంగా అభివృద్ధి చెందే దేశంలేదు — అని నిరూపించే లెక్కలు కావాలా ? ప్రణాళికా సంఘానికి వెళ్లండి. అక్కడ పెట్టిన కంప్యూటరు మీకు కావలసిన లెక్కలు చెబుతుంది.

ఒక్క సంగతి గుర్తు ఉంచుకోవాలి. అక్కడ (ప్ర. సం. లో) దొంగ లెక్కలు తయారుచెయ్యటానికి ప్రయత్నించరు. ఉన్న లెక్కలనే కింద మీదాచేసి చూపిస్తారు. ఫ్రాన్సులో ఏదయినా తింటే, అది కోడి మాంసమో తెలీదు, కప్ప మాంసమో తెలీదు. అలాగ వండుతారు దానిని. ఇక్కడ లెక్కలూ అంతే. రష్యాలోనూ అంతే.

ఈ రంగం బాగుపడింది, ఆ రంగం బాగుపడింది, ఎగుమతులు పెరిగిపోతున్నాయి, స్వావలంబనం అధికం అవుతోంది...ఇలాగ ఉంటూ వచ్చింది వంతపాట. మరి మనం అంతర్జాతీయ ద్రవ్యనిధివద్ద రు 5000 కోట్లు ఎందుకు పుచ్చుకున్నట్లు ? మనకి అప్పు ఎందుకని ? మనం అంత పెద్దవాళ్లము కాబట్టే అంత పెద్ద ఋణం, అని ప్రభుత్వంవారు సమాధానం ఇవ్వవచ్చు. అప్పు పుట్టటం తేలికకాదు, అంటారు. సరే, మన ఎగుమతులు పెరిగిపోతూ ఉంటే మన విదేశీమారకం రేటు ఎందుకు

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

మారిపోతూ ఉంటుందిట ? రూపాయి విలువ ఎందుకు పడిపోతోంది ? మన కరెన్సీ నోట్లకి గిరాకీ ఎక్కువ కనుకనే వాటిని అచ్చు వెయ్యటం పెంచేశామా ?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అవకతవకల వలననే మన ఆర్థికపరిస్థితి బాగాలేదని మన రాజకీయవాదులు చెబుతారు. వర్ధమానదేశాలన్నిటికీ ఈ సమస్య ఉందిట. ఎప్పుడు వీలయినా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థని తిట్టాలి. ఇదీ మన పద్ధతి. పొద్దున కొళాయిలో నీళ్లు రాలేదా? అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థని తిట్టాలి. ఉల్లిపాయల ఖరీదు కిలోగ్రాము రు. 10 అయిందా? అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థని తిట్టాలి. మన మిత్రుడు అబ్దుల్ రెహమాన్ అంతూలే సిమెంటు బస్తారు. 90కి అమ్మితే అదీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో లోపం వల్లనే. ఎందరో సహృదయులు సయితం ఈ పొరపాటులో పడ్డారు — పశ్చిమ జర్మనీకి చెందిన విల్లీబ్రాంట్ నుంచి మన లక్ష్మీకాంత్ ఝాదాకా, ఒక కొత్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ అవతరించేదాకా ప్రపంచానికి దుర్గతి తప్పదని నిరూపించే రచనలు ఎన్ని చేసి ఉంటారు వీళ్లు ! దుర్గతి అనేది వాళ్లకి మాత్రమే కనపడుతుంది. ఇతరులకి కనపడదు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో సదస్సులూ, వాటిలో ఝా, లాల్, బ్రాంట్‌ల ప్రసంగాలూను.

మొన్న జరిగిన కామన్వెల్తు దేశాల ప్రభుత్వాల అధినేతల సమావేశంలో జరిగిన ఆర్థిక తీర్మానాన్ని చదివితే ఒక విషయం బాగా కనబడుతుంది— కొత్త ఆర్థిక వ్యవస్థ ప్రసక్తి లేదు అందులో. అయితే, అది ఎక్కడికి వెళ్లిపోయింది ? నాకు తెలిసినంత దాకా తటస్థ దేశాల సమావేశాన్ని నడిపినవాళ్లే కామన్వెల్తు దేశాల ప్రభుత్వాల అధినేతల సమావేశాన్ని నడిపారు. మరి ఏమిటి ఈ మార్పు ? రామ్‌ఫాల్ కొంతకాలం కిందటి దాకా కొత్త ఆర్థికవ్యవస్థని గురించి ఒకటే చెప్పేవారు.ఆయనా హటాత్తుగా దీనిని వదిలేశారు. శ్రీమతి గాంధీని అడగండి : తమ ఉపాయంలో ఇదంతా ఒక భాగం అంటారు. ఉపాయమూ కాదు, భాగమూకాదు. అంతా ఉట్టిది ఎన్నో అర్థంలేని ఇతర పదజాలాలలాగే "కొ. ఆ. వ్య" అన్న పదాలూ చె. కా. బు. చేరుకున్నాయి.

మీ కష్టాలన్నిటికి ఎవరో కారణం అనుకోవడంకన్నా తేలికపని లేదు. బీద దేశాల వారు సంపన్న దేశాలదే తప్పు అనటమూ సహజమే. విల్లీబ్రాంట్ సంగతి సరేసరి, కాని మన ప్రబుద్ధులు ఆయనకు ఎందుకు వంతపాడాలి ?

మన గ్రామాలలో బావులు తియ్యాలంటే, మంచినీరు సరఫరా చెయ్యాలంటే కొత్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కావాలా ? అసలు ఈ మాటలకి అర్థం ఏమిటి ? మనకి విదేశాలనుంచి ధనం రావాలనే కదా ? భారతదేశంలోని లంచగొండి రాజకీయవాదులనీ, అధికారులను తొలగించుకోటానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి సహాయం అవసరమా ? కా. దే. ప్ర. అ. స. ప్రారంభోత్సవంలో మార్గరెట్ థాచర్ అన్నారు: మన ఇల్లు చక్కబెట్టుకోవటానికి మనం చెయ్యగలిగినదే ఎంతో ఉంది అని. దీనికి విదేశ సహాయమూ అక్కరలేదు, కొత్త అంతర్జాతీయ వ్యవస్థా అక్కరలేదు. నేను థాచర్ అభిమానిని కాను కాని ఈ విషయంలో ఆమె చెప్పింది చక్కగా ఉంది. కా. దే. ప్ర. అ. స. తీర్మానంలో కొ. అం. ఆ. వ్య. ప్రసక్తి లేకుండా చేసినది ఆమే అయితే ఆమెకి నా దండాలు. ★


బూస్ట్ అతను రోజంతా చురుగ్గా ఉండేలా చూడటానికి ఎంతో చక్కటి మార్గం.
మీ అబ్బాయి తాగే గ్లాసు పాలల్లో రుచికరమైన శక్తి నిచ్చే బూస్ట్ ఒక చెమ్చాడు తీసి కలపండి, ప్రతి ఉదయం.
అంతే, రోజంతా కూడా అతను హైస్పీడ్ రైలులా చురుగ్గా తిరుగుతాడు.
రోజూ ఉదయం స్కూలులో చదువుకోడం, ఆడుతూ, పాడుతూ, ఫుట్‌బాల్ ఆడుకోడం, ఆ తరువాత శ్రద్ధగా గంట సేపు హోమ్‌వర్క్ చేసుకోడం ఇవన్నీ కూడా చకచకా చేసుకుపోతాడు.
బూస్ట్ యిచ్చే శక్తి అటువంటిది — మీ అబ్బాయి రోజంతా ఆటపాటలతో ఆనందముగా గడపడంలో తోడ్పడుతుంది. ఉదయం నుంచి రాత్రి వరకు.
బూస్ట్‌ని వెన్నగల పాలు, బంగారు రంగు గోదుమ, మాల్టెడ్ బార్లీ, రుచికరమైన కోకోలతో తయారుచేశారు. అది మీ బిడ్డ అవసరాలకుగాను శక్తినిచ్చే హైడ్రేట్లను, శరీర నిర్మాణానికి తోడ్పడే ప్రోటీన్లను సమకూరుస్తుంది.
Boost
MALT CHOCOLATE MILK DRINK
చురుకైన జీవనానికి శక్తినిచ్చే ఇంధనం

మనిషి-మతం-మనుగడ

వాడవల్లి నాగేశ్వరరావు

తూర్పు తెలతెలవారుతూ ఉంది. పక్షుల కలకలారావాలు మరో రోజుకి స్వాగతం చెప్తున్నాయి. పాలబిందెలనీ కూరలబుట్టలనీ బస్తీకి జేరవేస్తున్న ఎద్దుబండ్ల సందడీ, పొలం గట్టున గొల్లపిల్లల కూనిరాగాలూ, అమ్మవారి ఆలయంలో పూజారి చదువుతున్న దేవీ స్తోత్రమూ, వీటన్నిటితోపాటు నదీతీరాన సంధ్యానుష్టానాలు ఆచరిస్తున్న కృష్ణశాస్త్రిగారి గాయత్రీ ధ్యానమూ, అగ్రహారాన్ని అన్ని వైపుల్నించీ మేల్కొలుపుతున్నాయి.

సంధ్యాదికాలు ముగించి కృష్ణశాస్త్రిగారు గృహోన్ముఖులయ్యేవేళకి పూర్తిగా తెల్లవారింది. గత నాల్గైదు రోజులనించీ, ఆయన సంధ్యానుష్టానాదులు ముగించి ఇల్లు చేరేసరికి చాలా ఆలశ్యం అవుతూనే ఉంది. సర్వకాల సర్వావస్తల్లోనూ ఆయన్ననుసరించే, వారి పెద్ద కొడుకు మాధవశాస్త్రి ఈనాల్రోజుల్నించీ కనిపించట్లేదు. ఒక్కసారిగా డెభ్భైఏళ్ళ వయస్సు మీదపడినట్టుందాయనస్థితి. ఏనాడూ తండ్రినీ అగ్రహారాన్నీ విడిచి వెళ్ళని మాధవశాస్త్రి, పొరుగూరు వెళ్ళి ఇంతకాలం రాకపోవటం చూసే వారికీ ఆశ్చర్యంగానే ఉంది

శాస్త్రిగారు సహజ గంభీరమూర్తి. వేద శాస్త్రాలూ, పురాణేతిహాసాలూ, గీతోపనిషత్తులూ మొదలైన వైదిక వాఙ్మయాన్ని ఆమూలాగ్రంగా పఠించిన పండిత కుల ప్రతినిధి ఆయన. ఆయన పాండిత్యాన్ని తరచి చూడగలవారు ఆ చుట్టుపక్కల ఎవరూ లేనప్పటికీ ఆయనలోని సత్త్వగుణ విశిష్టత అందరికీ అనుభవమే. పాండిత్యం పేరుతో ఊరిలో ఏ పెద్దరికాన్నీ కోరలేదాయన. చేతనైనంతలో ఇతరులకి చేయగలిగినది చేయటం ఈయగలిగినది ఇయ్యటం వరకూ మాత్రమే వ్యక్తులతో ఆయన పరిచయాలు పరిమితమై ఉంటాయి. అందుకే ఆయన గురించి ఏ కొద్ది తెలిసినవారికైనా ఆయనపట్ల గౌరవభావమే ఏర్పడుతుంది.

''శాస్త్రిగారూ ఒక్కరే వెళ్తున్నారు... ? మాధవుడింకా ఊరినించి రాలేదా ?'' ఎవరో అడిగారు. బదులుపలకలేదు శాస్త్రిగారు. ఆయన ఇల్లు చేరేసరికి ఎండ ఫెళఫెళలాడ్తోంది. ఇంటి గుమ్మంలో అడుగుపెడ్తూ ఉండగా, ఆయన దృష్టి వీధి మొగలో చుట్ట తాగుతూ నిలిచిన కోటేశుపై నిలిచింది. నిరంతరం నీరుకావి పంచెలు కట్టే కోటేశు ఈ రోజు పాంటూ షర్టూ తొడగటంతో వింతగా కనిపిస్తున్నాడు. వారిద్దరి చూపులూ క్షణంసేపు కలిసి విడిపోయాయి. ఆయన కనిపిస్తేనే ''దండాలు బాబూ'' అంటూ దూరం నించే నమస్కరించే కోటేశు ప్రవర్తనలో ఏదో కొత్తదనం లిప్తకాలం ఆయనకి స్ఫురించి అంతలోనే అంతర్ధానమైంది.

భార్యని పిలిచి తడిపంచె ఆరవేయటానికి ఇచ్చి పొడిబట్టలు కట్టుకుని వీధి వరండాలో కూర్చున్న శాస్త్రిగారికి మాధవుడు తలపుకు రావటంతో మళ్ళీ అంతస్సంఘర్షణ ప్రారంభమైంది— తనదెంతటి బలహీనమైన మనసు ? వందల పర్యాయాలు గీతాపఠనం చేసిన తనికి కూడా, ఇంతటి ఐహిక బంధచింతనేమిటి ? మాధవుడు చేసిన దాంట్లో తప్పేముంది ? ఈ ముసలి తండ్రి వయసుకి వూడిగం చేస్తూ పెద్దరికానికి ప్రణామాలు చేస్తూ భవిష్యత్తుపట్ల బాధ్యతలను విస్మరించి వాడు మాత్రం ఎంతకాలం గడపగలడు ? వాడికీ పెళ్ళైంది. ఇవాళో రేపో తండ్రి కాబోతున్నాడు. బాధ్యతలూ అవసరాలూ పెరుగుతున్నాయ్. ఇకనైనా తనదైన వ్యక్తిత్వాన్నీ ఏర్పరుచుకోకపోతే ఎలా ? అందుకే వాడి నిర్ణయంలో తప్పేమీ లేదు. తనమీది భయభక్తులతో, ఎన్నడూ ఏమీ ఎదురు చెప్పని కొడుకుని తన యిష్టంవచ్చినట్టు, వృద్ధాప్యంలో తోడుంటాడనే స్వార్ధంతో, తన సిద్ధాంతాలకీ, అభిరుచులకీ అనుగుణంగా పెంచటం... తనదే తప్పు. అసలింతకీ...

వాకిట్లో రిక్షా ఆగిన చప్పుడు శాస్త్రిగారి ఆలోచనా ప్రవాహానికి అడ్డుకట్ట వేసింది. సామానులతో లోపలికి వస్తున్న రామశాస్త్రిని చూసేసరికి ఆయనకి ఆశ్చర్యానందాలు కలిగాయి. రామశాస్త్రి ఆయన రెండో భార్య సంతానం.

''నాన్నగారూ కులాసాయేనా బాగా చిక్కినట్టు కనిపిస్తున్నారేమిటి ? ఈమధ్యేమీ సుస్తీ చెయ్యలేదు కదా ?'' వరండాలో అడుగుపెడ్తూనే ప్రశ్నల వర్షం కురిపించాడు రామశాస్త్రి.

కొడుకు గొంతు విన్న మీనాక్షమ్మ విస్మయంతో బైటకి వచ్చింది. ''ముందు ఆ ప్రయాణం బట్టలు మార్చుకురా తర్వాత అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు'' అన్న ఆవిడ హెచ్చరికతో రామశాస్త్రి లోపలికి నడిచాడు.

మధ్యాహ్నం భోజనాల అనంతరం తను హఠాత్తుగా రావటానికి కారణం చెప్పాడు రామశాస్త్రి. ''అన్నయ్య మొన్న కృష్ణాపురం వెళ్ళినట్టు తెల్సింది. తను మళ్ళీ ఇప్పుడప్పుడే ఇక్కడికి రాలేకపోవచ్చు'' అని రాస్తూ, నన్నొకసారి యిక్కడకి వచ్చి మీ యోగక్షేమాలని అడిగిరమ్మన్నాడు. ఆ ఉత్తరం ఏదో అస్పష్టంగా ఉంది. ఎందుకైనా మంచిదని నేను వెంటనే బయల్దేరి యిక్కడకి వచ్చాను. అసలేం జరిగింది ?''

''ఇదుగో మీ అన్నయ్య కృష్ణాపురం వెళ్ళాక రాసిన ఉత్తరం. చదివితే నీకే అర్ధమౌతుంది.''

రామశాస్త్రి ఆ ఉత్తరాన్ని అందుకుని చదవసాగాడు.

''బ్రహ్మశ్రీ వేదమూర్తులైన నాన్నగారికి నమస్కరించి మాధవుడు వ్రాసేది. నేను ఈ ఉదయమే కృష్ణాపురం చేరాను. మీ కోడలు చి॥ సౌ॥ గాయత్రి ఆరోగ్యంగానే ఉంది. ఇతరత్రా ప్రధానమైన విషయాలేమీ లేనందున ఈ ఉత్తరం వ్రాయటంలో నా ఆంతర్యాన్ని విశదపరుస్తాను.

ఇటీవల చాలాకాలంనించీ నాలో ఏదో అసంతృప్తి పెరుగుతోంది. అగ్రహారంలో నిర్వ్యాపారంగా, లక్ష్యరహితంగా కాలం గడపటంపట్ల విసుగు జనించింది. మీ వృద్ధాప్యంలో మీకు శుశ్రూషచేస్తూ మీ బహుముఖ పాండిత్యాన్ని పరిగ్రహించటం వాంఛనీయమే అయినప్పటికీ, ఇల్లాలికి భర్తగా, బిడ్డలకి తండ్రిగా భవిష్యత్తులో నా బాధ్యతలని నెరవేర్చుకోవటానికి ముందు, నా వ్యక్తిత్వానికీ, సామర్ధ్యానికీ పరీక్ష పెట్టుకోవటం అవసరమనిపించింది.

ఇప్పటిదాకా ఎంత కృషి జరిపినప్పటికీ, మీ పాండిత్యంలో నాకు అబ్బింది బహు స్వల్పమే కావటం నా దురదృష్టం. బహుశా సనాతన విద్యలపట్ల నాలో అంతర్గతంగా ఉన్న వైముఖ్యమే అందుకు కారణం కావచ్చు. నా అయిష్టతను మీముందు వెలిబుచ్చేందుకు ఏనాడూ సాహసించలేకపోయాను. కాగా నాకున్న కొద్దిపాటి సంస్కృత పరిచయంతో, శ్రుత పాండిత్యంతో, అగ్రహారంలో మరోతరం జీవితాన్ని తీర్చిదిద్దడం అసాధ్యం అనిపించింది.

అందుకే నేను కృష్ణాపురం చేరాను. ఇక్కడి సంస్కృత కళాశాలలో చేరి, సంస్కృతంలో పట్టభద్రత పొందటం నా ప్రథమ లక్ష్యం. తరవాత తత్సంబంధమైనా ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోవాలని ఆలోచన. అంతవరకూ అపర కర్మలని నిర్వర్తించైనా ధన సంపాదన చేయాలని నా నిర్ణయం. నా లక్ష్యమూ, దాని సాధన విధానమూ మీకు నచ్చనివే కావచ్చు. అయినా మీ ఆశీస్సులని అర్థిస్తున్నాను. నా

యీా ప్రయత్నంలో నేను విఫలుడినైనప్పటికీ మీరు విచారించక్కర్లేదు. వైద్య వృత్తిలో రాణిస్తున్న తమ్ముడు మన కుటుంబానికి మళ్ళీ మీవలె ఖ్యాతి తేగలడు. వృద్ధాప్యంలో మీపట్ల నేను విస్మరిస్తున్న బాధ్యతని వాడు సంతోషంగా స్వీకరిస్తాడనే విశ్వాసంతోనే ఇలా వలసపోతున్నాను. పిన్నిగారికి నా నమస్కారములు... క్షంతవ్యుడు.

మాధవుడు.''

అతను ఉత్తరం చదవటం ముగించాక ఆ గదిలో కొన్ని క్షణాలు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

''నాన్నగారూ మీరు అన్నయ్యనికూడా నాలాగానే ఇంగ్లీష్‌చదువుల్లో పెట్టి ఉంటే ఈనాడు వాడికి ఈ అసంతృప్త భావన ఉండేది కాదేమో.''

నిర్లిప్తంగా నవ్వారు శాస్త్రిగారు. ''ప్రతి తండ్రికీ, ఇంటి పెద్దకొడుకు తన అడుగు జాడల్లో నడిచి తనని మించినవాడు కావాలనే కోరిక ఉంటుంది. ఛాందసమేనేమో ! నేనూ అలానే ఆశించాను. ఇక ఇంగ్లీషు చదువుమాటకి వస్తే – నిన్ను వేద పాఠశాలలో చేర్చుదామని నేనంటే మీ అమ్మ నీ తరఫున పోరాడి, నిన్ను మీ మేనమామల ఊళ్ళో ఇంగ్లీషుబళ్ళో పెట్టింది.. వాడికలాటి అవకాశంలేదు... పుట్టిన పదో రోజునే తల్లిని పోగొట్టుకున్న దురదృష్ట వంతుడు... !''

''నేనొకసారి కృష్ణాపురం వెళ్ళి అన్నయ్యకి నచ్చచెప్పి తీసుకురానా ?'' అడిగాడు రామశాస్త్రి.

''ఒద్దు ! వాడిని మళ్ళీ నా పెద్దరికానికి బందీని చెయ్యటం నాకిష్టంలేదు. అయినా ఏదో ఒకరకంగా వాడిని మళ్ళీ ఇక్కడికి తీసుకు వచ్చావే అనుకో...''

''నమస్కారం శాస్త్రిగారూ'' వరండాలో ఎవరిదో గొంతు వినిపించి ఇద్దరూ అటు చూశారు.

ఆ వూరి పంచాయితీ ప్రెసిడెంటు రామిరెడ్డి, కరణమూ, మున్సబూ, ఆలయ పూజారీ, ధర్మకర్తలూ, ఇంకా ఊళ్ళో కాస్త పేరుగల ఒకరిద్దరు పెద్దలూ, ఒకరొకరూ లోపలికి ప్రవేశించారు. ఊరి పెద్దలంతా అలా ఒక్కసారిగా రావటానికి కారణాన్ని ఊహించలేక విస్మయంగా చూశారు శాస్త్రిగారు.

''శాస్త్రిగారూ విన్నారా ఈ దారుణం ?'' వస్తూనే అడిగాడు రామిరెడ్డి.


''ఏమిటి...? ఏం జరిగింది ?''

''అయితే మీకింకా తెలీదన్న బాట. మొన్న రాత్రి మాలగూడెంలో అయిదు వందల మంది స్త్రీ పురుషులని మరో మతం వారు తమ మతంలోకి మార్పించారుట. నిన్నట్నుంచీ ఊరంతా ఈ విషయంమీద గగ్గోలుపడి పోతోంది. మతం మార్చుకున్న ఒక్కొక్క వ్యక్తికీ వంద రూపాయల సొమ్మూ, రెండు జతల బట్టలూ, పది కిలోల బియ్యమూ యిచ్చారుట. మనం ఈ దుష్ప్రయత్నాలని ఇలా సాగనివ్వరాదు. మనం త్వరపడకపోతే ఇలాటి మతం మార్పిళ్ళు మన మతం మనుగడకే ప్రమాదంగా పరిణమిస్తాయి'' ఆవేశంగా అన్నాడు రామిరెడ్డి.

ఆ ఉదయం కోటేశులో తను చూసిన కొత్తదనానికి అర్థమేమిటో అప్పుడే అవగతమయ్యింది శాస్త్రిగారికి. ''సరే ఇప్పుడు ఏం చెయ్యాలని, నిర్ణయించారు ?''

ఆలయ ధర్మకర్త ఒకరు గొంతు సవరించుకున్నారు. ''అయ్యా మొన్నటి సంఘటన తర్వాత ఊళ్ళో ఉద్రేకాలు పెచ్చు పెరుగుతున్నాయి. ఆ విషయం గురించి జిల్లాకలెక్టరుకీ ప్రభుత్వంలోని ఇతర ముఖ్య వ్యక్తులకీ టెలిగ్రాములు పంపించాము. రెండు మూడు రోజులలో ఇక్కడికి ప్రముఖ రాజకీయనాయకులూ, పీఠాధిపతులూ విచ్చేసి మతాంతరీకరణని ఖండిస్తూ హిందూ ధర్మ విశిష్టత గురించి అందరికీ అవగతమయ్యేలా ప్రచారం చేస్తారు. ఈలోగా ఊరి పెద్దలంతా ఒకసారి ఆ మాల గూడెంలో పర్యటించి, మతం మార్చుకున్నవారు తిరిగి మన మతంలోకి వచ్చేటట్టు నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తారు. ఈ యావత్తు కార్యక్రమంలో భాగంగా ఈ రెండు మూడు రోజులూ గూడెంవద్ద రామాలయం అరుగుమీద మీరు గూడెం ప్రజలకి అర్థమయ్యే రీతిలో మన మత విశిష్టత గురించి ప్రసంగాలు చెయ్యాలని మా మనవి. క్లిష్టమైన మత విషయాలు అందరికీ సులభ గ్రాహ్యంగా చెప్పగల బాధ్యతని మీరు మాత్రమే నిర్వర్తించగలరని మా అభిప్రాయం. ఇక మీ అంగీకారమే మిగిలి ఉంది''...

శాస్త్రిగారు ఏమీ బదులు చెప్పలేదు.



మనిషి-మతం-మనుగడ

అప్రయత్నంగానే ఆయనలో అంతర్విమర్శ ప్రారంభమైంది. ఆ క్షణంలో ఆయన మనో ఫలకంపై ఒక వంక మాధవుడూ, మరోవంక కోటేశూ ప్రత్యక్షమయ్యారు. పెద్దరికం పేరుతో మాధవుడి అభిరుచుల్నీ అభిప్రాయాలనీ, తానిన్నాళ్లూ అణగదొక్కాడు. సహించినంత కాలం సహించి, ఈనాటికి, కుటుంబం నించి వేరుపడి దూరమయ్యాడు మాధవుడు. కొటేశుకీ మాధవుడికీ తేడా ఏముంది ? మతం అంటే ఏమిటి ? అదొక బృహత్కుటుంబం కాదా? ఒక కుటుంబంలా మెలుగుతూ సహోదర ప్రేమ చూపవల్సిన తన మతంవారే, కులంపేరుతో అంటరానితనాన్ని ఆపాదించి అవమానిస్తే, ఆ కుటుంబం నించి బైటకి నడిచాడు కోటేశు. మతం ...

"శాస్త్రిగారేదో దీర్ఘాలోచనలో పడినట్టున్నారు...?" రామిరెడ్డి హెచ్చరికతో తన ఆలోచనలకి స్వస్తి చెప్పి బదులు పలికారు, శాస్త్రిగారు.

"పెద్దలందరికీ నా నమస్కారం. నా నిస్సహాయతకి నన్ను క్షమించాలి. హిందూమతం విశిష్టత గురించీ, పరమోత్కృష్టత గురించీ నాకు తెలియకకాదు. ఇంతటి మహోత్కృష్టమైన మతమూ నేడు శాపగ్రస్త అయిందేమో అనే నా భీతి. మతం అంటే యోగం అనీ, కలిపి ఉంచేది అనీ అర్థం. కానీ మనమేంచేస్తున్నాం ? మతం పేరిట, కులాలుగా విడివడి, సాటిమనిషిని అంటరాని వాణ్ణిగా అవతలకి తరుముతున్నాం. అవమానాలకి గురిచేస్తున్నాం. ఒక్క కుటుంబంలోని సభ్యులైన సహోదరులే పరస్పర గౌరవం కొరవడినప్పుడు రక్తసంబంధాన్ని తెంచుకుని వేరుపడటం మనం చూస్తున్నాం. ఇక మతమనే ఈ విశాల కుటుంబంలో, అవమానాలకీ అన్యాయాలకీ గురి అయిన వారు, సమానత్వంతో స్వాభిమానంతో మనుగడ సాగించేందుకు మరో మతంలోకి తరలిపోయారంటే ఆ తప్పు వారిది కాదు వారిని అంటరాని వారిగా వెంటపడి తరిమిన ఈ అగ్రజులదే ... ఏదోరకంగా వారిని మభ్యపెట్టి మళ్లీ ఇటువైపు గీత దాటించినా, వారికి సభ్య ప్రపంచంలో సమాన గౌరవం లభిస్తుందని హామీ యివ్వగల వారేరీ ? ... అందుకే ఇటువంటి సంఘటనలు ఒకటి రెండు పునరావృతమైతే అది హిందూమతాన్ని నిజంగా ప్రేమించే వారిలో క్రియాత్మకమైన పరివర్తనని తెస్తుందనీ, అర్హతలేని పెద్దరికాన్నీ పెత్తనాన్నీ ప్రదర్శించేవారికి హెచ్చరిక అవుతుందనీ విశ్వశిస్తున్నాను. మీ సూచనపట్ల నా అనంగికారాన్ని ఇంతకంటే వివరంగా చెప్పలేను. సెలవ్ !"

చేతులు జోడించి వినమ్రంగా వారందరికీ నమస్కరించి అక్కణ్ణించి నిష్క్రమించారు శాస్త్రిగారు. ★

వారఫలం

30-12-1983 శుక్రవారం మొదలు 5-1-1984 గురువారం వరకు

♈ మేషం: శుభ దాయక వారం. ధనలబ్ధికి అవకాశం గలదు. రావలసినదీ అధికంయివ్వ వలసిన దీ అంతే, వ్యాపారంలో నూతన మార్పులు చేయాలంటే సమయం గాదు. ప్రభుత్వాదరణ చేకూరుతుంది. స్త్రీలకు: వృత్తి ఉద్యోగాలలో అనుకూలత చేకూరుతుంది.

♉ వృషభం: ప్రయాణం చేయ వలసిన పరిస్థితులుంటాయి. అయినా, ఏదో కారణంగా చాల మందికి ప్రయాణించుటకు అవకాశంలేదు. బంధువులు అనుకోకుండా యింటికి రాగలరు. స్త్రీలకు: నూతనాంశాలు గ్రహించటం, నూతన మార్గాలలో ఆదాయం చేకూరటం సంభవం. గ్రహించండి.

♊ మిధునం: ఉత్తర ప్రత్యుత్తరాలు ఆనంద దాయకంగా ఉంటాయి. వ్యవహారం ఏదయినా ఉంటే ఈ వారంపరిష్కారం కానున్నది. చాల కాలంగా చేతికి అందని ధనం అందటం, అవసరాలు తీరటం సంభవం. ఆరోగ్యం లో కించిత్తు లోపం ఏర్పడుతుంది. స్త్రీలకు: బంధు సమాగమం, వృత్తిలో పెంపు సంభవం.

♋ కర్కాటకం: వినోదం సంభవం. సంఘ కార్యాలలోవిలంబనం కనిపిస్తుంది. చాలమందికి రాజకీయంగా ఏదో మేలు సంభవించే అవకాశ మున్నది. ప్రజ్ఞ రాణించటం, తద్వారా ధన లాభం చేకూరటం సంభవం. స్త్రీలకు: చాలమందికి ఉద్యోగ రీత్యా అనుకూలం కనిపిస్తుంది.

♌ సింహం: శుభ ప్రదాయక వారం. పేరు పెంపులకు అవకాశం ఉన్నది. ఉద్యోగ రీత్యా మేలు చేకూరుతుంది. వివాదాలుంటే సుకరంగా పరిష్కరింప బడుతాయి. స్త్రీలకు: ఇంటి పనులందు శ్రమ, అధికంగా వ్యయం చెప్ప దగిన అంశాలు గ్రహించాలి.

♍ కన్య: సాటి వారితో వివాదం సంభవం. అంతే గాక భూ సంబంధమో, గృహ సంబంధం గానో వివాదం కూడా సంభవమే. ఎంత శాంతంగా ఉంటే అంత మంచిది. మాతృ వర్గం వారితో వివాదం కూడా చెప్ప దగిన అంశం. స్త్రీలకు: ధన లోపం, అధిక శ్రమ, రుణదాతల వత్తిడి, యిలాంటి వ్యవహారాలు అనుభవానికి రాగలవు.

♎ తుల: 'అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి' ఆశించేది ఒక చోట నుండి, ధనరాబడి మరియొక చోటి నుండి. ఉద్యోగం 'ప్రమోషన్' ఎదురు చూడ దగిన వారం. ఒకానొక విషయంలో మేలు చేకూరుతుంది. స్త్రీలకు: సాహితీ పరంగా మేలు చేకూరుతుంది. గ్రహించండి.

♏ వృశ్చికం: వృత్తి లో పెంపు కనిపిస్తుంది. ఆర్థికరంగాన మెరుగు కనిపిస్తుంది. చాలమందికి అప్పులు కూడా వసూలు అయ్యే మార్గ మున్నది. వాహనం కొరకు ఎదురు చూచిన పరిస్థితి అనుకూలంగా తేలిపోతుంది. స్త్రీలకు: ముఖ్యంగా శుభకార్య సంబంధంగా మేలు చేకూరుతుంది.

♐ ధనుస్సు: ఆర్థికంగా అనుకూలమైన వారం. భూగృహాలు అభివృద్ధి పొందించే ప్రయత్నం సాగిపోతుంది. ఉద్యోగం లో నూతనంగా అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి. ఒకానొక గృహ సంబంధ వ్యవహారం పరిష్కారం కానున్నది, గ్రహించండి. స్త్రీలకు: సాంఘికంగా మేలుచేకూరేవారం. రాజకీయంగా అనుకూల దినాలే.

♑ మకరం: మీ శక్తి సామర్థ్యాలు రాణింపునకు రానున్నవి. నటనా సామర్థ్యం రాణిస్తుంది. రచనా వ్యవహారంలో ధనాదాయం చేకూరుతుంది. అప్పులుంటే వసూలు కాగలవు, యత్నించి చూడండి. స్త్రీలకు: నూతనాంశాలు అనుకూల దాయకాలు, నూతన వస్తు సేకరణకు అవకాశం కూడా గల వారమే.

♒ కుంభం: రాజకీయంగా మేలు చేకూర గల దినాలు, మీ ప్రయత్నాలు సానుకూలం గలవు. అప్పులు యింటికి రానున్నారు. ఉద్యోగ వృత్తులందు ప్రగతి కనిపిస్తుంది. స్త్రీలకు: ధన లబ్ధి, వృత్తి యందు అభివృద్ధి వాహన సౌఖ్యం చేకూరుతుంది.

♓ మీనం: పోగొట్టు కొన్న వస్తువులను గూర్చి పరితపించి లాభం లేదు, మతిమరపునకు అవకాశమున్నది. తోడివారి వలన కూడా చికాకు ఏర్పడ గల వారం. రాజకీయంగా మేలు ఆశింప దగిన వారం గాదు. అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతాయి. స్త్రీలకు: శ్రమకు తగిన ఫలితం, ఉద్యోగంలో ఒక అంతస్థు పైకి ఎక్కగల మార్గాలుంటాయి. గ్రహించండి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

వ్యక్తిగతం



కుష్టు రోగుల సేవకి జీవితాన్ని అంకితం చేసిన మురళీధర్ దేవీదాస్ ఆమ్‌టెకి ఇటీవలే డేమియన్–డాట్టన్ బహుమతి లభించింది. 69 ఏళ్ల ఈ స్వచ్ఛంద సేవకుడికి వచ్చిన ఎన్నో బహుమతులలో ఇదొకటి...

పార్టీ మారిస్తే లక్షలు ఇస్తానన్న వాడుగా పేరు పొందిన కర్నాటక కాంగ్రెసు(ఇందిర) పార్టీ నాయకుడు శ్రీ వీరప్పమొయిలీ..





శ్రీ వీరప్పమొయిలీ తనకి ఆశ చూపారన్న నాయకుడు శ్రీ బైరెగౌడ ...

క్రికెట్ బాట్స్‌మన్‌గా బ్రాడ్‌మన్‌తో సరితూగే వాడని ప్రశంస లందుకుంటున్న భారతీయుడు సునీల్‌గవాస్కర్...



ఈ బ్రహ్మచారి గారి అసలు పేరు (ధీరేంద్ర) శర్మ. చౌదరి అనే బిరుదు వీరి కుటుంబానికి ఉంది. పండిత నెహురూ కుటుంబానికి ఆప్తులుగా చెలామణి అయ్యేవారు. సొంత విమానం, ఆపిల్ పళ్లు తినే ఆవూ, ఎయిర్‌కండిషనింగ్ చేసిన కుటీరం వగయిరాలు ఉన్నాయనీ అనేవారు. ఈయనకి తుపాకుల ఫ్యాక్టరీ ఉందని ఈ మధ్యనే తెలిసింది. అంతేకాదు, దొంగతనంగా తుపాకులు ఎన్నో దిగుమతి చేసుకుని దాచుకున్నారనికూడా వార్తలు చెబుతున్నాయి...





సాంగ్లీలో లోకసభ ఉప ఎన్నికలో అసమ్మతి వర్గాలు ఓడగొట్టటానికి ప్రయత్నం చేసినా నెగ్గినట్లు ప్రసిద్ధి పొందారు మహారాష్ట్ర ముఖ్య మంత్రి సతీమణి శ్రీమతి శాలినీతాయి...

సీరియల్

యక్షగానం

ప్రఖ్యాత

శ్రీమతి మాదిరెడ్డి సులోచన

శివాజి ఇంట్లోకి వచ్చి, విషయమంతా పార్థసారథికి చెప్పాడు.

''మనిషి మంచిదేనా !''

''నాకు మంచిదానిలాగే కనిపించింది. రెండు మూడు సార్లు చూచాను'' అన్నాడు.

''సరేలే. ఒక స్త్రీ అంటూ ఇంటికి ఉంటే చాలా మంచిది'' అన్నాడు.

శివాజి గదిలోకి వచ్చి, సిగరెట్టు వెలిగించు కున్నాడు. స్వతంత్రని వివాహం చేసుకుందాం అనుకున్నప్పుడు, కల్గిన ఊహాలు కలగటం లేదు. మనసు స్థబ్దంగా ఉండిపోతుంది. కారణం ఆ అమ్మాయికి, తనకు వయసులో తేడా ఉండటం మూలంగానా !

అతను పొగ వదులుతూ అలాగే ఉండి పోయాడు.

మర్నాడు అతను బ్రేక్‌ఫాస్ట్ చేసి నర్సింగ్ హోమ్‌కు బయలుదేరుతుండగా నీలిమ ఫోన్ చేసింది.

''హల్లో ! డాక్టరుగారా! నేను నీలిమను!''

(గత సంచిక తరువాయి)

''ఎస్ నీలూ ! వ్వాట్ కెన్ అయిడూ ఫార్ యు ?''

''డాక్టర్‌గారూ ! ఒక్క విషయం ! మీరే మనుకోనంటే ...''

''డాక్టరుగారూ!... బాలేదు. శివా అను.''

''ఊహూ ! అనలేను. డాక్టరుగారూ. మా అమ్మ డబ్బు పోయి దాదాపు పిచ్చిదయినట్టుంది. రెండవ సంబంధం అని గొడవ చేస్తుంది. నేను పట్టుబట్టాను. దాంతో ఒక కోరిక కోరింది.''

''చెప్పు నీలూ !''

''తను మిమ్మల్ని చూచి సాటిస్‌ఫై అవ్వాలట ...''

''ఐ సీ ...''

''ఆమెకు మీరు తప్పక నచ్చుతారు. కాని ఒక చిన్న అబద్ధం ...'' నసిగింది.

''చెప్పు నీలూ !''

''రెండో సంబంధం అయినా ముప్పై రెండేళ్లని చెప్పాను.''

జరిగిన కథ — 9 : నీలిమ, ఆదిత్య పరస్పరం ప్రేమించుకొంటారు. వారిద్దరూ కలసి చిన్నబాబు అసలు రంగు బయటకు లాగుతుంటారు. నీలిమని, చిన్నబాబుకిచ్చి పెళ్లి చేసే విషయంలో నందనరావు, ముకుందాదేవి ఘర్షణ పడతారు. తన అత్త చనిపోయిన కారణంగా మళ్లీ పెళ్లి చేసుకోవటానికి ప్రయత్నాలు చేస్తుంటాడు వసంత సహాయంతో డా॥ శివాజి. స్వతంత్రను పరిచయం చేస్తుంది వసంత డా॥ శివాజికి. ఆదిత్య డా॥ శివాజి హాస్పటల్లో రోగులకు ఫిజియో థెరపీ చేయించటానికి జేరతాడు. డా॥ శివాజి, వసంతల వ్యవహారం ప్రత్యక్షంగా తెలుసుకొన్న స్వతంత్ర ఓ ఉత్తరం ద్వారా తన నిర్ణయాన్ని శివాజికి తెల్పుతుంది. ఇక తను ఆడే నాటకాన్ని విరమించాలని ప్రయత్నిస్తుంటుంది ముకుందాదేవి. ముకుందాదేవి ఇంట్లో దోపిడి జరుగుతుంది. తను ఇంతకాలం నాటకం ఆడి భక్తుల ముడుపుల ద్వారా సంపాదించిన సొమ్మును కొంచెం కూడా మిగల్చకుండా ఎత్తుకుపోతారు. ముకుందాదేవి ఆదిత్యపై నేరం మోపి అరెస్ట్ చేయిస్తుంది. చైనులూ, రాయుడూ కలసి ఈ దొంగతనం చేశారని నీలిమ చెప్పినా వినదు. ఆ ఆస్తి కోసమే కాచుక్కూచున్న సావిత్రి తన కొడుకుతో వెళ్లిపోతుంది. డాక్టర్ శివాజి ఇచ్చిన పేపర్ ప్రకటన చూసి అప్లికేషన్ పెట్టిన నీలిమను ఆహ్వానిస్తాడు శివాజి. వారిరువురూ మాట్లాడుకొన్న తర్వాత గుళ్లో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొంటారు.

''మైగాడ్ ! పదేళ్లు తక్కువ చెప్పావా !''

''వీళ్లు సాంప్రదాయం అంటారు, ఫలితాలు ఆలోచించరు. ఈడు, జోడు అంటారు. పరిస్థితి ఆలోచించరు. అందుకే... అందుకే ...''

''నేను చెబితే గుర్తించదా !''

''అవకాశం లేదు. మీరు ముప్పైరెండేళ్ల వారిలా కనిపిస్తారు'' అన్నది.

''థాంక్స్ ఫర్ ద కాంప్లిమెంట్స్.''

''కాంప్లిమెంట్స్ కాదు. నిజం అంతే డాక్టరుగారూ ! అరవింద్‌ను చూచి కూడా అను మానించటానికి వీలులేదు.''

''ఓ. కె... కేసు ఏమయింది ?''

''ఆదిత్యకే ఉచ్చులు బిగుస్తున్నాయి. పూర్ ఫెలో. వాళ్లు చాలా పకడ్‌బంధీగా ప్లాన్ వేసారు. నాన్న తాగే పాలలో నిదుర మాత్రలు వాళ్లు వేసారు. ఆదిత్య ఇచ్చాడు.''

''పూర్ గయ్ !''

''డాక్టరుగారూ ! మొన్న మీరు అడిగారు ఎవరినయినా ప్రేమించారా అని. నేను ఆదిత్యను ప్రేమించాను ...'' ఆమె గొంతు భారంగా వినిపించింది. అతను మౌనంగా ఉండిపోయాడు.

''వినటానికి మీకు ఇబ్బందిగా ఉన్నా, వినక తప్పదు. మిమ్మల్ని మభ్యపెట్టలేను. అతనంటే అమ్మకు మొదటి నుండి కోపం'' అన్నది.

''అతను నిర్దోషిగా తిరిగివస్తే...''

''రానివ్వండి. కాలం కరిచిన వ్యక్తులలో ఒకడు అవుతాడు'' అన్నది. అతను జవాబు ఇవ్వలేదు.

''మీకింకా అనుమానంగా ఉందా ! ''

''అదేంలేదు. మీ అమ్మగార్ని ఎక్కడ చూద్దాం.''

''రేపు నాన్నగార్ని చూడటానికి వచ్చినట్టు మా ఇంటికి రండి'' అన్నది.

''ఓకె.'' అన్నాడు ఫోన్ పెట్టేసాడు.

యెన్ని మార్పులు వచ్చినా, రాకెట్

యుగంలో కూడా స్త్రీకి పెళ్లి అంటే ఓ యజ్ఞం అయింది. ఇక యెప్పుడు మారుతుంది ఈ సమాజం! అతను ఒక్క నిముషం ఆలోచిస్తూ నిలబడి పోయాడు.

రేపు తను ముసలివాడయితే వసంతలా నీలిమ కూడా...


చేస్తే తప్పేమిటి ! అంతరాత్మ నిలదీసింది.

అతను ఇక ఆలోచించక ఆస్పత్రికి వెళ్లి పోయాడు.

''సర్ మీకు ట్రంక్ కాల్...'' సిస్టర్ చెప్పింది.

''హల్లో...శివా హియర్...వసూ...ఏమిటి కొడుకు పుట్టాడా? కంగ్రాచ్యులేషన్స్... చంద్రసేన్‌గార్ని అడిగానని చెప్పు... నాదేముంది రొటీన్...ఆ కుదిరిందో సంబంధం... వివరాలు ఉత్తరం రాస్తాను... నిజంగా... ఉంటాను...'' ఫోన్ పెట్టేసాడు.

అతను గదిలో నుండి బయటికి పోబోయాడు.



''సర్ ఫోన్...''

''మళ్ళీ యెవరు ?''

అతను ఫోన్ ఎత్తగానే అతని ముఖం ప్రసన్నంగా మారింది.

''హల్లో నీలూ! ఏమిటి ?'' అన్నాడు.

''డాక్టగారూ ! ఎల్లుండి సాయంత్రం అమ్మే మీ ఇంటికి వస్తుందట, మిమ్మల్ని ఒంటరిగా చూడాలట ..''

''కంగారెందుకు డియర్ ! అలాగే రానీ.''

''గు ర్తుం ది గా... మీ కు ము ప్పై రెండేళ్ళే...'' అన్నది కాస్త మెల్లగా.

''ఓ. కె.'' అన్నాడు నవ్వుకుంటూ. ఎంత చిత్రం? ఇంత చిన్న విషయం కోసం అబద్ధం ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అతను ఫోన్ పెట్టేసాక అనిపించింది. టుది పాయింట్ ఆన్సర్ చేసాడు. ఆ అమ్మాయి ఏమనుకుంటుందో ఏమో !

మళ్ళీ తను ఫోన్ చేసాడు.

''హల్లో ! ముకుందాదేవిని ... ఎ వ రు కావాలి !''

అతను ఒక్క నిముషం ఉలిక్కిపడ్డాడు. ఈ గొంతులో మధుర గాంభీర్యం ఎప్పుడో, ఎక్కడో విన్నట్టుంది. ఎక్కడ ... యెవరిదా కంఠం ! యెవరిది ?

''మాట్లాడరేం ?''

''నీలిమ కావాలండీ...''

''ఒక్క నిమిషం... నీలూ !...'' అంటూ పిలిచింది.

ఆ పిలుపులో ప్రత్యేకత, ఆప్యాయత గమ్మత్తుగా ఎక్కడో, ఎప్పుడో చవిచూచినట్టు అనిపించింది. ఎక్కడ... అతని స్మృతి పథంలో పొరలు విచ్చుకోవటానికి చాలా శ్రమపడ్డాయి.

''హల్లో ! డాక్టరుగారా !''

''అవును నీలూ ! నేనేనని యెలా ఊహించావు.''

''నాకు ఫోన్ చేసే మగాళ్ళెవరండీ ?''

''ఇందాక, త్వరగా ఫోన్ పెట్టేసాను. ఏమయినా అనుకున్నావేమోనని...''

''అనుకోవటానికేముందండీ! మీరు బిజీ డాక్టరని తెలియదా ! మీ ప్రియురాండ్రు రోగులే కదా'' అన్నది నవ్వుతో.

''థాంక్స్ ఫర్ యువర్ అండర్‌స్టాండింగ్'' అన్నాడు.

నీలిమ అలాగే నిలబడిపోయింది. ఈ మాత్రం గ్రహింపు ఉన్న మగాడయితే చాలు, తను సుఖపడగలదు.

''నీలూ ! ఒక చిన్న ఇన్‌ఫర్‌మేషన్ కావాలి.''

''ఏమిటది !''

''మీ అమ్మగారెప్పుడయినా బాంబేలో ఉన్నారా !''

''ఎందుకడిగారా మాట. బాంబే కాదు

యక్షగానం

కదా, ఆంధ్రదేశంలోనే ఏ ఊళ్ళు చూడలేదు అమ్మ'' అన్నది.

''అయినీ... మీ అమ్మగారికి స్వాగతం పలుకుతాం'' అన్నాడు నవ్వుతూ. అతనే ఎక్కువ మాట్లాడాడు.

16

ఆరోజు ఆదిత్యను ఇంటరాగేట్ చేస్తారు కోర్టులో. అందుకే త్వరగా తయారయి వెళ్ళింది నీలిమ. అతను దొంగ కాదని తెలుసు. కాని న్యాయం దృష్టిలో అది తను నిరూపించలేదు. పోలీసుల వెంటవస్తున్న అతన్ని కోర్ట్ ఆవరణలో కలుసుకుంది.

''ఆదిత్యగారూ !'' ఆమె కళ్ళు నిండు కున్నాయి.

''నీలూ !''

''ఆదిత్యా! ఆ పిలుపులోనే అర్థం అయింది.

> **స్వభావం !**
>
> ఆకాశంలాంటి మనస్సులో
> అప్పుడప్పుడు ...
> కారుమేఘాలనే కష్టాలు
> ఉరుములు...మెరుపులనే ఆందోళనలు
> వర్షపు నీరనే కన్నీరు...
> తరువాత మళ్లీ మామూలుగా
> నిర్మలం... ప్రశాంతం...
> ఇది ప్రకృతి మానవ ప్రవృత్తుల
> స్వభావం !
>
> — ఎస్.వి.ఆర్. సత్యనారాయణమూర్తి

నువ్వు నన్ను అపార్థంచేసుకోలేదని. థ్యాంక్యూ... థ్యాంక్యూ...''

''ఆదిత్యా !...నేనొక విషయం చెప్పాలి.''

''చెప్పు నీలూ... సందేహించకు. నిందా మునిగాక, చలేమిటన్నట్టుంది. ఎంత చేదయినా భరిస్తాను.''

''ఆదిత్యా ! ఈ రోజు మా కంటూ ఒక్క పైసా లేదు, ఆ ఇల్లు తప్ప. పూజా మందిరం లోకి మేం మారి, మిగతా ఇల్లు అద్దెకిచ్చినా గడవటం కష్టంగా ఉంది... నాన్నకు వైద్య సదుపాయం కావాలి...''

''చెప్పు నీలూ !''

''నన్ను అపార్థం చేసుకోకు. అసహాయు రాలని... నేను... నేను...'' అన్నది.

''నాకు తెలుసు నీలూ ? నేను నిర్దోషినని నువ్వు గ్రహిస్తే చాలు.''

''నాకు తెలుసుకాని, నా సాక్ష్యం నీకు ఏ విధంగా ఉపయోగించదు. నిన్ను ప్రేమించాను కాబట్టి నీ తరఫున సాక్ష్యం చెప్పాను అను కుంటారు.''

''నాకింకా ఆరిపోతున్న ఆశ చిగురిస్తుంది నీలూ ! న్యాయం నిదురబోతుంది. చచ్చిపోలేదు'' అన్నాడు.

''ఏమిటో ... కాలమే తేల్చాలి ... నేను ... నేను ...''

''చెప్పు నీలూ !''

''నేను ... నేను డాక్టర్ శివాజిని పెళ్లి చేసుకుంటున్నాను.''

''ఎవర్నీ ... ఎవర్ని ?'' ఉ లి క్కి ప డి అడిగాడు.

''డాక్టర్ శివాజీగార్ని ... లేకపోతే నా కుటుంబం వీధిలో నిలుస్తుంది.''

''కంగ్రాచ్యులేషన్స్ ! అతను చాలా మంచి డాక్టరు. మంచి వ్యక్తికూడా ... '' అన్నాడు అతి కష్టంమీద.

''నా స్థితి దృష్టిలో ఉంచుకుని ఆలో చించు'' అన్నది.

''పదండి ... '' పోలీసులను తనే తొందర చేసాడు. నీలిమ కూడా ఆపే ప్రయత్నం చేయ లేదు. సరిగ్గా పదిన్నరకు అందరూ హాజరు అయ్యారు. ఇంటారేగేషన్ ప్రారంభం అయింది.

బోనులో ఆదిత్య నిలబడ్డాడు. అతనిచేత ప్రమాణం చే యిం చా రు. అతనిలోని ఆ స్థిరత్వమే ఆమెకు నచ్చింది. యెప్పటి చిరు నవ్వుతో, ఎప్పటిలా నిలబడి ఉన్నాడు.

''మీ పేరు ?''

''ప్రణతుల ఆదిత్య.''

''మీ నాన్న పేరు ?''

''కమలాకరరావు. ఆయన హెచ్. ఎమ్. టి.లో ఇంజనీరుగా పనిచేస్తూ చనిపోయారు'' అన్నాడు.

''మీ అమ్మ !''

''ఆమె నాకు డిగ్రీ వచ్చేవేళకు తప్పు కుంది.''

''నీవేం ఉద్యోగం చేసేవాడివి ?''

''ఉద్యోగ ప్రయత్నం చేస్తూ, చేస్తూ ఒకరోజు కృష్ణకుంట్‌లో పాటలు వినిపిస్తే వెళ్లాను. అప్పటికి రెండురోజులయింది భోజనం లేక. స్పృహతప్పి పడిపోతే, నందనరావుగారు నాకు ఆశ్రయం ఇచ్చి, నా వివరాలు విన్నాక, నాకు ప్రభుత్వ ఉద్యోగం కాని, పర్మనెంటు ఉద్యోగం వచ్చేవరకు, తన దగ్గర పని చేయమన్నారు'' అన్నాడు.

''అది ఆయన భార్యాబిడ్డల ఇష్టంతో జరిగిందా !''

''నాకు తెలియదుకాని, అంకుల్‌కి నేనంటే ఎంత అభిమానమో. ఆంటీకి కోపంగా ఉండేది'' అన్నాడు.

''ఆమె కోపం బహిర్గతంగా ప్రకటిం చిందా !''

''లేదు. నా అనుమానం మాత్రమే.''

కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామా గల తపాలాబిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా నాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

భారతి

భారతి పాఠకులకి మనవి

భారతి మొదటి సంచిక వెలువడి 1984 జనవరితో 60 సంవత్సరాలు పూర్తి అవుతుంది.

ఈ 60 సంవత్సరాలలో మా భారతిలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఎన్ని మార్పులు వచ్చినప్పటికి భారతి తెలుగువారి సంస్కృతికీ, వారి సంస్కృతిలోని ఉత్తమమయిన అంశాలకీ, ప్రతిబింబంగా ఉంటూ వచ్చింది. ఇకముందు కూడా ఈ సంప్రదాయాన్నే భారతి కొనసాగించగలదు.

కొన్ని సంవత్సరాలుగా భారతిలో కథలకి (చిన్నవికాని, పెద్దవికాని) అంతగా చోటు ఉండటంలేదు! ఈ లోపాన్ని సరిదిద్దటం కోసం ఇకమీద భారతిలో కథలనీ, నవలలనీ ఎక్కువగా ప్రచురించటానికి నిశ్చయించుకున్నాము!

పాత భారతి సంచికలతో పరిచయం కలవారికి ఇదేమీ కొత్తగా ఉండదు. ఒకప్పుడు భారతిలో ఇప్పుడు కొన్ని వార పత్రికలలో, మాస పత్రికలలో ఉన్నట్లు కథలూ, నవలలూ పుష్కలంగానే ఉండేవి!

కథలూ, నవలలూ ఎక్కువగా వేసినంతమాత్రాన భారతిలో పడే కవిత్వానికీ, వ్యాసాలకీ ఎటువంటి కొరతా ఉండదని వేరే చెప్పనక్కరలేదు!

వీలువిపట్టి, భారతి స్థాయిని అనుసరించి అట్టనికూడా మార్చగలము!

భారతికి ఎప్పటిలాగే పాఠకుల ఆదరాభిమానాలు లభించగలవని ఆశిస్తున్నాము!

యక్షగానం

"ఆమెని దేవుడు ఆవహిస్తాడని అవతారం ఎత్తేదట. దాని గురించి నీకేం తెలుసు ?"

"నాకేం తెలియదు. దాని గురించి ఆలోచించే సమయం, అవసరం నాకు కలుగలేదు" అన్నాడు నిబ్బరంగా.

"అక్కడికి వచ్చే భక్తులతో నీకు పరిచయం కల్గిందా ?"

"నాకు పని కట్టుకుని పరిచయం పెంచుకోవలసిన అవసరం కలుగలేదు. యెవరన్నా పలుకరిస్తే పలికేవాడిని." అన్నాడు.

"వాళ్లు నిన్నేం అడిగేవారు."

"యెక్కువమంది ముకుందాదేవి ప్రత్యేక దర్శనము ఇప్పించమని కోరేవారు. ఒకరిద్దరు ఇంక్విజిటివ్‌గా దేవుడున్నాడా అని అడిగేవారు."

"నీవు ఏం చెప్పావ్ ?"

"నేనక్కడ మామూలు గుమస్తాను. లెక్కలకంటే కూడా నాకు నందనరావు సేవ ముఖ్యం అనుకున్నాను. ఆయనతోనే ఎక్కువ కాలం గడిపేవాడిని." అన్నాడు.

"ఆయన కూతురితో కూడా గడిపేవాడివని అభియోగం ఉంది." ఆదిత్య ఒక్కసారి తలఎత్తి నీలిమ వంక చూచాడు. వెంటనే కళ్లు దించుకున్నాడు. అతని ముఖం జాజు పూసినట్టు ఎర్రగా మారింది.

"ఒక ఇంట్లో ఉంటున్న మాకు పరిచయం అయింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. నందనరావుగారి కిష్టమే. ముకుందాదేవిగారిష్టపడలేదు." అన్నాడు.

"ఆవిడిష్టపడలేదని, ఆస్తి దోచావని నీమీద నేరం మోపారు."

"కేవలం భ్రమ మాత్రమే" అన్నాడు.

లాయర్ దగ్గర అతను చేసాడు అనుకోవటానికి అవకాశాలున్నాయిగాని, సాక్ష్యాలు లేవు.

"ముకుందాదేవి డబ్బు, నగలు దాచే గది నీకు తప్ప మరెవరికయినా తెలుసా ?" లాయర్ ప్రశ్నించాడు.

"నాకు తెలియదు."

"ఈ స్థలం నీకు యెవరు చూపారు ?"

"ముకుందాదేవిగారి కూతురు నీలిమ."

"మరి దొంగతనం జరిగిననాడు ఎక్కడున్నావు ?"

"అంతకుమునుపే నీలిమగారు నాతో మాట్లాడారని, ముకుందాదేవి నన్ను వెళ్లిపొమ్మన్నారు. నేను వెళ్లిపోవటం నందనరావుగారి కిష్టంలేక, ఆయనకు ట్రీట్‌మెంటు ఇచ్చే డాక్టరుగారితో నా విషయం చెప్పి ఉద్యోగం ఇప్పించారు. అక్కడే పనిచేస్తున్నాడు. దొంగతనం జరిగిననాడు ఉదయం డాక్టరు శివాజీ నందనరావు ఆరోగ్యం బాగా దెబ్బతిన్నదని చెప్పాడు. అతని సహాయం గుర్తుకువచ్చింది. వెంటనే కృష్ణకుంజ్‌కు వెళ్లాను. ఆ రోజు అర్చన జరుగుతుంది. అందరూ చాలా బిజీగా ఉన్నారు. నేను ఇంట్లోకి వెళ్లాను. బయటి వరండాలో నందనరావుగారు ఒక్కరూ అసహాయంగా పడుకున్నారు. నన్ను చూచి ఆనందంగా క్షేమము అడిగారు. ఆయనను నడిపించటం నాకు అలవాటు. అందుకని కాసేపు నడిపించాక పాలు త్రాగించాను. అప్పటికే పాలలో నిదుర మాత్రలు కలిపి ఉంచారేమో. అతనికి దుప్పటి సరిచేస్తుండగా మనిషి వచ్చి ముకుందాదేవి కాబోయే అల్లుడు చిన్నబాబుకు దెబ్బలు తాకాయని చెప్పాడు. అప్పుడప్పుడు అతను తాగి పడుకుంటే తీసుకురావటం అలవాటు. అందుకే తీసుకురావటానికి వెళ్లాను. అతను చెప్పిన ప్రదేశంలో యెవరూ లేరు. తప్పుగా విన్నానేమో అని చిన్నబాబు ఎప్పుడూ వెళ్లే బార్‌కు వెళ్లాను. అక్కడా లేడు. తిరిగి వచ్చేసరికి దోపిడీ జరిగింది. ముకుందాదేవిగారున్నారు, సావిత్రమ్మ, ఆమె కొడుకు ఉన్నారు." అన్నాడు ఊపిరి తీసుకుంటూ.

అతని కథనము విన్నారు.

"క్రాస్ ఎక్జామ్ చేయవచ్చు" నని లాయర్ కూర్చున్నాడు.

ప్రాసిక్యూషన్ లాయర్ లేచాడు.

"మిస్టర్ ఆదిత్యా ! మీకు నందనరావు, మీ నాన్న స్నేహితుడని తెలియదు, అతని భార్యను దేవుడు ఆవహిస్తాడని తెలియదు, అతనింట్లో అందమైన అమ్మాయి ఉందని తెలియదు అవునా !"

"అవును."

"తెలియకపోయినా అతని కాంపౌండులోకి యెలా రాగలిగావు ?"

"యాదృచ్ఛికం ..."

"కాదు ప్రీప్లాన్డ్ ! వాళ్ల దగ్గరున్న సంపద వివరాలు తెలుసు. వాళ్లు ఇన్‌కమ్‌టాక్స్ వారికి భయపడి, ఇంట్లో, డబ్బు, నగలు, సంపద దాచిపెడతారని తెలుసు. అందుకే శోష వచ్చినట్టు నటించావు..."

"నో...నో..."

"ఆర్డర్ ! ...ప్రొసీడ్ !" న్యాయమూర్తి ఆదేశించాడు.

"ఆ ఇంట్లో చేరి అదనుకోసం కాచుకున్నావు. నీలిమతో ప్రేమ నటించావు, అన్ని వివరాలు చక్కగా సేకరించావు..."

"అబ్‌జెక్షన్ యువర్ ఆనర్ ! మా స్నేహితుడు, ఆ ఇంట్లో ఉండే ముకుందాదేవి పరివారాన్ని ఇంటరాగేట్ చెయ్యకుండానే ఓ కంక్లూజన్‌కు రావటం నాకేకాదు, యెవరికీ ఆమోదయోగ్యం కాదు."

"అబ్‌జెక్షన్ సస్టయిన్డ్..."

"వారి నందరినీ రప్పించటానికి కొంత సమయం కావాలి మిలార్డ్." అన్నాడు.

"ఎస్ గ్రాంటెడ్ అండ్ కేసు వాయిదా వేయడం జరుగుతుంది." అని న్యాయమూర్తి లేచాడు.

ముకుందాదేవి లాయర్ చక, చక ఆమె దగ్గరకు వచ్చాడు.

"మిస్ నీలిమా ! చైనులు, రాయుడు, సత్యవతి, రుక్మిణి తదితరులను రప్పించాలని అమ్మతో చెప్పు" అన్నాడు.

"మంచిది" అన్నదామె. లాయరుని వదిలించుకుని వచ్చేసరికి ఆదిత్యను తీసుకువెళ్లారు.

ముకుందాదేవి అతనికి బెయిల్ ఇవ్వకుండా చేసింది. డబ్బుతో న్యాయం అమ్ముతున్నారు. కొంటున్నారు.

నీలిమ శివాజీ సహాయంతో లాయర్ని ఏర్పాటు చేసింది. అది యెవరికి తెలియదు. ఆదిత్య ఊహించగలిగాడు.


ఆమె ఒక నిట్టూర్పు వదిలి, మెల్లగా బయలుదేరింది. ఆమెకు తెలుసు. వాళ్లెవరూ దొరకరని, కాని వాళ్లు కనిపించనిదే ... ఆదిత్యకు శిక్ష పడదని. అందుకే ధైర్యంగా ఇంటికివచ్చి, తల్లితో విషయం చెప్పింది.

"వీళ్లంతా ఎక్కడికి వెళ్లారంటావు. ఒక్కరూ వచ్చి కనిపించరేం ?" ముకుందాదేవి అడిగింది.

"మన డబ్బు, నగలు పట్టుకెళ్లింది వాళ్లే

విజయవాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో డా. పి. వి. సుబ్బారావు రచించిన 'సహజవాంఛలు — సుఖవ్యాధులు' గ్రంథాన్ని నాగార్జున విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. రాజారామమోహనరావు ఆవిష్కరించిన సందర్భంగా కృతికర్తకి సన్మానపత్రం సమర్పిస్తున్న ఆర్.టి.సి. జనరల్ మేనేజరు శ్రీ రమణరావు.





నమ్మా. అనవసరంగా ఆదిత్యను అనుమానించి జైలుపాలు చేసావు.'' అన్నది నిష్ఠూరంగా.

''నీకు మహా తెలిసినట్టు. రేపు వెళ్లి సత్యవతిని చూచిరా. వాళ్ల అన్నగారిల్లు మారేడ్‌పల్లిలో ఉన్నది.'' అన్నది ముకుందాదేవి.

హాల్లో నందనరావు దగ్గుతున్నాడు.

ఐశ్వర్యం పోయి బాధపడుతున్న తల్లిని ఇంకా బాధపెట్టటం భావ్యముకాదు అనుకుంది, నీలిమ.

మర్నాడు దాదాపు అందరి అడ్రసులు పట్టుకుని వెతుకటానికి బయలుదేరింది.

సత్యవతి అన్నగారింటికే వెళ్లింది.

''ఓహో! ముకుందాదేవి కూతురువా! సత్యవతి మా అమ్మాయికి పురుడు పొయ్యటానికి అమెరికా వెళ్లింది.'' అన్నాడు.

నీలిమ ఉసూరుమంటూ వెనక్కు తిరిగింది.

సత్యవతి రావటం, సాక్ష్యం ఇవ్వటం కల్ల.

అక్కడనుండి చైనులు ఇంటికి వెళ్లింది. అక్కడ మరెవరో కాపురం ఉంటున్నారు.

''మాకు తెలియదమ్మా! ఎక్కడో నిజామాబాద్, జగ్గయ్యపేటో అన్నారు. అక్కడ పొలాలు చవకగా దొరుకుతుంటే వెళ్లి వ్యవసాయం చేసుకుంటున్నాడట'' అన్నాడు.

''సరియైన అడ్రసు ఇస్తారా!''

''మాకు తెలియదమ్మా.'' అన్నారు.

ఆమెకు మరెవరూ దొరకరని తెలిసినా, వళ్లీ అనుమానం ఎందుకని రాయుడి అత్తగారింటికి వెళ్లింది. అతని అత్త ఎవరనికూడా అడగలేదు. ''వాడి అమ్మ కడుపుకాలా! నన్ను మోసంచేసి నా బిడ్డ గొంతు కోసాడు. వాడి అసలు సంగతి తెలియక నా బిడ్డనిచ్చాను. అదెవ్వతో దేవుడని అడ్డమైన నాటకాలు ఆడాడు, ఇప్పుడు మద్రాసు వెళ్లాడు.'' అన్నది.

''అడ్రసుందా!'

''వాడి అడ్రసు ఎందుకు! అది నాకు చచ్చిన దానిక్రిందే లెక్క.'' అన్నది నాల్గు తమలపాకులు ఒకేసారి నోట కుక్కుకుని, గచ్చకాయంత సున్నంతీసి వేలుకు రాసుకుంది.

నీలిమ త్వరగా అక్కడనుండి వచ్చింది. ఏ ఒక్కరి అడ్రసు సరిగ్గా కనుక్కోలేకపోయింది.

ఆమె వచ్చేసరికి తల్లి లాయరుతో మాట్లాడుతుంది.

''వారందరిమీద మీకు అనుమానం అప్పుడే రావల్సింది. మీకు రాకపోయినా పోలీసులు ఎందుకు అనుమానించలేదు!'' లాయర్ అడిగాడు.

ముకుందాదేవి జవాబు చెప్పలేకపోయింది.

''మీ లాయరుగా మీకు సహాయం చేయటం నా విధే కాని ఒక నిర్దోషిని జైలు పాలు చేసి, దొంగలను వదలటం అన్యాయం. డాక్టరుకు రోగం గురించి, లాయర్‌కు కేసుల గురించి, స్పష్టంగా చెప్పాలమ్మా'' అన్నాడు.

''వారి విషయము వదిలివేసి ముందుకు పోలేమూ!''

''ఒక్క అడుగు కూడా ముందుకు పోలేము. ఒక ఇంట్లో పదిమంది ఉండగా ఒక్కడే దొంగతనం చేసాడంటే, యెవరయినా నమ్ముతారా!'' అన్నాడు లాయర్.

''నన్నిప్పుడేం చేయమంటారు?''

''పోలీసులకు మరో కంప్లేంటు ఇవ్వండి. వారంతట వారే ఇన్‌వెస్టిగేషన్ చేయాలి. చేయలేదంటే వారికి మీ పనివారి ద్వారా చాలానే ముట్టింది. వాళ్లు కూడా పట్టించుకోరు. ఒకసారి కమిషనర్ని కలిసి చూడండి.'' అన్నాడు లాయరు.

''అలాగే..'' అన్నదామె నిస్పృహగా.

''ఏవయినా కొత్త విషయాలు తెలిస్తే నాకు ఫోన్ చెయ్యండి.'' అని లాయర్ వెళ్లిపోయాడు.

''నీలూ! పోలీసులకు లంచం పెట్టారో లేదో కాని మన లాయరుకు ఆ ఆదిత్యగాడు పెట్టినట్టున్నాడు.''

''అమ్మా!''

''అవునే. లేకపోతే ఆదిత్యగాడిని సపోర్ట్ చేయనలసిన అవసరం ఏముంది!''

''అంతా నీ అనుమానం. నీ అనుమానంతో అసలు కేసే తప్పుదారి పట్టింది. అమ్మా ఆదిత్య అంటే ఎందుకంత కోపం!''

ముకుందాదేవి జవాబు చెప్పలేకపోయింది.

''నీలూ! ఆ ప్రశ్నకు జవాబు నేను చెబుతానమ్మా'' నందనరావు గోడను పట్టుకుని వచ్చాడు.

''నాన్నా!'' నీలిమ లేచి చప్పున అతన్ని పట్టుకుంది.

''మా వివాహమైన కొత్తలో ఆదిత్య తల్లితండ్రులతో చాలా చనువుగా ఉండేవాడిని. ఆదిత్య తల్లి గుర్తుంచుకోతగిన వ్యక్తి. ఆత్మీయతకు, ఆప్యాయతకు నిర్వచనం ఆమె. ఆమెకు, నాకు ఏదో సంబంధం అని, అతను నాకు పుట్టిన కొడుకే కావచ్చునని మీ అమ్మ అనుమానం'' అన్నాడు, కాస్త కోపంగా, వెటకారంగా.

''నాన్నా!'' నీలిమ వారించింది.

''అలాంటి సంబంధమే ఉంటే నేనే ఎందుకు ప్రోత్సహిస్తాను ... నిన్నిచ్చి పెళ్లి ఎలా చేస్తాను. అసహాయుడనయి తనపై ఆధారపడ్డానని, తన ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుంది. ఆ ఆదిత్య ఏం అపకారం చేసాడు!''

''వద్దు నాన్నా! వద్దు ... బ్లడ్‌ప్రెషర్ ఎక్కువ అవుతుంది.'' అని నీలిమ తండ్రిని తీసుకుని వెళ్లింది బయటికి. ముకుందాదేవి గదిలో అసహాయంగా ఏడుస్తూ పడుకుంది.

''ఏమిటి నాన్నా మీరు కూడా. అమ్మ అప్‌సెట్ అయ్యింది.''

''ఈ పదిహేను సంవత్సరాలలో నేనెంత అప్‌సెట్ అయ్యానో మీకు తెలియదు ...'' అన్నాడు అతను ఆవేశంగా. నీలిమ ఇద్దరికి చెప్పలేక కూర్చుండిపోయింది.

(ఇంకా వుంది)

ఆచార్య నందలాల్ బోసు

—తే. కేశవరావు

శాంతి నికేతనములో ఆచార్య నందలాలుబోసు శతవార్షికోత్సవము ఈ డిసెంబరు మొదటి వారములో జరుగుతున్నది.

ఆయన రచించిన వర్ణచిత్రాలు మనదేశములోనే గాక అనేక విదేశ ఆర్టుగ్యాలరీలలో కూడా వున్నాయి. ఆయన వేసిన చిత్రాలు స్కెచ్‌లతో సహా యిటీవల భారత ప్రభుత్వము కొనివేసింది. ఆయన చిత్రాలు ఏవీ విదేశాలకు తీసుకొని పోరాదని కూడా నిషేధించింది.

ప్రాచీన భారత చిత్రకళా ప్రచారకుడైన ఇ. బి. హావెల్ సహకారముతో 20వ శతాబ్దము ప్రారంభములో శ్రీ అవనీంద్రనాథ ఠాగూరు జాతీయకళను పునరుద్ధారణ చేయ సంకల్పించి 'ఇండియన్ సొసయిటీ ఆఫ్ ఓరియంటల్ ఆర్టు' అను పేర నందలాలు బోసు, అసిత్‌కుమార్ హాల్దారు, వెంకటప్ప మొదలైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రామకృష్ణ మఠముకు చెందిన సిస్టర్ నివేదితా ఆ యువకులకు ప్రోత్సాహము నిచ్చింది.

1909 లో లేడీ హారింగుహామ్‌చే నియమితులైన బృందముతో చేరి నందలాలు బోసు అజంతా కుడ్య చిత్రాలు కాపీ చేసిరి. కలకత్తా కాళీఘాట్ వద్ద పూరీ క్షేత్రములోను వేసే జానపద చిత్రకారుల చిత్ర రచనా విధానము వాటి రేఖా విన్యాసములు అవీ అభ్యసించిరి. సుప్రసిద్ధ జపాను కళావిమర్శకుడు, ప్రచారకుడు అయిన ఒకాకురా కాకుజో మనదేశము సందర్శించినపుడు ఆయన ఈ విద్యార్థులకు చిత్రకళకు మూడు ముఖ్యమైనవి సాంప్రదాయము(ట్రెడిషన్), ప్రకృతి (నేచర్), స్వంతకల్పన (ఒరిజినాలిటీ) అవసరమని సూచించారు. వాటి ననుసరించి చిత్ర రచనకు పూనుకొన్నారు.

తర్వాత శ్రీ రవీంద్రనాథ ఠాగూరు శాంతి నికేతనములో కళాభవనము ముఖ్యోపాధ్యాయునిగ శ్రీ నందలాలుబోసును నియమించిరి.

అక్కడనుంచి ఆయన మధ్యప్రదేశ్‌లో బాగ్ గుహల కుడ్య చిత్రాలు కాపీ చేసిరి. కుడ్య చిత్రాలువేసే విధానములో అజంతా, రాజపుత్ర శైలులు ఇటలీలో వేసిన పద్ధతులు పరిశోధన చేసి శ్రీ నందలాలుబోసు తన విద్యార్థులకు బోధిస్తూ శాంతి నికేతనములోని భవనాలను వాటితో అలంకరించిరి.

శ్రీ రవీంద్రనాథ ఠాగూరు 1925 లో చీనా, జపాను దేశాలకు వెళ్లినపుడు తనతో శ్రీ నందలాలు బోసును తీసుకొని వెళ్లి అక్కడ చిత్రకారులకు పరిచయము గావించిరి. టోకియోలోని ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుడు

విశ్వకవి రవీంద్రనాథ ఠాగూరుతో కళాభవనం విద్యార్థులు, ఉపాధ్యాయులు. ఇది 1929లో శాంతినికేతన్‌లో తీసిన ఫొటో.
X గుర్తు ఉన్నచోట శ్రీ నందలాలుబోసుని, → గుర్తు ఉన్నచోట ఈ వ్యాస రచయితని చిత్రంలో చూడవచ్చు.





శాంతినికేతన్ కళాభవనంలో మహాత్మా గాంధీతో ఆచార్య నందలాలుబోసు.

టైకాన్ మరి నలుగురు చిత్రకారులు నంద బాబును విందుకు పిలిచి అక్కడ వారంతా ఒక్కొక్క చిత్రము వేసి వారి కళా కౌశల్యము ప్రదర్శించిరి. శ్రీ నందలాల్ బోసు కూడా వారి శైలిలోనే ఒక డేగ చిత్రము వేసి వారి ప్రశంసలు అందుకొనిరి.

ఆయన మొగలాయి, రాజపుత్రమినియేచరు పద్ధతిలో కూడా చిత్రించారు. వాటిలో మన స్వాతంత్రోద్యమానికి పాటు బడిన ఆంగ్లేయుడు సి. ఎఫ్. ఆండ్రూస్ చిత్రము పేర్కొనదగినది. ఆ రోజులలో నందబాబు చిత్రాలకు మన దేశములోని మహారాజుల నుంచి పాశ్చాత్యులనుంచి కూడా విశేషముగా ఆదరణ వచ్చింది. దేశము నలుమూలలోని ప్రాచీన శిల్పకళాక్షేత్రాలు దర్శించి ఆయన అక్కడివారి గ్రామ జీవనము మొదలైనవి ఎన్నో స్కెచ్‌లు వేశారు. పాశ్చాత్యదేశాలలో చిత్రకళలో వచ్చిన నూతనోద్యమాల ప్రభావమువలన తర్వాతి రోజుల్లో ఆయన చిత్ర రచనలో కొన్ని మార్పులు వచ్చాయి. కాని మన సాంప్రదాయమును మరువ లేదు. ఆయన వుడ్‌కట్, లిథో, ఎచ్చింగ్ మొదలైన గ్రాఫిక్ చిత్రాలుకూడా ఎన్నో వేశారు.

చిత్రకళలను బోధించుటలో శ్రీ నందలాలు బోసువంటి ఉపాధ్యాయుడు లేడని చెప్పాలి. తనని అనుసరించమని ఆయన విద్యార్థులకు ఎప్పుడు చెప్పలేదు. విద్యార్థుల అభిరుచి ఏ విధముగా వున్నదో గ్రహించి దానికి అనుగుణ్యముగా నేర్పే వారు. మన ప్రాచీన కళలే గాక ఈజిప్టు, అస్సీరియా, గ్రీసు, చైనా, జపాను, దేశాల కళల గురించిన చర్చలు జరిగేవి. విద్యార్థినులకు ఎంబ్రాయిడరీ, ముగ్గులు, బాటిక్ ప్రింటింగు, తోలు పర్సుల డిజైనులు వేసే పద్ధతులు తెల్పే వారు. వాటిగురించి ఆయన అచ్చువేసిన పుస్తకాలు బెంగాలులో వాడుకలో వున్నాయి.

ఆయన తమ విద్యార్థులతో నిత్యజీవితములో ఎప్పుడూ రమ్యమైన ఆలోచనలు, సౌందర్య దృష్టి వుండాలనేవారు. స్కూలు విద్యార్థులకు కొత్త రకము పరీక్షలు చేసేవారు. వాటిలో ఒకటి, ఖాళీ గది ముందు కుర్చీ, బల్లలు అద్దకము వేసిన రంగుల కర్టెనులు ఇతర వస్తువులువేసి 'ఈ గదికి రవీంద్రనాధ ఠాగూరు వస్తే ఎలాగు అలంకరిస్తావు' అని ప్రశ్నించి పరీక్ష చేసేవారు. స్వాతంత్రోద్యమ కాలములో ఫైజ్‌పూరు అఖిల భారత కాంగ్రెసుకు నందబాబు చేతిపనుల ప్రదర్శనముకు, ముఖ ద్వారము, అధ్యక్షుని వేదిక మొదలైనవి రక రకాల డిజైనులతో వెదుళ్లతో అలంకరించిరి.

శాంతి నికేతనముకు మొదటిసారి మహాత్మా గాంధీ జనవరి 26వ తేదీని దర్శించినందున ఆ రోజు రిపబ్లిక్ దినంగా పాటించేవరకు గాంధి దినముగా జరిపేవారు. ఆ రోజు విద్యార్థులే అన్ని పనులు, వీధులు ఊడ్చుట, వంట మొదలైనవి చేయుట, జరిగేది. ఒకసారి ఆ దినమున శ్రీ నందలాలు బోసు కళా భవనము విద్యార్థులతో కలిసి స్వయముగా మరుగుదొడ్లు శుభ్రము చేయటానికి పూనుకొన్నారు. మద్రాసు నుంచి వచ్చిన కాలేజి విద్యార్థి ఒకడు తన కెమెరాతో ఆయన ఫోటో తీయబోగా ఆయన వెంటనే అడ్డుపెట్టి "నా ఫోటో తీయటం ఒప్పుకోను. రోజూ ఊడ్చే పాకీవాని ఫోటో తీయి" అని ఆయన ఉద్రేకపడ్డారు.

శ్రీ నందలాలుబోసు వేసిన చిత్రాలు కొన్ని వేల సంఖ్యలో వున్నాయి. భారత ప్రభుత్వము ఆయనకు 'పద్మ విభూషణ' బిరుదు నిచ్చింది. ఆయన 1966 ఏప్రిల్‌లో కాలము చేసిరి. ఆధునిక విఖ్యాత చిత్రకారులు కొందరు ఆయన వద్ద శిక్షణ పొందిన వారే. ఆయన చిత్రకళకు ప్రాణశక్తి (లైఫ్ మూవ్‌మెంట్) ముఖ్యమని చెప్పతూ ఇట్లు వ్రాసిరి :

"ట్రూత్ మస్ట్ డ్రా యువర్ ఇన్నర్ సెల్ఫ్ టువార్డ్స్ ఇట్‌సెల్ఫ్ అండ్ ది మోర్ యు వోపెన్ యువర్ సెల్ఫ్ టు ఇట్, ది మోర్ యు విల్ ఫీల్ ఇట్స్ హిప్నాటిక్ ఇన్‌ఫ్లుయన్స్. ది అన్ నాచురల్, త్రూ ఇట్స్ వెరీ నావెల్‌టీ మే ఎట్రాక్ట్ అజ్ ఫర్ ఎ టైమ్ బట్ ది ఎట్రాక్షన్ డజ్ నాట్ లాస్ట్ ఇఫ్ దేర్ ఈజ్ నో ట్రూత్ ఇన్ ఇట్." ★



శ్రీ నందలాలుబోసు మొదట లిథో రాతిమీద వేసిన మహాత్మా గాంధీ స్కెచ్. దీనినే తర్వాత లైనోకట్‌గా, రంగుల చిత్రంగా వేశారు.

అందరూ ఇలాగ వుంటే.....

విన్నకోట సుశీలాదేవి

ప్రొఫెసరు వ్యాస్ ఇంటి ముందున్న గేటుని తీయబోతూ క్షణకాలం ఆగాడు శ్రీరావ్.

"ప్రొఫెసరుగారు తనని ఇంటికి ఎందుకు రమ్మన్నారో ?" ప్రొద్దుటినుండీ అతడా ప్రశ్న వేసుకోవడం ఏ వెయ్యోసారో అయివుంటుంది.

రోజూలానే — ఉదయం పది గంటలకు యూనివర్శిటీముందు బస్సు దిగాడు శ్రీరావ్. పది నిముషాల్లో తన డిపార్ట్మెంట్‌కి, చేరుకుని — ప్రొఫెసరుగారి రూములోకి వెళ్ళాడు.

ఆ సరికి ఆయన ఇద్దరు రిసెర్చి స్కాలర్స్‌తో ఏదో విషయంమీద తీవ్రంగా చర్చిస్తున్నారు.

శ్రీరావ్‌ని చూడగానే ఆయన ముఖంలో వుత్సాహం తొంగి చూసింది.

"రావోయ్ ! శ్రీరావ్ !" అంటూ ఆహ్వానించారు.

శ్రీరావ్ లోపలికెళ్ళి ఆయన ఎదురుగా నిలబడ్డాడు.

"వర్క్ ఎలా సాగుతోంది ? "

"ఇంకో నాలుగు రోజుల్లో థీసీస్ సబ్మిట్ చేసేస్తానండీ !" అన్నాడు శ్రీరావ్ ఆనందం, గర్వం మిళితమైన స్వరంతో.

"వెరీగుడ్ ! నీలాటి వుత్సాహవంతుడైన స్టూడెంటు ఒక్కడున్నా చాలు నాకు పేరు రావడానికి !"

ప్రొఫెసరుగారి మాటలకు వుప్పొంగి పోయాడు శ్రీరావ్.

"థాంక్స్ సార్ !"

"సాయంత్రం అయిదు గంటల కొకసారి మా ఇంటికి రా !" అన్నాడాయన !

శ్రీరావ్ కొద్దిగా ఆశ్చర్యపడినా—

"అలాగే సార్! తప్పక వస్తాను!" అన్నాడు వినయంగా.

"సరే ! ఇక నువ్వెళ్ళు !"

శ్రీరావ్ వచ్చేశాడు.

ఆ క్షణం నుండీ అతడి మనసులో—ఎన్నో.. అనుమానాలు. సందేహాలు తలెత్తాయి. ప్రొఫెసరు గారు ఎందుకు రమ్మన్నారో ?

రిసెర్చ్ స్కాలర్స్ ఎవరికీ ప్రొఫెసరు గారింటికెళ్ళే ధైర్యం లేదు !

ఆయన రమ్మనరు. ఆయనతో ఎవరైనా మాట్లాడాలంటే యూనివర్సిటీలోనే కలవాలి. ఇంటికొస్తే ఆయనకి కోపం. మరి తనని ఆయనంతట ఆయనే రమ్మని పిలిచారు ఎందుకో.

ఆలోచిస్తుండగానే సాయంత్రం అయిదు గంటలయింది. తనింతవరకూ వ్రాసిన నోట్సు కాగితాలన్నీ తీసుకుని ప్రొఫెసరు ఇంటికి బయలుదేరాడు శ్రీరావ్.

తీరా ఇక్కడికి వచ్చాక— లోపనికెళ్ళాలంటే భయంగా వుందతనికి.

"ఎవరు కావాలండీ !"

సన్నని గొంతు అతడి ఆలోచనలను చెదరగొట్టింది.

వులికిపాటుని కప్పిపుచ్చుకుంటూ తలెత్తి చూశాడు. ఇరవై సంవత్సరాల యువతి— చేతిలో బొచ్చుకుక్కతో నిలబడి వుంది.

"ప్రొఫెసరుగారు వున్నారా ?" అనడిగాడు శ్రీరావ్.

"మీ పేరు ... !"

"శ్రీరావ్ !"

"నాన్నగారు మీ కోసమే ఎదురుచూస్తున్నారు !" అంది.

శ్రీరావ్ ధైర్యాన్ని కూడగట్టుకుని—గేటు తీసుకుని లోపలకు వెళ్ళాడు.

విశాలమైన లాన్ — మధ్య సన్నని బాట — ఆ బాటకి ఇటూ అటూ రకరకాల పూలచెట్లు.

మరొకసారి అయితే ఆ తోట అందాన్ని తనివితీరా చూసేవాడు. కానీ ఈ రోజు అతని మనసంతా ప్రొఫెసరుగారు మాట్లాడబోయే విషయం మీదే వుంది.

గబగబా వరండా మెట్లెక్కి హాల్లోకి వెళ్ళాడు. సోఫాలో కూర్చుని పేపరు తిరగేస్తున్న ప్రొఫెసరుగారు, శ్రీరావ్‌ని చూస్తూ —

"రావోయ్ ! నీ కోసమే చూస్తున్నా !" అంటూ లేచి మేడమీదికి దారితీశారు.

శ్రీరావ్ ఆయనను అనుసరించాడు.

మేడమీద ప్రొఫెసరుగారి రూములోకెళ్ళి కూర్చున్నారిద్దరూ.

ఎ.సి. రూము క్రింద ఎర్రటి కార్పెట్, మెత్తటి సోఫాలు, ఆ చక్కని వాతావరణం శ్రీరావ్‌ని వుక్కిరిబిక్కిరి చేసింది. జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖాన పట్టిన చెమట తుడుచుకున్నాడు.

"శ్రీరావ్ నీ రిసెర్చి అయిపోతుందన్నావు కదూ !"

"అవున్సార్ ! నేను వ్రాసిననోట్సు తెచ్చాను చూస్తారా !" ఫైలు తెరిచి ఆయన ముందు పెట్టబోయాడు.

"వద్దులేవయ్యా ! నాకు తెలీదా ! నీ ప్రతిభ ! నీలాటి బెస్ట్‌స్టూడెంట్‌ని నా సర్వీసులో ఇంతవరకూ చూడలేదు! నీకు వచ్చే కాన్వొకేషన్ లోనే డిగ్రీవచ్చేట్టు చూస్తాను," అన్నారాయన.

శ్రీరావ్ ఆనందంతో పొంగిపోయాడు.

ఏమిటిది కలా ! నిజమా ! తనసీనియర్స్‌లో చాలామంది థీసీస్‌లు సబ్మిట్ చేసి సంవత్సరాలయినా ఇంతవరకూ డిగ్రీలు రానేలేదు. తనకి వెంటనే డిగ్రీ వస్తోంది. ఎంత అదృష్టం !

'ఈ విషయం రేపు శోభతో చెప్పాల' అనుకున్నాడు శ్రీరావ్.

"శ్రీరావ్ ! నిన్నెందుకు రమ్మన్నానో ? తెలుసా," జేబులో నుండి పైపుతీసి వెలిగించారు ఆయన.

"తెలీదు సార్."

"మా అమ్మాయి రూప బి. ఎ. పాసయింది. నీలాటి కుర్రాడెవరన్నా దొరికితే ఆమెకిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను !" గుప్పు గుప్పున పొగ వదులుతూ అన్నారు.

తనకా విషయం ఎందుకు చెప్తున్నాడో శ్రీరావ్‌కి అర్థం కాలేదు. అయినా మౌనంగా వింటూ వుండిపోయాడు.

"శ్రీరావ్ ! నీ పెళ్ళి ఎప్పుడోయ్," అడిగారు.

శ్రీరావ్ సిగ్గుపడి జవాబు చెప్పకుండా వూరుకున్నాడు.

"ఎలాగూ నీ రిసెర్చి అయిపోతోంది కదా ! మా అమ్మాయిని నువ్వు చేసేసుకో. నీకు డిగ్రీ కూడా త్వరలోనే వస్తుందిలే !"

"నేనా...!" వెలవెలబోయాడు శ్రీరావ్.. పర్వత శిఖరం మీదనుండి దొర్లి పడుతున్నట్లు అనుభూతి చెందాడు.

"అన్నట్లు ఈ ఏడు మన డిపార్ట్మెంట్‌లో ఒక లెక్చరరు పోష్టుకి ఖాళీ వస్తుంది. నీకు పి. హెచ్. డి. డిగ్రీ కూడా వుంది కాబట్టి నీకు రావచ్చు."

శ్రీరావ్‌కి ఆయన మాటల్లో అంతరార్థం బోధపడింది. "వాళ్ళమ్మాయిని చేసుకుంటే తను పొందబోయే లాభాలు చెప్తున్నాడు." అనుకున్నాడు.


"శ్రీరావ్ ! అసలు నిన్ను రిసెర్చి స్టూడెంట్‌గా చేర్చుకోడానికి చాలా గొడవయిందిలే ! అప్పటికే నా దగ్గర పదిహేనుమంది వరకూ వున్నారు. వైస్‌ఛాన్స్‌లర్ నిన్ను చేర్చుకోడానికి అభ్యంతరం చెప్పాడు. నేను ప్రత్యేకంగా చెప్పడంవలన చివరికి ఒప్పుకున్నాడు."

అదంతా ఎందుకు చెప్తున్నాడో అర్థం చేసుకున్నాడు శ్రీరావ్.

"మీ ఫాదర్ అడ్రసు చెప్పవోయ్ ! నేను లెటర్ వ్రాస్తాను."

"లెటరా... వొద్దుసార్... ఎందుకంటె... అదికాదు సార్... !" శ్రీరావ్ తడబడిపోతున్నాడు.

తనకు విద్యాదానం చేసిన ప్రొఫెసరుగారికి



ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలీక కంగారుపడి పోతున్నాడు.

ఏదో చెప్పాలనుకుంటున్నాడు శ్రీరామ్ కానీ గొంతు పెగలడంలేదు

ఎదురుచూడని సంఘటన జరిగిందే అని బాధ – 'కాదంటే' ప్రొఫెసరు ఏవంటారోనన్న భయం అతని గొంతుకు అడ్డుపడ్డాయి.

గాబరాతో కళ్లల్లో నీళ్లు తిరగసాగాయి.

''ఏమిటి శ్రీరామ్'' ప్రొఫెసరుగారి కనుబొమలు ముడివడ్డాయి. అది చూసిన శ్రీరామ్‌కి చెమటలు పట్టసాగాయి, వణికిపోతున్నాడు.

కానీ తన మనసులోని విషయం చెప్పకపోతే మరీ ప్రమాదం. అందుకే అతికష్టం మీద గొంతు పెగుల్చుకుని --

''సార్ ! నేను మీ అమ్మాయిని చేసుకోలేను. నన్ను క్షమించండి సార్ '' అన్నాడు మెల్లగా !

ప్రొఫెసరుగారి ముఖం ఎర్రబడింది. గుప్పుగుప్పున పొగ వదుల్తూ వుండిపోయారు.

ఇక ఆయన ముందు కూర్చోలేకపోయాడు శ్రీరామ్. ''సార్ ! నేను వెళ్లొస్తాను'' అంటూ తడబడుతూ లేచాడు.

ప్రొఫెసరుగారు మాట్లాడలేదు. రెండు పెదవులూ బిగించి, వెడుతున్న శ్రీరామ్ వేపు తీక్షణంగా చూస్తూ వుండిపోయారు !

* * *

''అలా వున్నావే రామ్'' శోభ అడిగింది.

సాయంత్రం ఆరుగంటల సమయం : శోభ—శ్రీరామ్ పార్కులో తమ యధాస్థానంలో కూర్చున్నారు.

రోజూ గలగలా మాట్లాడే శ్రీరామ్ వచ్చి పావుగంటయినా పెదవి విప్పకుండా – ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లుండటం శోభకి ఆశ్చర్యాన్ని కలిగించింది.

''రామ్ ! నిన్నే ! ఎందుకలా వున్నావ్ అనడుగుతున్నాను !'' శోభ అతడి భుజం మీద చెయ్యి వేస్తూ అడిగింది.

శ్రీరామ్ ఆ చేతిని తీసి తన చేతుల మధ్య బంధించాడు.

''శోభా ! ఇటువంటి పరిస్థితి ఎదురవుతుందని కలలో కూడా అనుకోలేదు,'' దిగులుగా అన్నాడు.

''ఏం జరిగింది రామ్ ! నాతో చెప్పవూ!'' లాలనగా అడిగింది శోభ.

''చెప్తాను శోభా ! నీకు కాక ఇంకెవరికి చెప్పకుంటాను,'' అంటూ – ప్రొఫెసరుగారికి, తనకూ జరిగిన సంభాషణని వివరించాడు.

''నీకిష్టం లేదని చెప్పావు కదా ! ఇంకెందుకు విచారం ?''

''శోభా ! ఈ సంఘటన జరిగి వారం అయింది !''

''మరి ఇన్నాళ్లూ చెప్పలేదే ?''

''దానికి ప్రతిఫలం ఇవ్వాళే అందుకున్నాను !''

''ఏం జరిగింది ?''

''రెండ్రోజుల క్రితం నా థీసిస్ పూర్తిచేసి ఇచ్చాను. కానీ నేను వ్రాసింది సరిగ్గా లేదని – తిరిగి రిసెర్చ్ కొనసాగించమని ఇవ్వాళే రిమార్క్ వ్రాశారు ప్రొఫెసరుగారు !'' బాధగా అన్నాడు.

శోభ ఆశ్చర్యపోయింది.

''అదేమిటి, నీ రిసెర్చ్‌ని ఎంతో మెచ్చుకున్నారన్నావ్ !''

''అవును ! ఇన్నాళ్లూ మెచ్చుకున్నారు. అంత గొప్ప థీసిస్ లేదన్నారు. కానీ ఈ రోజు బాగా లేదన్నారు. ఇక జీవితంలో నాకు పి.హెచ్.డి. డిగ్రీ రాదు. శోభా ! మూడేళ్ళు నిద్రాహారాలు మాని నేను చేసిన శ్రమంతా వృధా అయింది. నా ఆశలు – కలలు అన్నీ నాశనమయ్యాయి. ఇక నేనెందుకూ పనికిరాను.''

మోచేతి వంపులో ముఖం దాచుకున్నాడు శ్రీరామ్ ! అతడిని ఎలా ఓదార్చాలో ఆమెకు అర్థం కాలేదు.

''రామ్ రిసెర్చి డిగ్రీ లేకపోతే ఏం ! నీ యూనివర్సిటీ డిగ్రీ వుంది కదా !'' శోభ ఓదార్పుగా అంది.

''శోభా ! మా ప్రొఫెసర్‌గారి పలుకుబడి నీకు తెలీదు. ఆయన తలుచుకుంటే నాకు చిన్న ఉద్యోగం కూడా రాకుండా చెయ్యగలడు. నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న నా వాళ్లకు ముఖం ఎలా చూపగలను. నలుగురూ హేళన చేస్తుంటే ఎలా తట్టుకోగలను. అసలు నేనిక ఎందుకు బ్రతకాలి ?'' ఆవేదనగా అన్నాడు.

శోభ చలించి పోయింది. ఆమె మనస్సు సంక్షోభానికి గురయింది.

పవిత్రమైన విద్యకు మాత్రమే స్థానాలుగా వుండాలిసిన విద్యాలయాలు, కుల తత్వాలకు,

ముతా రాజకీయాలకు, స్వార్థపూరితమైన ప్రయోజనాలకు నిలయాలుగా వున్నాయి. ప్రతిభకు స్థానంలేదు. కాకారాయుళ్లకే అన్ని అవకాశాలు. అందుకే ఎంతోమంది విద్యావంతులు నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

శ్రీరామ్ కూడా...

శోభ ఆపైన ఆలోచించలేకపోయింది. గుండె పట్టేసినట్లయింది.

"శోభా! నామీద ఎన్నో ఆశలు పెట్టుకుని వుంటావ్. కానీ నేను నీ జీవితాన్ని కూడా నాశనం చెయ్యబోతున్నాను. నన్ను క్షమించు." శ్రీరామ్ కంఠం రుద్ధమైంది.

"శ్రీరామ్! ఆయనకి మన సంగతి చెప్పావా?"

"ఎందుకు చెప్పలేదు. ఆ మర్నాడే ఆయన ఇంటికి వెళ్లి చెప్పాను. ప్రాధేయపడ్డాను. కానీ విన్పించుకోలేదు. ఆయన అనుకున్నది జరగాలట. శోభా! ఇంతవరకూ నాణేనికి ఒక ప్రక్కే చూశాను. ఇక ఇప్పుడు రెండో ప్రక్క చూడబోతున్నాను!"

శోభ చిన్నగా నిట్టూర్చింది.

లోకంలో ఏ తండ్రయినా తన కూతుర్ని ఇష్టపడే వ్యక్తికిచ్చి వివాహం చేస్తాడు. అంతే కానీ ఇలా బలవంతపు పెళ్లి చేస్తాడా? విద్యలో ఆచార్య స్థానాన్ని పొందినా, సంస్కారంలో మాత్రం అతి తక్కువ స్థాయిలో వున్నాడు. ఆయనేకాదు. నేటి విశ్వవిద్యాలయాల్లోని అనేక మంది గురువులు అలాగే ప్రవర్తిస్తున్నారు. వాటి గురించి తను తరుచు పేపర్లల్లో చదువుతోంది. కానీ ప్రత్యక్షంగా మాత్రం ఇప్పుడు చూస్తోంది.

"శోభా! నా కిప్పుడు రెండే మార్గాలు వున్నాయి. ఆయన చెప్పినట్లు వినడం. లేకపోతే ఈ జీవితాన్ని అంతం చేసుకోవడం. మొదటిది చెయ్యలేను. ఇక మిగిలింది రెండోదే!"

"శ్రీరామ్!" భయం భయంగా అంది.

శ్రీరామ్ శుష్కహాసం చేశాడు.

"ఎందుకు శోభా! అంత కంగారు పడతావ్! ఈ సంవత్సరంతో నా జీవితం కొత్త మలుపు తిరుగుతుందని ఆశపడ్డాను. చూశావా ఎటువంటి మలుపు తిరిగిందో?"

శ్రీరామ్ కళ్లల్లో అంతులేని దిగులు — దానితోపాటు ఏదో స్థిరనిశ్చయానికొచ్చినట్లున్న ఆవేశం — శోభని విచలితురాలిని చేసింది.

శ్రీరామ్ నిజంగా ఏదో అఘాయిత్యం చేసేట్లున్నాడు! "కానీ అతడిలాటి మేధావి చనిపోకూడదు. అతని వలన దేశానికి ఎంతో మేలు కలగాలి" అనుకుంది శోభ.

"శ్రీరామ్! ఇన్నాళ్ల మన స్నేహంలోనూ నేనేమీ అడగలేదు! నాదో చిన్న కోరిక వుంది తీరుస్తావా?" అనడిగింది మెత్తగా.

అందరూ ఇలాగ ఉంటే....

"ఏమిటది శోభా!"

"మాటివ్వు! చెప్తాను!"

"అలాగే శోభా! నా ప్రాణాన్ని రుణంగా పెట్టయినా తీరుస్తాను. కనీసం నీ కోరికన్నా తీర్చగలిగితే నేను ధన్యుడినే!"

క్షణం ఆగి మెల్లగా అంది.

"శ్రీరామ్! నువ్వు మీ ప్రొఫెసరుగారమ్మాయిని పెళ్లి చేసుకోవాలి! అదే నా కోరిక!"

శ్రీరామ్ తెల్లబోయాడు.

"అవును రామ్! నాకు మాటిచ్చావు! తప్పదు!" అంది.

శ్రీరామ్ తల అడ్డంగా వూపుతూ "నా వల్లకాదు," అన్నాడు.

"ఎందుకు కాదు! మొదట్లో బాధగానే వుంటుంది! కాదనను; కానీ కాలమే అన్ని గాయాల్ని మాన్పుతుంది!"

శ్రీరామ్ ముఖం ఎర్రబడింది.

"శోభా! నా ప్రేమను శంకిస్తే నేను సహించలేను" అన్నాడు తీవ్రంగా!

శోభ నొచ్చుకుంటూ —

"రామ్! అదికాదు నా వుద్దేశం! నీ మేధస్సు, విజ్ఞానం ప్రజలకు వుపయోగపడాలి. నీలాటివాడు నిరాశా నిస్పృహలతో క్రుంగిపోకూడదు! వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకో! నువ్వు నలుగురికి ఉపయోగపడేలా జీవించు! నీ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకు... ప్రేమ కంటే జీవితం ముఖ్యం!" అంది.

ఆహారం-నేర ప్రవృత్తి!

ఆహారపు అలవాట్లకు, బాలల్లో ఏర్పడే నేరపు వృత్తికి సంబంధమున్నట్లు జపాను మనస్తత్వ శాస్త్రవేత్త ఒకరు తెలియచేశారు. గత పదకొండు సంవత్సరాలుగా బాలల నేర ప్రవృత్తిని పరిశీలిస్తున్నారు. ఆయన పరిశీలించిన బాల నేరస్తులందరికీ తియ్యటి ఆహార పానీయం అంటే చాలా ఇష్టం. వీరి భోజన అలవాట్లు సక్రమంగా ఉండేవికాదు. భోజనానికి, భోజనానికి మధ్యలో తీపి పదార్థాలను ఎక్కువగా తినేవారు. భోజన అలవాట్లు సక్రమంగా లేకపోవటంవలన, ఎక్కువగా తీపి పదార్థాలు భుజించటం వలన, కాల్షియం, బి. వన్ విటమినులు నశిస్తాయని ఆయన అన్నారు. బి. వన్ విటమిన్ లోపంవలన జతువులలో మానసిక విపరీతాలు ఏర్పడినట్లు ఆయన తెలియచేస్తూ, మానవులలోకూడా ఇదేవిధంగా జరగగలదని ఆయన అన్నారు.

"త్యాగం చేస్తున్నావా?" కసిగా అన్నాడు. శోభ నవ్వింది.

"లేదు! అదృష్టం తలుపుతట్టి పిలిస్తే తలుపు తెరిచి ఆహ్వానించమంటున్నాను. కీర్తి ప్రతిష్ఠలు సంపాదించమంటున్నాను. నా శ్రీరామ్ నలుగురిలో పేరుప్రతిష్ఠలు పొందలనుకొనడం స్వార్థం అవుతుంది కానీ త్యాగం కాదు!"

"శోభా...!"

"ఇంకేం చెప్పకు! నామీద ఒట్టే! నువ్వు కాదంటే నామీద నీకు ప్రేమ లేదనుకుంటాను అంతే!" శోభ లేచి చరచరా వెళ్లిపోయింది.

శ్రీరామ్ వుక్కిరిబిక్కిరయ్యాడు. రెండు చేతుల్తో తలపట్టుకుని కూర్చున్నాడు.

కాలేజీలో డిగ్రీ చదివేటప్పుడు ఏర్పడిన ప్రేమ — ఇన్నాళ్ళూ భవిష్యత్తు గురించి తామిద్దరూ ఎన్నో కలలు కన్నారు. కానీ ఈనాడవి ఎదురుతిరిగాయి.

ఏం చేయాలిప్పుడు?

శోభ చెప్పినట్లు చెయ్యడానికి మనస్సు అంగీకరించడంలేదు. శోభ ఎంత బాధని అణచుకుని అలా చెప్పిందో తనకు తెలుసు.

కానీ శోభ ఒట్టుపెట్టుకుంది.

ఎలా?!

ఈత రానివాడిని సముద్రం మధ్యలో వదిలిపెట్టినట్లుంది తన పరిస్థితి!

"తనే తీరానికి కొట్టుకుపోతాడో! ఇక అదంతా విధి చేతిలోనే వుంది."

శ్రీరామ్ అనుకున్నాడు విచారంగా!

* * *

ప్రొఫెసరుగారి ఏకైక కుమార్తె పెళ్లంటే యూనివర్సిటీ అంతా తరలి వచ్చింది.

రంగు రంగుల బల్బులతో — పచ్చని తోరణాలతో— పట్టుచీరల రెపరెపలతో— సిల్కు చొక్కాల గరగరలతో పెళ్లిపందిరి సందడిగా— కనులపండువుగా వుంది.

పందిరి మధ్యలో ఎత్తుగా అమర్చిన వేదిక మధ్య — శ్రీరామ్ పెళ్లి బట్టల్లో మెరిసిపోతున్నాడు.

అందరూ శ్రీరామ్ అందాన్ని, అదృష్టాన్ని పొగుడుతున్నారు! అసూయపడుతున్నారు.

ఆ అందం చాటున లీలగా కదలాడే విషాదం— అది అదృష్టం కాదు తన దురదృష్టమని భావిస్తూ కుమిలిపోతున్న అతని మనస్సు ఆ లైటు వెలుగుల్లో ఎవరికీ కనబడడంలేదు.

పెళ్లి తంతు జరిగిపోతోంది.

పెళ్లికుమార్తె వచ్చి అతని ప్రక్కన కూర్చుంది. శ్రీరామ్ మనస్సూ, శరీరం మొద్దుబారిపోయాయి. యాంత్రికంగా పురోహితుడు చెప్పినట్లు చేస్తున్నాడు.

చుట్టూ చేరిన అతని స్నేహితులు చేసే పరిహాసాలు కానీ, నవ్వులు కానీ అతడు పట్టించుకోవడంలేదు. చైతన్యరహితమైన అతని

ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య



త్రికరణశుద్ధి

మనస్సు, మాట, శరీరము అనే మూడూ త్రికరణములు. ఈ మూడూ పరిశుద్ధంగా ఉండడమే త్రికరణశుద్ధి. అంటే — మనస్సులో ఎలాటి ఉత్తమాశయం తోస్తుందో, మాటకూడా, ఆ అభిప్రాయానికి అనుకూలంగానే ఉండాలి. శరీరంకూడా దానికి అనుగుణంగానే ప్రవర్తిస్తున్నట్లు చూడాలి. అంతేకాని, ఆలోచించేదొకటీ, చెప్పేదొకటీ, చేసేదొకటీ కాకూడదు.

స్నానంచేసి, పరిశుభ్ర వస్త్రాలు ధరించి ఇంట్లో ఉన్న దేవతా విగ్రహాలకు పూజచేస్తూ ఉన్న వ్యక్తి భగవన్నామాలు ఉచ్చరిస్తూ, విగ్రహాలపయి పువ్వులు వేస్తున్నాడనుకుందాం. ఆ సమయంలో ఇంట్లో పిల్లలు గోలచేస్తూ ఉంటే ''ఏమిటా గోల ? ఊరుకుంటారా, లేదా ?'' అని కసురుకుంటూవుంటే — అతని మనస్సుకూ, చేస్తున్న పూజకూ సంబంధం లేకుండా పోతుంది. ఎలాటి ధ్వనులు విన వచ్చినా మనస్సును వాటిపైకి పోనీయకుండా ఉంటే తదేకధ్యాన నిష్ఠలో ఉన్నవారికి అవి వినబడనేవినబడవు.

ఆ విధంగానే — పూజచేస్తూ ఉన్న సమయంలో భార్యను పిలిచి ''వంట అయిందా? వేగంగానే పూజ ముగిస్తాను. అన్నం వడ్డించు. ఈ రోజు ఆఫీసుకు చాలా తొందరగా వెళ్లాలి'' అని అంటూ నామావళిని చదివి పూజ చేసే వారికి మనస్సు దేవునిపైనే ఉంటుందనీ, ఏదో పేరునకు పూజ చెయ్యడమేకాని, పూజయందు ఆసక్తి ఉంటుందనీ అనుకోలేము.

త్రికరణశుద్ధి ఇతర విషయాల్లోకూడా ఉండాలి. లేకపోతే ఇతరులను మోసగించినట్లే అవుతుంది. ఇతరులకు ఉపకారం చెయ్యగల పదవిలో ఉన్న వ్యక్తిని· ఆశ్రయించి ఒకడు తనకు ఉపకారం చెయ్యవలెనని ప్రాధేయపడతాడనుకుందాం. ''తప్పకుండా నీకు ఉపకారం చేస్తాను'' అని ఆ అధికారి వాగ్దానం చేసి కూడా ఉపేక్ష వహించడం, ఆశ చూపుతూ పదిసార్లు తన వెంట తిప్పుకోవడం సాధారణంగా కానవస్తూ ఉంటుంది. ''నీ వెనుక యిన్నిసార్లు అతణ్ణి ఎందుకు తిప్పుకుంటావు ? చేస్తానన్న ఉపకారంచేసి పంపివెయ్యరాదా ?'' అని చనువున్న వారెవరైనా ప్రశ్నిస్తే ''ఏదో మాట వరసకు అన్నానేకాని, ఉపకారం చెయ్యాలనే పట్టుదల లేదు. ఏదో ప్రయత్నిస్తానుగాని, హామీ యివ్వలేను'' అని సమాధానం చెప్పవచ్చు. అప్పుడు మనస్సుకూ, మాటకూ పొందిక కుదరదు.

ఇలాటి సంఘటనలు ఎన్నయినా ఉండవచ్చును. ఇలాటివి త్రికరణశుద్ధి లేనివి. త్రికరణశుద్ధిలేని వ్యక్తికి గౌరవం ఉండదు. వ్యక్తికి జీవితంలో ''త్రికరణశుద్ధి'' అతి ముఖ్యమైనది.

అందరూ ఇలాగ ఉంటే....

మనస్సూ, శరీరం ఏదో లోకంలో విహరిస్తున్నాయి.

పురోహితుడు మంగళసూత్రాలు అందించాడు. శ్రీరామ్ తూలిపోతున్న శరీరాన్ని, మనస్సునీ అదుపులో పెట్టుకుంటూ, వుబికి వస్తున్న కన్నీటిని రెప్పల మధ్య దాచుకుంటూ మెల్లగా లేచాడు.

పెళ్లికూతురి మెడలో మూడుముళ్లూ వేశాడు. ''అయిపోయింది— అంతా పూర్తయిపోయింది— సంసార జీవితాన్ని గూర్చి తను కన్న కలలు—ఆశలు భగ్నమైపోయాయి. ఈ క్షణం నుండీ తను శోభా ప్రియుడు కాదు—ప్రొఫెసరు గారి అల్లుడు !'' విషాదంగా నవ్వుకున్నాడు శ్రీరామ్.

ఏదో పెద్ద అలజడి వినిపిస్తే కళ్లు తెరిచాడు.

''ఆగండి ఈ పెళ్లి ఆపండి!'' అరుస్తూ ప్రొఫెసరుగారు పరుగు పరుగున వస్తున్నారు.

అది చూసి శ్రీరామ్ ఆశ్చర్యపడ్డాడు. 'ఏం జరిగింది !' అనుకుంటూ యాదాలాపంగా ప్రక్కకు తిరిగి చూసి అదిరిపడ్డాడు.

పెళ్లికూతురి స్థానంలో శోభ వుంది ఆమె మెడలో తను క్షణం క్రితమే మూడు ముళ్లూ వేసిన పచ్చని తాళి మెరుస్తోంది.

ఇది కలా. నిజమా. అనుకుంటూ ఆ షాక్ నుండి తేరుకోలేకపోయాడు చాలాసేపటివరకూ.

'అంతా మోసం. దగా!'' ప్రొఫెసరుగారు శ్రీరామ్‌మీద చెయ్యెత్తబోయారు కోపంగా.

''నాన్నా !''

ఆ కేకతో పందిరి అదిరిపోయింది. అంతా స్థాణువుల్లా నిలిచిపోయారు.

ప్రొఫెసరుగారి కుమార్తె అపర కాళిలా నిలబడింది. తండ్రివేపు కోపంగా చూస్తూ--

''నాన్నా. ఆయన చేసిన మోసం—దగా ఏమీలేదు. ఆయన అమాయకుడు'' అంది.

''కాదు తల్లీ ! నన్ను వంచించి...''

''ఎవరు ఎవర్నీ వంచించలేదు. అతనికిదేమీ తెలీదు నేనే ఈ నాటకం ఆడాను !''

''రూపా !'' ప్రొఫెసరుగారి ముఖం వెల వెల బోయింది.

''అవును నాన్నా ! స్వార్థబుద్ధితో నాకూ, అతనికీ కూడా ఇష్టంలేని పెళ్లి చేయబోయావు. శోభ నాకు తెలుసు. ఆమె సహాయంతో ఇలా నేనే నాటకం ఆడాను. ఇది మా ఇద్దరికీ తప్ప ఇంకెవ్వరికీ తెలీదు. చివరివరకు రహస్యంగానే వుంచాను. శ్రీరామ్‌కి పి. హెచ్. డి. డిగ్రీ, వుద్యోగం వచ్చాకే చేసుకుంటానని నీతో చెప్పి ఆ రెండు అతనికి వచ్చేలా చేశాను. చివరికి శోభతో పెళ్లి జరిపించాను.''


ఆమె మాటలు వింటూ అంతా ఆశ్చర్యంగా ప్రొఫెసరుగారివేపు చూడసాగారు. వాళ్ల చూపులకు తట్టుకోలేకపోయారు.

''నాన్నా ! ఎంతోమంది విద్యార్థులకు విద్యాదానం చేసి వాళ్లను వెలుగుబాటలో నడిపించాల్సిన మీరే — చీకటిదారిలో నడిస్తే ఎలా ? మీకేకాదు. మీలాటి గురువులందరికీ ఇటువంటి అవమానం జరగాలి. అప్పుడే మన సరస్వతీ విద్యాపీఠాలు బాగుపడతాయి.''

ప్రొఫెసరుగారు అవమానంతో తలొంచుకున్నారు.

''నాన్నా ! మీ స్వార్థాన్ని నా మోసంతో జయించాను. ఎంతయినా మీ కూతురిని కదా !'' అంటూ రూప కొత్త దంపతులవేపు చూసి నవ్వింది.

ఆమె నవ్వు — వారి మనస్సుల్లో పూల పొదరిళ్లు వేసింది ! ★



డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎస్. ఆర్. ఎస్. — మద్రాస్

నా వయస్సు 23 సంసత్సరములు. నాకు వివాహమయి ఒకటిన్నరసంవత్సరములు అయినది. 10 నెలల బాబు వున్నాడు. నాకు ఇప్పుడప్పుడే మరొక సంతానము వద్దు. మాత్రలు వాడితే ఆరోగ్యం చెడిపోతుందని అంటారు. నిరోధ్ వాడితే గూడా గర్భం వస్తోందని స్నేహితులు అంటున్నారు. గర్భం రాకుండా వుండటానికి ఏ మాత్రలు వాడాలి ? స్నానము చేసిన 15 రోజుల తరువాత రతిలో పాల్గొంటే గర్భం రాదని నా స్నేహితురాలు చెబుతోంది. నిజమేనా?

★ మాత్రలు వాడితే ఆరోగ్యం చెడి పోతుందనే అనుమానం ఉన్నప్పుడు లూప్ వేయించుకోవటం మంచిది. నిరోధ్‌ని సరిగా వాడటంవల్ల గర్భం రావటానికి అవకాశం లేదు.

స్నానం చేసిన 15వ రోజున రతిలో పాల్గొంటే తప్పక గర్భధారణ జరిగే అవకాశం ఉంటుంది. 19వ రోజు నుంచి సేఫ్ పీరియడ్. ఈ తేదీలన్నీ సక్రమంగా ఋతుక్రమం వచ్చే వారికి మాత్రమే వర్తిస్తాయి—

జి. కె. ఆర్. — ఖమ్మం

నేను 4 నెలల క్రితం ఒక స్త్రీని కలిసాను. కొద్దిరోజుల తర్వాత అంగం లోపల చిన్నపొక్కులు అయి దాని ద్వారా రసిలాంటిది కారుచున్నది. నడుము నుంచి మోకాళ్ళవరకు నరాలు లాగు తున్నాయి. ఈ రోగం తగ్గటానికి ఏమి చెయ్యాలి ?

★ మీరు లాంగ్ ఏక్టింగ్ పెన్సిలిన్‌ను వైద్యుల పర్యవేక్షణలో వారి సలహా ప్రకారం వేయించుకోవటం మంచిది. కొందరికి లాంగ్ ఏక్టింగ్ సల్ఫా, స్ట్రెప్టోమైసిన్ మొదలగునవి వాడితే నయం అవుతుంది.

ప్రస్తుతం జిడాక్స్ వంటి కాప్సూల్స్ వరుసగా 10 రోజులు వాడితే తగ్గుతుంది.

కె. ఎస్. ఆర్. — మద్రాసు

నాకు ఎప్పుడూ నీరసంగా, ఉత్సాహం లేకుండా, కాళ్ళూ చేతులూ లాగుతూ ఉంటాయి. నా వయస్సు 36 సం॥లు. ముగ్గురు పిల్లలు. ఇంట్లో ఏ పని చెయ్యాలన్నా విసుగుగా ఉంటుంది. ఒక్కోసారి విపరీతంగా నడుం నెప్పి, కొన్ని రోజులు కడుపునెప్పి ఉంటుంది. ఒక్కో సమయంలో ఎక్కువగా గుండెలలో మంట వస్తుంది.

★ మనసులో చికాకువల్ల ఏ పనిపట్లా ఆసక్తి లేకపోవటం, ఇలా ఒక్కోరోజు ఒక్కో లక్షణం రావటానికి కారణం అవుతుంది. శరీరంలో బలం లేదనే అనుమానం, తమను ఎవరూ సరిగా చూసుకోవటల్లేదనే అపోహ, తమకందరూ వ్యతిరేకులే అని అనుకోవటం, మానసిక బలహీనత లక్షణాలు. క్రమబద్ధంగా ఆహారం తీసుకోవటం, పులుపు, కారం తగ్గించటం, జీవితంలో మంచిని చూడటం నేర్చుకోవాలి. ఇటువంటివాటికి మందుల వాడకం మంచిదికాదు.

కె. ఆర్. ఆర్. — జంగంపల్లి

నా పురుషాంగంమీది తోలు వెనుకకు పోవటంలేదు. దీనివలన నా భార్యతో సంపర్కం చేసేటప్పుడు అనుకూలంగాలేక నెప్పిగా ఉంది. వివాహమై నాలుగు నెలలవుతున్నది. ఆపరేషన్ అవసరమైతే ఎక్కడ చేయించుకోవాలి ?

★ దీనిని ఫైమోసిస్ అని అంటారు. దీనికి సర్కమ్‌సిషన్ అనే చిన్న శస్త్ర చికిత్స అవసరం. శస్త్ర వైద్యులు అందరూ ఈ చికిత్స చేస్తారు.

జి. పి. హెచ్. ఆర్. — వలాప


నా వయస్సు 27 సంవత్సరములు నేను అరగంట కూర్చుంటే కుడికాలు తిమ్మిరి పట్టేస్తోంది. అలాంటప్పుడు స్పర్శజ్ఞానము వుండదు. తిమ్మిరి వదలనిదే నడువలేను. దేనికి ఏ మందులు వాడాలి ?

★ ఒకే పొజిషన్‌లో నరాలకి వత్తిడి తగిలే విధంగా కూర్చోవటం వల్ల ఇలా అందరికీ జరుగుతుంది. దీనికంటూ ప్రత్యేకమైన మందులు లేవు.

వై. టి. — మజ్జివలస

నా కుమార్తె వయసు 1 సం॥ 5 నెలలు. మర్మస్థానంమీద చిన్న చిన్న పొక్కులులాగ ఉన్నాయి. చీము వస్తున్నది. దుర్వాసనగా ఉంది. దురదగా ఉన్నట్లుంది ?

★ వైద్యులకి చూపించి, పెన్సిలిన్, టెర్రామైసిన్ వంటి మందులు వాడండి. పూతగా కూడా పై మందులను ఆయింట్‌మెంట్ల రూపంలో వాడవచ్చును. ★





శ్రీమతి జి. భవానీకృష్ణమూర్తి సీరియల్ అనురాగ తరంగాలు

(గత సంచిక తరువాయి)

లీలతోపాటు రఘుకూడా హైదరాబాదు వెళ్ళడానికి తయారౌతూంటే, "ఎప్పుడూ ఒకటే రొటీన్ లైఫ్. నేనుకూడా వస్తానండి" అంది రేణుక.

గతుక్కుమని కంగారుగా రఘువైపు చూసింది లీల.

రఘుకూడా కంగారు పడినా సర్దుకుని "నువ్వు కూడా లేకపోతే ఇక్కడి పనులన్నీ ఎవరు చూస్తారు? నాకు ఎక్కువరోజులు ఉండడానికి కూడా వీల్లేదు. రెండు మూడురోజుల్లో తిరిగి వచ్చేస్తాను. ఆడపిల్లని ఒంటరిగా అంత దూరం పంపించడం మంచిది కాదని వెడుతున్నానంతే" సర్ది చెప్పాడు.

"సరే, మీ ఇష్టం" ముక్తసరిగా అనేసి లోపలికి వెళ్ళిపోయింది రేణు.

రెండు సూట్‌కేసుల్లో తన బట్టలు, పుస్తకాలు సర్దుకుంది లీల. నవలలు పంపించమని కోరుతూ ఉత్తరాలు వ్రాసిన పత్రికాధిపతులకి, పబ్లిషర్స్‌కి అనారోగ్య కారణంగా తను రాయలేక పోతున్నానని, డాక్టర్లు కొద్దిరోజులు విశ్రాంతి అవసరమని చెప్పారని, దయచేసి క్షమించమని రఘు సలహామీద జవాబులు రాసి పడేసింది.

వెళ్ళేరోజున ఆమె కోరిక మీద కారులో తీసికెళ్ళి నర్సింగ్‌హోమ్, శరణాలయం, స్కూలు తిప్పి చూపించాడు రఘు. ఇంటికికారులో తిరిగివచ్చేసరికి బాగా అలసిపోయినట్లు కూర్చుండిపోయింది.

తనని హైదరాబాదు రావద్దని అన్నప్పటి నుంచీ రేణుక ముభావంగా ఉండడం గమనించింది లీల. రఘుని కూడా రావద్దని చెప్పాలనుకుంది కానీ, అతను ఉంటే పన్లు జరుగుతాయిగానీ, అవన్నీ తనవల్ల ఏమౌతాయి అనుకుని ఊరుకుంది. అయినా తను వద్దంటే అతను మానేస్తాడు కనుకనా? అనుకుంది.

పుట్టి పెరిగిన ఆ ఊరిని; పరిసరాల్ని, ఆడిపాడిన ఆ యింటిని, ప్రాణానికి ప్రాణంగా పెంచిన తల్లిదండ్రుల్ని, ఆత్మీయులైన రఘు, రేణుల్ని; తన కలలకి ప్రతిరూపాలైన శరణాలయాన్ని, నర్సింగ్‌హోమ్, స్కూలుని వదిలి పెట్టి వెళ్ళాలనుకుంటేనే ప్రాణం గిజగిజలాడుతోంది. "తను మళ్ళీ తిరిగివస్తుందా? ఆత్మీయులైన తనవారిని చూడగలుగుతుందా? తన కలలరూపాన్ని తనివితీరా చూసుకోగలదా? ఏమో? ఈ వ్యాధి తనని మింగేస్తే? ఇదే తన కడసారి చూపు అవుతుంది. హా! జరిగేది జరగనీ" ఒక్క తల విదిలింపుతో ఆ ఆలోచనల్ని పారద్రోలి లేచి మెల్లగా రేణు గదిలోకి వెళ్ళింది.

బాబుని పక్కలో వేసుకుని పాలిస్తూ వీక్లీ తిరగేస్తోంది రేణుక.

ఎప్పటిలా ఆమె ప్రక్కన కూర్చోక పక్కన ఉన్న కుర్చీలో కూర్చుంది. గమనించినా గమనించనట్లే పుస్తకంలోకి చూస్తోంది రేణుక.

"రేణూ! ఇంకా నామీద కోపం పోలేదా?" మెల్లగా అడిగింది.

"నీ మీద నాకెందుకే కోపం?"

"మరి, ఈ ముభావానికి అర్థం?"

"ముభావంగా ఉండక ఏం చెయ్యమంటావు? నీ చుట్టూ నువ్వే ఒక గిరిగీసుకుని ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూనో, దిగులుగానో కూర్చుంటున్నావు. ప్రాణస్నేహితురాలివి అంటూ నాలిక చివరిమాటలే గానీ, అయ్యో! నా బాధ ఇది. నా ఉద్దేశ్యం ఇది అని నోరు విప్పి చెప్పగలుగుతున్నావా? అంటే... అంటే నన్నొక పరాయి దానిగా భావిస్తున్నట్లేగా? పిచ్చిదానిలా ఇంకా నిన్ను రాసుకు పూసుకు తిరిగి 'మైండ్ యువర్ ఓన్ బిజినెస్' అని నీచేత అనిపించుకోడం దేనికి అని దూరంగా ఉంటున్నాను."

"రేణూ!" లీల కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"ఇంతేనా నువ్వు నన్ను అర్థం చేసుకున్నది." గద్గద స్వరంతో అంది.

"ఎంతో... పూర్తిగా అర్థం చేసుకున్నాననే అనుకున్నాను గానీ, ఇప్పటి నీ ప్రవర్తన బట్టి ఇలా అనుకోవలసి వస్తోంది."

"ప్లీజ్, రేణూ! అలా మాట్లాడకే. నేను భరించలేను. నాకున్న ఒకే ఒక్క ప్రాణస్నేహితురాలివి నువ్వు. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో ఏమో కాస్త నవ్వు ముఖంతో సాగనంపవే."

ఇక ఆగలేకపోయింది రేణుక.

లేచివచ్చి ఒక్క ఉదుటన లీలని కౌగలించుకుంది.

"లీలా! ప్రాణమిత్రురాలివి అంతదూరం ఒంటరిగా వెడుతున్నావన్న బాధ తప్ప నీమీద నాకేమీ కోపం లేదే. పెళ్ళి చేసుకుని సంసార సౌభాగ్యాన్ని అనుభవించవలసిన వయస్సులో చదువు పేరుతో నీ మనసుని చంపేసుకుని మోడులా జీవిస్తున్నావన్న బాధ తప్పితే నీమీద నాకు కోపం ఏమిటే పిచ్చిదానా?" లీల కళ్ళు

జరిగినకథ — 7: వీరరాఘవులు, విశ్వనాథం ఇద్దరూ బాల్యస్నేహితులు. వీరరాఘవులు వ్యాపార నిమిత్తం విజయవాడలో స్థిరపడతాడు. విశ్వనాథం వూర్లోనే వ్యవసాయం చేసుకొంటుంటాడు. పెద్ద కామందు. వీరరాఘవులు పెద్దకొడుకు రఘు అమెరికా వెళ్ళి సర్జరీలో అనుభవాన్ని సంపాయించుకొని తిరిగివస్తాడు. విశ్వనాథం ఏకైక కుమార్తె లీలని అతనికిచ్చి చేయాలని ఇరువురూ నిర్ణయించుకొంటారు. లీల కూడా అతన్నే ప్రేమిస్తుంది. కానీ ఎవరూ ఊహించని విధంగా రఘు లీలని చెల్లెలిగా భావిస్తున్నానని చెప్తాడు. తన కిప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదని మంచి సంబంధం చూస్తానన్న రఘుతో చెప్తుంది లీల. రఘుకి తన చిన్ననాటి స్నేహితురాలు రేణుక తారసపడుతుంది. రఘు తన చాకచక్యంతో వెంకటేశాన్ని మంచి మనిషిగా తీర్చిదిద్దుతాడు. రఘు, రేణుక తన చిన్ననాటి తలపులు నెమరువేసుకొంటారు. తనకు వాగ్దత్త అయిన రేణుని ఒకరికి అర్పించలేను అన్న వెంకటేశానికి ఆమె జోలికి వెళ్ళనని మాట ఇస్తాడు రఘు. కానీ లీల రఘు, రేణులని ఒకటిగా చేస్తుంది. ఓ అనాథశరణాలయాన్ని నడపాలని నిశ్చయించుకొంటుంది లీల. అనుకున్న ప్రకారంగానే అనాథ శరణాలయాన్ని నిర్మించి ఎంతోమంది అభాగినులను ఆదుకొని వారికి జీవనోపాధి చూపెడుతుంది లీల. లీలని భయంకరమైన వ్యాధి ఆవరిస్తుంది. రఘుకి ఇచ్చిన మాటప్రకారం హైదరాబాద్ వెళ్ళి ట్రీట్‌మెంట్ తీసుకోడానికి ఒప్పుకొంటుంది. కానీ ఇంట్లో తల్లిదండ్రులకు, రేణుకకు తను చదువుకోడానికి వెళ్తున్నట్లు అబద్ధమాడి; వాళ్ళ కోపతాపాలకి గురౌతుంది. కానీ రఘు వాళ్ళని ఒప్పిస్తాడు.

తుడిచి ఆమె తలని గట్టిగా తన హృదయానికి హత్తుకుంది.

టైమవుతోందంటూ హడావిడిగా వచ్చాడు రఘు.

''రేణూ! ఇంతవరకూ నేను నిర్వహించిన బాధ్యతలన్నీ నీవి ఇకనుంచి. జాగ్రత్తగా చూసుకో.''

''అలాగేలే. ముందు నువ్వు పదవమ్మా తల్లీ'' అంటూ లీలని తొందర చేసి బయటకు తీసుకొచ్చేశాడు. ఒకరినొకరు విడిచి ఉండలేక బాధ ఏడుతూ బయటపడిపోతుందేమోనని అతని కంగారు.

తల్లి దగ్గరకు వెళ్ళి వంగి ఆమె పాదాలకి నమస్కరించి ''అమ్మా! నామీద కోపంగా ఉన్నా ఈ ఒక్కసారికీ నన్ను క్షమించి ఆశీర్వదించమ్మా'' దుఃఖం ఎగదన్ను కొస్తూండగా అంది లీల.

''వారి జీవితం ఏమైపోతుందనే ఆరాటం తప్ప బిడ్డల్ని కోపగించుకునే తల్లిదండ్రులుండరే'' అంటూ కూతుర్ని కౌగలించుకుని శిరస్సు చుంబించింది ప్రభావతమ్మ, కంట నీరు కారుస్తూనే.

తండ్రి దగ్గరకు వచ్చి ''నాన్నగారూ! ఈసారి తిరిగిరాగానే తప్పకుండా... నిజంగానే మీ కోరిక తీరుస్తాను.'' నోటికి పైటచెంగుని అడ్డుపెట్టుకుంది.

''అలాగే తల్లీ, అంతదాకా మేము బ్రతికి ఉంటే అలాగే...''

''నాన్నాగారూ!'' ఆయన నోరుమూసి గుండెలమీద వాలి వెక్కి వెక్కి ఏడుస్తూ ''అలా అనకండి నాన్నా. మీరు అమ్మా స్వయంగా పీటలమీద కూర్చుని కాబోయే అల్లుడి కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తారు. తప్పకుండా మీ కోరిక నెరవేరుతుంది నాన్నా'' అంది.

''అలాగేనమ్మా ఆ బంగారు కలని ఊహించుకుంటూ ఆ కల నిజమయ్యే శుభ సమయం కోసం నిరీక్షిస్తూ కాలం గడుపుతాము. జాగ్రత్తగా వెళ్ళిరామ్మా. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో.'' కూతురి తల నిమిరి బనీను జేబులో ఉన్న కొన్ని నోట్లని లీల చేతిలో పెట్టి గుప్పిలి మూశారు.

''రేణూ! అమ్మనీ, నాన్నగారినీ జాగ్రత్తగా చూసుకో. నేను లేని లోటు నువ్వే తీర్చాలి.'' చెప్పి అడుగు ముందుకి వేయబోతూంటే ''ఈ అప్పగింతలన్నీ ఏమిటే? చదువు వద్దు, చట్టుబండలు వద్దు. నువ్వెక్కడికీ వెళ్ళకే'' అంటూ లీలని గట్టిగా కౌగలించుకుంది.

''అలా అనుకుంటే నా కోరిక తీరేదెప్పుడే? పెళ్ళయ్యాక చదువుకునే యోగం ఎలాగూ ఉండదు. అందరూ మీ ఆయన లాంటి ఉదార స్వభావులే ఉంటారంటావా? తొందరగానే వచ్చేస్తానులే'' రేణుని మెల్లగా విడిపించుకుని,



పసివాడి బుగ్గలు నిమిరి, మెల్లగా బయటికివచ్చి కారెక్కింది.

మళ్ళీ చూస్తానో, లేదో అన్న ఆరాటంతో తల తిప్పి తనవారిని, ఇంటినీ చూడబోయింది గానీ, నీళ్ళు నిండిన కళ్ళకి అందరూ మసక మసగ్గా వెలిసిపోయిన బొమ్మల్లా కనిపించారు. కారు బయలుదేరబోతూంటే ఎదురైన జన సమూహాన్ని చూసి గట్టిగా కళ్ళు తుడుచుకుని కారు దిగి వారిదగ్గరకు వెళ్ళింది.

స్కూల్లో పనిచేసే టీచర్లు, నర్సింగ్ హోమ్ స్టాఫ్, శరణాలయంలోనివారు దీన వదనాలతో నిలబడి ఉన్నారు.

వారిని పేరు పేరునా పలకరించి వారి అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేసి, ధైర్యం చెప్పి వీడ్కోలు తీసుకుని వచ్చి కారు ఎక్కింది.

రఘు ఆజ్ఞ ననుసరించి డ్రైవర్ కారుని ముందుకి ఉరికించాడు.

* * *

కారుని జాగ్రత్తగా ఇంటికి తీసికెళ్ళమని డ్రైవరుకి చెప్పి ఇద్దరూ ట్రైను ఎక్కి తమ సీటు నంబర్లు చూసుకుని కూర్చున్నారు. దగ్గ తెర వస్తూంటే గుండెను చేత్తో పట్టుకుని తగ్గాక మెల్లగా వెనక్కు జారబడి కూర్చుంది లీల. వాటర్ బాటిల్‌లోని నీళ్ళు గ్లాసులో పోసి ఇచ్చాడు రఘు.

నీళ్ళు తాగి "రఘూ ! చివరికి ఇలా నీచేత సేవ చేయించుకోవలసి వస్తుందనుకోలేదు" ఆయాసపడుతూ అంది.

"అవేం మాటలు లీలా ! అప్పుడు నేను ఒళ్ళు తెలియకుండా అర్ధరాత్రిదాకా ఆస్పత్రిలో పడి ఉంటే ఊరంతా తిరిగి అంకుల్ నన్ను ఇంటికి తీసుకొస్తే రాత్రి తెల్లవార్లు మేలుకుని ఉండి నాకు సేవ చెయ్యలేదూ ? మన వాళ్ళకి మనం చేసుకోవడమే శ్రమ అనుకుంటే ఎలా?" కాస్సేపు అవీ ఇవీ కబుర్లు చెప్పి "కాసేపు విశ్రాంతి తీసుకో" జార్లబడి కూర్చునేందుకు వీలుగా దిండు సరిచేశాడు. కళ్ళు మూసుకుని స్థిమితంగా పడుకున్నాక స్పోర్ట్స్ వీక్ తీసుకుని చూస్తూ కూర్చున్నాడు.

విజయవాడలో ట్రైను ఆగింది. ఖాళీ అయిన వాటర్ బాటిల్ తీసుకుని నీళ్ళకోసం క్రిందికి దిగుతూ లీలని తట్టి లేపి సామాను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి వెళ్ళాడు. లేచి సరిగ్గా కూర్చుని కిటికీలోనుంచి బయటికి చూస్తూ కూర్చుంది. కాఫీ, పల్లీలు, వడలు అమ్మే కుర్రాళ్ళు, ఈవెనింగ్ ఎడిషను న్యూస్ పేపర్లు, మేగజైన్లు అమ్మేవాళ్ళు గోలగోలగా అరుస్తున్నారు. రైలు ఎక్కేవాళ్ళు, దిగేవాళ్ళు, సాగనంపడానికి వచ్చిన వాళ్ళు; స్వాగతం చెప్పడానికి వచ్చినవాళ్ళతో కోలాహలంగా ఉంది ప్లాట్‌ఫామ్. ఒక చేతిలో సూట్‌కేస్, భుజాన ఎయిర్ బేగ్, గుబురు

మీసాలు; గ్రే కలర్ ఫాంటుమీద 'టీ' షర్టుతో గబగబా పక్క కంపార్టుమెంటులోకి వెడుతున్న యువకుణ్ణి చూసి "జయా!" గట్టిగా పిలిచింది లీల. కానీ, ఆ హడావిడిలో ఆమె పిలుపు అతనికి అందలేదు. చుట్టుపక్కల వాళ్ళు మాత్రం తల తిప్పి ఒకసారి ఆమెవైపు చూసి తిరిగి తమ తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈలోగా వాటర్ బాటిల్‌తో నీళ్ళు తీసుకుని వచ్చాడు రఘు.

"ఏమైనా తింటావా లీలా ?" అడిగాడు.

"వద్దులే రఘూ! తరువాత కాఫీ తాగుదాం. జయ ఆ పక్క కంపార్టుమెంటులోకి వెళ్ళాడు చూడు. అతను కూడా ఏదో ఊరు వెడుతున్నట్లున్నాడు. పిలిచినా ఈ హడావిడిలో వినిపించ లేనట్లుంది. గబగబా వెళ్ళిపోయాడు" చెప్పింది.

"సరే, ఉండు చూసివస్తాను" దిగి వెళ్ళి పది నిముషాల్లో జయరామ్‌ని వెంటబెట్టుకుని వచ్చాడు రఘు.

లీలని చూస్తూనే తెల్లబోయాడతను.

"అదేమిటి లీలా అలా అయిపోయావు ?"

"నాకేమిటి బాగానే ఉన్నాను గానీ, నువ్వెక్కడికి బయలుదేరావు" ఇద్దరూ కూర్చోడానికి వీలుగా కొద్దిగా మూలకి జరుగుతూ అడిగింది.

"వాడూ హైదరాబాదే వస్తున్నాడట. వీడికి ఆ ఊరు ట్రాన్స్‌ఫరయిందట" చెప్పాడు రఘు.

"అలాగా ! అయితే నాకు కంపెనీ ఇస్తూం

భారమా !

పూవుకు తావి భారమా
తీవకు పూవు భారమా
తోటకు తీవ భారమా
స్వామికి తోట భారమా
ఆ స్వామికి ఈ తోట భారమా
తలపుకు జాలి భారమా
మేధకు తలపు భారమా
మనిషికి మేధ భారమా
స్వామికి మనిషి భారమా •
ఆ స్వామికి ఈ మనిషి భారమా
నిప్పుకు వేడి భారమా
నీటికి నిప్పు భారమా
పుడమికి నీరు భారమా
స్వామికి పుడమి భారమా
ఆ స్వామికి ఈ పుడమి భారమా
స్వామిలోన నీవుండగ
నీలోన స్వామి ఉండ
నీకెయ్యది దూరము
నీకెయ్యది భారము

— కనమలూరు వెంకటశివయ్య




ఇటీవల రవీంద్రభారతి (హైదరాబాదు)లో జలతరంగిణి సాంస్కృతిక కార్యక్రమాలలో నాట్యప్రదర్శన ఇచ్చిన కుమారి వాణిశ్రీకి మెమొంటోని అందజేస్తున్న డా. సి. నారాయణరెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీ సత్యనారాయణగార్లని చిత్రంలో చూడవచ్చు.


టావన్నమాట. ఆంటీ, అంకుల్, మణి కులాసాయేనా ?"

"ఆ ! అందరూ కులాసాయే. మణి స్టేషనుకి వస్తానంటే తిరిగి వెళ్ళేటప్పుడు ఒక్కతే వెళ్ళాలని నేనేవద్దన్నాను. మీరు ఈ ట్రైనుకే వస్తున్నట్లు తెలిస్తే అమ్మని కూడా తీసుకొచ్చేవాడిని" అన్నాడు జయ.


"ఏదీ, నిన్న మా ఫ్రెండు దగ్గర్నుంచి లెటరు వచ్చేవరకూ ఈరోజు బయలుదేరుదామని అనుకోలేదు. వచ్చేటప్పుడు ఇక్కడ ఆగి, అందర్నీ చూసి వెడదామనుకున్నాను." అంటూ కాఫీ అమ్మే కుర్రాడిని పిలిచి ముగ్గురూ కాఫీలు తాగారు. జయ సిగరెట్ వెలిగించబోతూంటే "ఒరేయ్, ఇక్కడకాదు, బయటకి పద" అంటూ తమ్ముణ్ణి కిందకి తీసికెళ్ళి లీల విషయం అంతా చెప్పి "అక్కడ టి. బి. ఆస్పత్రిలో చేర్పించడానికి తీసికెడుతున్నానురా. ఆంటీ, అంకుల్, మీ వదిన బాధపడతారని రిసెర్చ్ చెయ్యడానికి వెడుతోందని, యూనివర్సిటీలో జాయిన్‌చేసి వస్తానని చెప్పి బయలుదేరాను. నేను చూస్తూంటాను తీసుకొచ్చి జాయిన్‌చేసి వెళ్లమని మా ఫ్రెండు ఉత్తరం రాశాడుగానీ, నువ్వు కూడా ఆ ఊళ్ళోనే ఉంటావంటే నాకిప్పుడు పూర్తిగా నిశ్చింతగా ఉంది. నీకు వీలైనప్పుడల్లా వెళ్ళి చూస్తూండవచ్చు" అన్నాడు.

"అలాగే అన్నయ్యా ! ఇప్పుడిలా కలుసుకుంటామనిగానీ ఇలాంటి ఘోరవార్త వినాల్సి వస్తుందనిగానీ కలలో కూడా అనుకోలేదు. చిన్నప్పటినుంచీ మనతో కలిసి ఆడుతూ పాడుతూ


CHARMINAR
THE VAZIR SULTAN
TOBACCO CO LTD.
మీలాంటి
మగవానికి
తృప్తినిచ్చేది–చార్మినార్!
విశ్రాంతి పొందండి! చార్మినార్ తాగండి.



త్రికుట పర్వత గుహ ప్రవేశ ద్వారము



కాలిబాటన వెళ్తున్న యాత్రికులు

మహాశక్తి స్వరూపిణి మాతా వైష్ణవీదేవి!

దివ్య తేజస్సుతో అక్కడే కూర్చుండెను. విస్మయముతో శ్రీధర్ ఆమె కూర్చుండుటకు గల కారణమడిగెను. అందుకామె నీవు భుజించుము, నేను వెళ్ళిపోయెదననగా శ్రీధర్ తన వ్రత దీక్షను ఆమెకు తెలిపెను. దేవి అందుకు పరమానందభరితమై "ఓయి! నేనే వైష్ణవిని. ఇంక దీక్ష మాని భుజించుము నీకు నలుగురు పుత్రులు జన్మించగలరు. నేను వీర లంగరు రక్షణలో 'త్రికుట' పర్వతముపై తపమాచరించుకొనుచుందును. నేను నివసించు గుహవరకు భక్తులు కొరకు మార్గమేర్పరిచి, నా గురించి ప్రచారము చేయుము. నీ వంశమువారి వలన నాకు సదా పూజలు— ఆరాధనలు జరుగ గలవు" అని చెప్పి అంతర్ధాన మయ్యెను.

బాబా శ్రీధర్ గురించి మరొక కథ కూడ కలదు. శ్రీధర్ బాబా అభోజనవ్రత సమయంలో అందరు కన్యలు భోజనం చేసి వెళ్ళినను ఒక కన్య మాత్రము వెళ్ళకుండా నిలిచిపోయిన దంటిమి కదా! అప్పుడు శ్రీధర్ బాబా ఆమె నిలిచిపోవుటకు కారణమడుగగా తనే వైష్ణవిని అని చెప్పి, "బాబా! చుట్టుప్రక్కల బ్రాహ్మణులను కూడ ఆహ్వానించి భోజనము పెట్టుము అనెను" గోరఖ్‌నాథ్ శ్రీధర్ బాబా ఆహ్వానంపై తన శిష్యపరివారంతో కుటీరములోనికి ప్రవేశించెను. భోజనం చేయుచున్న భైరవినాథ్ తన గురువు యొక్క సాంజ్ఞచే వడ్డిస్తున్న కన్యను తనకు మాంసాహారము వడ్డించమని కోరెను శాంత గంభీర స్వరముతో ఆ కన్య "యోగివయ్యా! ఇది వైష్ణవ భండారము. నీకిక్కడ మాంసాహారము లభించదు" అని చెప్పినంతనే భైరవినాథ్ ఆమె చెయ్యి పట్టుకో జూచెను. ఆ కన్య అక్కడి నుండి పారిపోసాగెను. అజ్ఞాత రూపంలో రక్షకుడిగా వస్తున్న వీరలంగురుకి దప్పిక వేయగా దివ్య కన్య రాళ్ళలో బాణము వేసి జలాన్ని రప్పించినది. బాణముతో సృష్టించిన గంగ గనుక 'బాణగంగ' అనే పేరు వచ్చినది. దారిలో ఒకచోట ఆగి భైరవినాథ్ వెన్నంటి వస్తున్నాడా! లేడా! అని చూచిన స్థలానికి 'చరణ్ పాదుక' అని పేరు వచ్చినది ఆమెను వెదుకుచు వచ్చిన భైరవినాథ్ ఒక మునిని కన్య గురించి అడిగెను. అంత ఆ తపస్వి 'నీవు వెదుకుచు తిరుగుచున్న కన్య మానవమాత్రురాలు కాదు. ఆమె కౌమార్య స్థితిలో తిరుగుచున్న 'ఆదికుమారి' అని హెచ్చరించెను. తపస్వి 'ఆదికుమారి అని ఉచ్చరించిన కారణమున ఆ ప్రాంతమునకు 'ఆదికుమారి' అని పేరు వచ్చెను 'గర్భజూన్' అనే గుహలో ఆ కన్య తపస్సు చేసుకొనుచుండెను. భైరవినాథ్ ఆ గుహలో ప్రవేశించెను. అతనిని గమనించిన భగవతి తన త్రిశూలంతో గుహ వెనుక భాగమున మార్గమేర్పరిచి తిరిగి నడక సాగించెను. భైరవినాథ్ వెంబడించుచునే ఉండెను. త్రికుట పర్వతము నందలి సుందర గుహలో త్రికుట తపమాచరించుచుండెను. అక్కడికి కూడ భైరవినాథ్ ప్రవేశించెను రక్షకుడుగా నున్న వీరలంగురు భైరవినాథ్‌తో తలపడి ఓడిపోయే సమయంలో కన్య మహాకాళి అవతారమెత్తి భైరవినాథ్ తల నరికివేసెను. ఆ తల ఎత్తయిన శిఖరముపై పడెను. మొండెము గుహ ద్వారము కడనే పడెను. భైరవినాథ్ శిరస్సు నుండి దీనాతి దీనంగా "జగన్మాతా! నేను నిన్ను వెంటాడినది కేవలం గురువాజ్ఞ పాలనకొరకే. నా మృత్యువు నీ చేతిలో జరిగినందులకు నాకు చాలా సంతోషంలా ఉన్నదని" పలికెను. "కానీ ప్రజల దృష్టిలో నేనొక పాపాత్ముడిగా నిలిచిపోవడం బాధాకరంగా ఉన్నది. మోక్షం ప్రసాదించు తల్లీ" అని వేడుకొనెను 'మాతా' అన్న అతని సంబోధనకు హృదయం ద్రవించి "భైరవా! నాతోకూడ నీకు పూజలు అందుతాయి. నన్ను దర్శించి నిన్ను దర్శించకుండా వెళ్ళిన భక్తుల కోరికలు సిద్ధించవు" అని చెప్పి మూడు రూపముల పిండాకృతిలో రూపొందుచూ దేవి దేహత్యాగము చేసెను.

శ్రీధర్ బాబా కన్య పారిపోయిన తరువాత దుఃఖితుడై భోజనము విసర్జించెను. త్రికుట పర్వతములో తపమాచరించు దేవి ఆయనకు స్వప్నములో ప్రత్యక్షమయ్యెను. బాబా సంతుష్టుడై తిరిగి భోజనము చేయ నారంభించెను. త్రికుటపర్వతముచేరి దేవిని గుహలో గాంచి పులకితుడయ్యెను అక్కడివరకు మార్గమేర్పరిచి దేవినివాసము భక్తులకెల్లరకు ప్రచారము చేసి నలుగురు పుత్రులకు తండ్రియై దేవిపూజ, ఆరాధనలు గావించుతూ ధన్యుడయ్యెను. ఇప్పటికీ శ్రీధర్‌బాబా వంశీయులే వైష్ణవీదేవికి పూజ-పునస్కారములు జరుపుచున్నారని చెప్పదురు.

శ్రీ వైష్ణవీదేవిని దర్శించుట చాల శ్రమతో కూడిన పని. మార్గమంత నున్నటి రాళ్ళు పరుపబడి ఉండును. ఏకబిగిని నడిచిన పర్వత శిఖరాన్ని ఎక్కుటకు దిగుటకు 12 గంటలు పట్టును నడవలేని వారు గుర్రాలపై వెళ్ళవచ్చు పోను రాను గుర్రానికి మనిషికి 50 రూ ఖర్చు అవుతుంది. దారిపొడవునా అన్ని వసతులు ఉంటాయి ధర్మశాలలు ఉన్నాయి ఇక్కడ ప్రకృతి సౌందర్యం వర్ణనాతీతం. చలి కాలం తప్ప మిగతా కాలాలలో అంతా భక్తులతో వైష్ణవీదేవి ఆలయం కళకళలాడుతూ ఉంటుంది ఏమైనా జీవితంలో ఒకసారి దర్శించాల్సిన స్థలం ఈ వైష్ణవదేవి ఆలయం

వ్యాసం, ఫొటోలు :

శ్రీమతి అయ్యగారి వెంకటసత్యవతి*

రాలైనా నోట్లకీ కరువే. అందుకే స్త్రీ పాత్రల్ని మలచేటప్పుడు కొంత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను నేను. ఆ నా రచనల్ని చదివి ఏ స్త్రీ అయినా మేలు పొందగలిగిందంటే నా జీవితం ధన్యమైనట్లే భావిస్తాను.'' దగ్గుతెర వస్తుంటే నోటికి రుమాలు అడ్డుపెట్టుకుంది.

ఆమె ఆయాసపడుతూంటే ''క్షమించాలి. మీకు శ్రమ ఇచ్చినట్లున్నాం'' నొచ్చుకుందో అమ్మాయి.

''అదేంలేదమ్మా. చెప్పానుగా, ఈమధ్య నా ఆరోగ్యం బాగుండడంలేదని, నాలుగు మాటలు మాట్లాడినా, నాలుగడుగులు వేసినా ఆయాసం, నీరసం.''

''మరొక ప్రశ్న. మీరు స్త్రీ జనాభివృద్ధి కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని విన్నాం. మిమ్మల్ని అంతగా కదిలించిన సంఘటనలు ఏమిటి ? చేపట్టిన కార్యక్రమాలు ఏమిటి ?''

''నా మనసుని కదిలించిన సంఘటన అనుకోడానికి ప్రత్యేకంగా నాకేమీ ఎదురవలేదు. ఇందాకే చెప్పానుగా, స్త్రీకి సరి అయిన రక్షణ, భద్రత లేవు. కామాంధుల పశుత్వానికి బలి అయినవాళ్ళు, భర్తల దురాగతాలకి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళు; అత్త ఆడబిడ్డల ఆరళ్ళు భరించలేని నిర్భాగ్యులు, కల్లబొల్లి కబుర్లు నమ్మి ప్రియుని వల్ల మోసపోయినవాళ్ళు ... ఇలా ఎందరో స్త్రీలు ఆత్మహత్యలు చేసుకుంటూ, హత్యలు గావించబడుతున్న విషయం అందరికీ తెలిసినదే. అటువంటివారికి ''మీరు పిరికితనంగా చావనవసరంలేదు. నేను మీకు ఆధారం కల్పిస్తాను. మీ కాళ్ళమీద మీరు నిలబడండి'' అని వెన్ను తట్టి ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఒక అనాథశరణాలయాన్ని, ఒక నర్సింగ్‌హోమ్‌ని, ఒక హైస్కూలుని స్థాపించడం జరిగింది. ఎవరి అర్హతనుబట్టి ఆయా వృత్తులలో, పనులలో తర్ఫీదు ఇచ్చి వారు తయారుచేసిన వస్తువుల్ని మార్కెట్టుకి పంపించి, వచ్చే ఆదాయంలో కొంతభాగాన్ని వారికే ఇచ్చివేస్తూ కొద్దిభాగాన్ని మాత్రం శరణాలయ నిర్వహణకి ఖర్చు చేయడం జరుగుతోంది. నర్సింగ్‌హోమ్‌లోని నర్సులు, హైస్కూలు టీచర్సు ఆ శరణాలయం నుంచి ఆయా సంస్థలకు వెళ్ళి తర్ఫీదుపొంది వచ్చినవారే. అందుకు తగిన అర్హతలు కలిగినవాళ్ళు ఆ శరణాలయంలో లేకపోతేనే వేరే కేండిడేట్స్‌ని సెలక్టు చేసుకోవడం జరుగుతుంది. ఉడతా భక్తిగా సాటి స్త్రీలకి నాకు తోచిన సహాయం చేయగలుగుతున్నాను అన్న తృప్తి నాకు చాలు'' ఆగింది లీల.

''ఏమండి ! ఈ విషయంలో గవర్నమెంటు గారు మీకు ఏం సహాయం చెయ్యడంలేదా ?''

''నిన్న మొన్నటిదాకా అటువంటిదేం లేదమ్మా. ఈ మధ్యనే కొంత సొమ్ము గ్రాంట్ చెయ్యడం జరిగింది. ఆ డబ్బుతో ఇంకా ఎన్నో



అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పథకాలు రూపొందిస్తున్నాము, త్వరలోనే అవి అమలు జరుపుతాము, ఇదిగో, నా ఆరోగ్యం కాస్త కుదుట పడ్డాక.''

''థాంక్సండి. మీకు చాలా శ్రమ ఇచ్చాము. ఏమీ అనుకోవద్దు.'' మరోసారి తమ కృతజ్ఞతలు తెలియజేసుకుని ఆటోగ్రాఫులు తీసుకుని ''ఇక మీరు విశ్రాంతి తీసుకోండి మేడమ్'' వాళ్ళే లీల పక్క సరిచేసి పడుకున్నాక దుప్పటి కప్పారు.

''థాంక్స్'' చెప్పి నీరసంగా పడుకుండిపోయింది లీల. అప్పటికే కబుర్లు ఆపి కూర్చునే కునికిపాట్లు పడుతున్నారు జయరాం, రఘులు·

[ఇంకా వుంది]



శోభన్‌బాబు, జయసుధ 'దండయాత్ర'

ఉగాది ఉత్సవ కార్యక్రమం

"రాష్ట్రేతర ప్రాంతంలో తెలుగు భాషా సాంస్కృతిక వికాసమే ధ్యేయంగా ప్రతి ఏటా వివిధ రంగాలలోని ప్రముఖులను సత్కరించే మద్రాసు తెలుగు సంగీత నాటక నృత్య సాహిత్య ఐక్య అకాడమీని ఎంతైనా అభినందిస్తున్నాను," అన్నారు అధ్యక్షత వహించిన లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ కోన ప్రభాకరరావు. విద్వాన్ షేక్‌చిన్నమౌలా నాదస్వర సంగీతంతో ప్రారంభమైన ఉగాది ఉత్సవ కార్యక్రమంలో పంచాంగ శ్రవణం అనంతరం సి. నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో మల్లెమాల, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎ. బాల సుబ్రహ్మణ్యం, ఆరుద్ర, సాయికృష్ణయాచేంద్ర, ఉప్పద్రష్ట సాయి, చెరువు ఆంజనేయశాస్త్రి, పి. బి. శ్రీనివాస్, పి. ఎస్. గోపాలకృష్ణ, టి. ఎస్. ఎస్. రంగనాథ్ కవితాగానం చేశారు. బిందార్లు చిట్టిబాబు సంగీత నిర్దేశకత్వంలో మధురంగా గానం చేసిన శారద, పద్మజ, నరసింహారావు, శ్రీ సి. హెచ్. రామోజీరావు, ప్రొఫెసర్ ఎన్. ఆర్. వాకాల అనివార్య కారణాల వల్ల రాలేకపోయారు.

సినిమా విశేషాలు

-జి. వి. జి.

శ్రీకాంత్ నవల ఆధారంగా "పోతుగడ్డ"

"అభ్యుదయ రచయిత శ్రీకాంత్ రాసిన 'దేవుళ్ళారా మీ పేరేమిటి ?' విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ నిర్వహించిన నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందినది. సమకాలీన సమాజాన్ని, గ్రామీణ ఇతివృత్తాన్ని ప్రతిబింబించే ఈ నవల కన్నడంలో కూడా అనువదించబడింది. పల్లె ప్రాంతాల్లో ఇప్పటికీ నలుగుతున్న అనేకానేక సమస్యలతోపాటు వాటి పరిష్కారం కూడా కథలో ఇమిడి ఉన్నందున 'పోతుగడ్డ' అన్న పేరు నిర్ణయించడం జరిగింది," అన్నారు జి. శిరీష్‌బాబు. ఈయన కట్టా సుబ్బారావు దర్శకత్వంలో నిర్మించే జనచైతన్య ఆర్ట్ పిక్చర్స్ వారి



కాపురం'



'శ్రీమతి కావాలి'లో అనూరాధ

పై చిత్రంలో మాదాల రంగారావు ప్రధాన పాత్రధారి. టి. చలపతిరావు సంగీత దర్శకుడు. మార్చి 27, 28 తేదీలలో రెండు పాటలు రికార్డు చేయబడ్డాయి. మే నెలలో ఒకే షెడ్యూల్లో మన రాష్ట్రంలో చిత్రీకరణ జరుగుతుంది.

విజయబాపినీడు దర్శకత్వంలో శోభన్ సరసన జయసుధ, సుహాసిని

"వినోదాత్మకమైన కథ," అన్నారు విజయ బాపినీడు. ఈయన దర్శకత్వం వహించే శ్రీనివాసా ప్రొడక్షన్స్ ద్వితీయ చిత్రానికి ఏప్రిల్ 23న పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరుగుతుంది. శోభన్‌బాబు, జయసుధ, సుహాసిని, రావు గోపాలరావు, నూతన్‌ప్రసాద్, వేలు, నిర్మల పాల్గొంటారు. మే, జూలై నెలల్లో షూటింగ్ జరుగుతుంది. సత్యం సంగీత దర్శకుడు. సత్యమూర్తి సంభాషణలకర్త. ఆగస్ట్ 15న విడుదల చేయాలనుకున్నట్లు నిర్మాతలు గొట్టిముక్కల రాధాకృష్ణమూర్తి, కొమ్మన నారాయణ తెలియజేశారు.

కల్యాణీలకు నగదు బహుమతులను; నారాయణ, సాయి(శీలకు (పత్యేక బహుమతులను (శీ రాజలక్ష్మి ఫౌండేషన్ తరపున పి. వి. రమణయ్యరాజా అందజేశారు. ''వివిధ రంగాలలో విశేషమైన కృషి సల్పిన (పసిద్ధాం(ధ వ్యక్తులను ఈ పెద్ద పండుగనాడు ఒకే వేదికమీదికి తీసుకువచ్చి బృహత్తర కృషి చేసినందుకు ఈ ఐక్య అకాడమీ చెయిర్‌మన్ ఓబులరెడ్డిగారిని మనసారా అభినందిస్తున్నాను,'' అన్నారు అక్కినేని నాగేశ్వరరావు. వీరితోపాటు

మెమెంటోలు స్వీకరించినవారు : సర్వ(శీ బెజవాడ గోపాలరెడ్డి, డాక్టర్ సి. సత్యనారాయణ, డాక్టర్ (పతాప్ సి. రెడ్డి, ఆరు(ద, సి. నారాయణరెడ్డి, బి. నాగిరెడ్డి, మాలతీ చందూర్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, వీణ చిట్టిబాబు, ఎస్. రాజేశ్వర రావు, పి. సుశీల, ఎస్. జానకి, ఎస్. పి. బాలసు(బహ్మణ్యం, వెంపటి చిన సత్యనారాయణ, శోభానాయుడు, పి. పుల్లయ్య, కమలాకర కామేశ్వరరావు, శారద, పీసపాటి, వి. చం(దశేఖరం, మునిరెడ్డి, బాపు. మెమెంటోలను స్వీకరించ డానికి (పొఫెసర్ ఎన్. జి. రంగా, (శీ పి. వి.


'కాయ్‌రాజా కాయ్'లో చం(దమోహన్, తులసి

గుంటూరులో "దేశంలో దొంగలు పడ్డారు"

''మార్చి 22 నుంచి నెలాఖరు వరకు మ(దాసు (పాంతాల్లో తొలి షెడ్యూల్ జరిపాం. గుంటూరులో ఒకే షెడ్యూల్‌గా ఏ(పిల్ నెలాఖరుకి షూటింగ్‌ను ముగిస్తాం,'' అన్నారు కృష్ణ. ఈయన కథ, (స్కీన్‌ప్లే, దర్శకత్వంలో పోకూరి వెంకటేశ్వరరావు నిర్మించే ఈతరం పిక్చర్స్ ''దేశంలో దొంగలు పడ్డారు'' చి(తంలో సుమన్, విజయశాంతి, రాజ్యలక్ష్మి, కె. విజయ, విజయ, రాగిణి, రాజేశ్వరి, లక్ష్మీ(పియ, జయవిజయ, డబ్బింగ్ జానకి, పి.ఎల్. నారాయణ, సాక్షి రంగారావు, వీరభ(దరావు, వేలు, పి. జె. శర్మ, న(రా వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, శివరామరెడ్డి (ప్రభృత నటవర్గం. హరనాథరావు మాటలు రాశారు. అదృష్టదీపక్, లక్ష్మీనారాయణ గీతాలకు చ(క్రవర్తి బాణీలు కూర్చారు. ఆర్. రామారావు ఛాయ, చౌదుల సుబ్బారావు కూర్పు, ముత్యాల సుబ్బయ్య సహదర్శకత్వంతో బెజవాడ కోటేశ్వరరావు, సుబ్బారావు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.

మదరాసు తెలుగు సంగీత, నాటక, నృత్య, సాహిత్య ఐక్య అకాడమీ వారి ఉగాది ఉత్సవాల సందర్భంగా డా. బెజవాడ గోపాలరెడ్డిగారి నుంచి 'ఉగాది వెలుగు' మెమెంటోలని అందుకుంటున్న (శీ అక్కినేని నాగేశ్వరరావు, (శీ బాల మురళీకృష్ణ, (శీ యస్. పి. బాలసు(బహ్మణ్యం, (శీమతి పి. సుశీల, (శీమతి యస్. జానకి, (శీమతి శారదగార్లని చూడవచ్చు.





సినిమా విశేషాలు

-జి. వి. జి.



'జేమ్స్‌బాండ్ 999'లో సుమన్

ఎన్. వి. సుబ్బరాజు సమర్పణలో "జేమ్స్‌బాండ్ 999"

''మా 'చండీరాణి' చిత్రాన్ని విడుదల చేసిన రోజునే 'జేమ్స్‌బాండ్ 999' చిత్రాన్ని కైలాసకోన కొండల్లో ప్రారంభించాం,'' అన్నారు ఎన్. వి. సుబ్బారాజు. ఈయన కథ సమకూర్చి, సమర్పించే శ్రీవాణి ఆర్ట్స్‌వారి పై చిత్రంలో సుమన్ హీరో. శ్రీనివాసరెడ్డి సంభాషణలు, రాజ్–కోటి సంగీతం, ఎస్. ఎస్. రాజా ఛాయతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న వి.ఎస్. రంగనాధవర్మ ''జనవరికి షూటింగ్ ముగిస్తాం,'' అన్నారు.

ఎ. ఎస్. ఆర్. వాయిదలు

★ దర్శక నిర్మాత వి. బి. రాజేంద్రప్రసాద్ జనవరిలో ప్రారంభించే జగపతి ఆర్ట్‌పిక్చర్స్ చిత్రంలో విజయశాంతి నాయిక.

★ కోడి రామకృష్ణ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో చెరుకూరి ప్రకాశరావు జనవరి 1న ప్రారంభించే చిత్రంలో రాధ నాయిక.

★ ఫిబ్రవరి 11 నుంచి సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో భీమవరపు బుచ్చిరెడ్డి నిర్మించే జ్యోతి ఆర్ట్‌క్రియేషన్స్ చిత్రంలో రాధ నాయిక.

★ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో డాక్టర్ కె. శ్యామలమ్మ జూన్ 1 నుంచి నిర్మించే శ్యామలాఫిలిమ్స్ సంగీత నృత్యప్రధాన చిత్రంలో జయప్రద నాయిక.



'సర్దార్' లో జయప్రద


జయభేరీ ప్రొడక్షన్స్ 4వ చిత్రం


''కన్నడంలో లక్ష్మి నిర్మించిన 'ఇబ్బని కరిగితు' అనే చిత్రం హిట్ అయింది. దాని ఆధారంగా నిర్మించే చిత్రానికి జనవరిలో పాటలు రికార్డవుతాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో షూటింగ్ పూర్తిచేస్తాం,'' అన్నారు మాగంటి వెంకటేశ్వరరావు. ఈయన నిర్మించే చిత్రంలో మురళీమోహన్, సుహాసిని, చంద్రమోహన్ ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. చక్రవర్తి సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, డి. రాజగోపాల్ కూర్పులతో కిశోర్ నిర్మాణ సారథి.

పూర్ణిమా శంబైన్స్

మురళీమోహన్,రాధిక జంటగా రాజాచంద్ర దర్శకత్వంలో సుబ్బారావు, కోటేశ్వరరావు నిర్మించే చిత్రం ఫిబ్రవరి 25న సెట్స్‌కు వెళ్తుంది. కాశీ విశ్వనాధ్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, రాజగోపాల్ కూర్పు తెరవెనుక హంగులు.

శ్రీ భ్రమరాంబిక ఫిలింస్‌వారి కొత్త చిత్రం ముహూర్తపు షాట్‌కి కెమేరా స్విచ్ ఆన్ చేస్తున్న వి.యం.సి. డిష్ట్రిబ్యూటర్ దొరైస్వామిరాజా, ఛాయాగ్రాహకుడు కస్తూరి, దర్శకుడు కె. విశ్వనాథ్‌లని చిత్రంలో చూడవచ్చు.




జగపతి ఆర్ట్ పిక్చర్స్
ఎస్.పి.
భయంకర్
నిర్మాత-దర్శకుడు వి.బి.రాజేంద్రప్రసాద్
మాటలు-పాటలు: ఆచార్య ఆత్రేయ సంగీతం: కె.వి.మహదేవన్ కెమెరా: నవకాంత్
అన్నపూర్ణ



తారలు - తీరులు

★ "ఒక ప్రఖ్యాత తారకు జపాన్ లేక-ఆంగ్లో ఇండియన్ శిరోజాలంకరణ తెలిసిన యువతి కావలయును. వివరములకు ఈ కింది ఫోన్ నెంబర్‌కు డయల్ చేయండి," అంటూ 'హిందూ' పత్రికలో ఈ మధ్య ఓ ఆంగ్ల ప్రకటన వెలువడింది. ఆ ఫోన్ నెంబర్ సుమలతది. ఈ విషయమై ఆమెను అడిగితే, "ఇటీవల సినీఫీల్డ్‌లో హెయిర్ స్టయిల్సన్నీ దాదాపు ఒకే శైలిలో ఉంటున్నాయి. వెరైటీ అవసరం కదా? అంచేత, అలా ప్రకటన చేయక తప్పింది కాదు," అందామె.

★ అంబిక ఇటీవల సులోచనాలు ధరిస్తోంది. "మైనస్సా, ప్లస్సా?" అని ఎవరో అమ్మాయి అడిగితే, "జీనియస్," అని జవాబిచ్చిందామె ఈమెకు చెల్లెలు, రాధకు అక్క అయిన మాధవి, బి. ఎస్. సి.కి మే నెలలో వివాహం. "సినిమా మనిషి మాత్రం కాదు," అంది రాధ నవ్వుతూ. వరుడు శ్రీకుమార్ కేరళలో వాణిజ్యవేత్త "నేనిప్పుడు నటిస్తున్న హిందీ చిత్రం విడుదలయ్యాక హిట్ అయితేనే తదుపరి హిందీ చిత్రాలకు అంగీకరిస్తాను," అంది రాధ. "తుఫాన్ సూచన మేరకు ఉన్నట్టుండి స్కూళ్ళకుగాని, కాలేజీలకుగాని లీవ్ ఇస్తే స్టూడెంట్స్ ఎంత సంబరపడిపోతారో అంత ఆనందం కల్గుతుందండీ హఠాత్తుగా షూటింగ్ కేన్సిల్ అయితే. చక్కా ఇంటికెళ్ళి హాయిగా వీడియోలో సినిమాలు చూస్తుండొచ్చు. నాకు ఇంకో ఆశకూడా ఉంది – వయొలిన్ నేర్చుకోవాలని," అంది రాధ. ఈమె తెరమీదగాని, నిజ జీవితంలోగాని కుడి చెవిని కురులతో కాస్త కప్పి ఉంచుతుంది సాధారణంగా ఈ విషయం గురించి అడిగితే, "అవునండీ, చిన్నప్పట్నుంచీ అంతే," అంది. ఏదైనా ప్రశ్న అడిగితే, రెండు మూడు క్షణాలు కళ్ళు మూసుకుని ఆలోచించి జవాబు చెప్పడం ఈమె మేనరిజం. "భలే గమనించారే," అంది మందహాసంతో. ఈమె అసలు పేరు ఉదయ చంద్రిక.

★ సిల్క్‌స్మితకు హేండ్‌బాగ్స్ సేకరించడం ఓ హాబీ. ఈమెవద్ద యాభైకి పైగా హేండ్‌బాగ్స్ ఉన్నాయట. "వాటిని ఖాళీగా ఉంచను సుమండీ. ప్రతి బేగ్‌లోనూ వందరూపాయల నోటు ఒకటో రెండో ఉంచి మరీ బీరువాలో భద్రపరుస్తాను" అందామె.

★ జయలలిత పొలిటికల్ సైన్స్ పార్యభాగంగా మైసూరు విశ్వవిద్యాలయం నిర్వహించే డిగ్రీ పరీక్షలకు హాజరవబోతోంది. 'మానసవీణ' హీరోయిన్ రేవతికూడా మేలో జరిగే మద్రాసు యూనివర్శిటీ పరీక్షలకోసం తయారవుతోంది

★ "నాకు నీలంరంగు చీర చాలా లక్కీ," అంటుంది సరిత. "కొన్నిసార్లు ప్లేన్ టిక్కెట్లు కన్‌ఫర్మ్‌కాని పరిస్థితుల్లో నేను బ్లూ శారీ కట్టుకుని విమానాశ్రయానికి వెళ్ళేసరికి ఇట్టే సీట్లు దొరికిపోయాయి విచిత్రంగా. అలాగే '7' నా లక్కీ నెంబర్. కమల్‌హాసన్ తన ప్రతి కారు నెంబరూ మొత్తం కూడితే '7' వచ్చేలా చూసుకుంటారు. నేనుకూడా ఈసారి కారు కొనేటప్పుడు అదేవిధంగా చూసుకోవాలి," అందామె. ఈమెను బాలచందర్ యూనిట్‌లోని వారంతా "శిశు" అని పిలుస్తారు

★ "చివరిదాకా శాకాహారమే భుజించాలనీ, ప్రతి రోజూ ఒక సినిమా చూడాలని నా కోర్కెలు. ఇందులో మొదటిది నెరవేరుతుందిగాని, రెండోవది నెరవేరడమే కాస్త కష్టం," అంటుంది నళిని.

వి. జగదీష్ దర్శకత్వంలో మరో రెండు చిత్రాలు

"సూపర్ స్టార్" అనంతరం సినీ కళా కేంద్ర బానర్‌లో కాకినాడకు చెందిన వేదుల సుబ్రహ్మణ్యం, విఘ్నేశ్వరరావు నిర్మించే "రావణ ప్రతిజ్ఞ" పౌరాణిక చిత్రానికి, "సరంగు సాంబయ్య" సాంఘిక చిత్రానికి వి. జగదీష్ దర్శకత్వం వహిస్తారు.

'లింగడు—రామలింగడు'లో జయమాలిని



సుత్తి కౌముసుమ్మా!



రేలంగి... అనేమాట వినగానే ఇవాళ్టికీ నవ్వు వస్తుంది! హాస్యంలో అంతటి ప్రతిభ చూపించాడు ఆయన! ఆ తర్వాత... రాజబాబు హాస్యనటునిగా మంచి పేరు తెచ్చుకొన్నాడు.

అలా హాస్యనటులుగా మంచి పేరు తెచ్చుకుని... జనంలో నాలుగు కాలాలు వుండి పోయిన ఏకైక నటుడు శ్రీ అల్లు రామ లింగయ్య —

వయసు పెరుగుతున్నా... ప్రతిభ తగ్గి పోకుండా... ఒక చిత్రంలో కాకపోతే మరో చిత్రంలో జాగ్రత్తపడుతూ ఇవాళ్టికీ 'అరేయ్... అల్లురోయ్ ...' అనిపించుకుంటున్నాడు ఆయన వొక్కడే!... అయితే— ఇవాళ అల్లుకి వారసుడు ఎవరు అని అడిగితే... నిజానికి ఎవరూ లేరు! కానీ— అల్లులాగా పాత్రని అర్థం చేసుకొని ... ఇటు కుర్రాడిగా . అటు ముసలాడిగా నటించగల ప్రతిభ కనిపించే వ్యక్తి... 'వేలు' అంటే తప్పు లేదనుకుంటాను —

వేలు అనేకంటే 'సుత్తి వేలు' అంటేనే బాగా అర్థం అవుతుంది జనాలకి —

మన చిత్రాలలో సున్నితమయిన హాస్యానికి కరువు ఏర్పడిన దశలో... శ్రీ జంధ్యాల పరిచయం చేసిన ఈ 'సుత్తి' జనాలకి మంచి హాస్యం అందించాడు —

ఆ తర్వాత వచ్చిన చాలా చిత్రాలలో చాలా పాత్రలు ధరించిన వేలు... ఈ మధ్య వస్తున్న ఎక్కువ చిత్రాలలో బాగా కనిపిస్తున్నాడు—

తనకి లభించిన పాత్ర ఎలాటిదయినా ... మాటలలో.. విరుపులో మంచి కృషి చేసి .. జనాల మెప్పు అందుకుంటున్నాడు —

ఫర్వాలేదు... తెలుగు చిత్రాలలో మరో మంచి హాస్యనటుణ్ని చూస్తున్నాం... అనిపించేలా నటిస్తున్నాడు— అయితే. తొలిచిత్రం 'నాలుగు స్తంబాలాట' తర్వాత 'ఈ చదువులుమాకొద్దు' చిత్రంలో మాత్రమే అతనికి గుర్తింపుగల వేషం లభించింది! ఇలాంటి వేషాలు. పదిలో రెండు లభించినా వేలు కొన్నాళ్ళు జనాలకి దగ్గరగా వుండి 'మంచి హాస్యనటుడిగా' వాళ్ళ ఆదరణ అందుకుంటాడు— ఎందుకంటే. వేలుకి వేలు యిస్తే వేలే కొరుకుతాడు! మండ మింగడు! అంటే... అతి లేదు!... ఆ 'అతి' లేనంత వరకూ— నేను బడిపంతులు కుటుంబీకుణ్ని! మా కుటుంబాన్ని పోషించే శక్తి ఇస్తే అంతే చాలు!— అనే 'వినయం' వున్నంతవరకూ—వేషాలకి కొరత... ప్రజాదరణకు కరువు వుండవు!

ఏమయినా — తెలుగువాళ్ళకి ఒక మంచి హాస్యనటుణ్ని అందించిన శ్రీ జంధ్యాలకి ఓ థాంక్స్ చెప్పడం... కనీస ధర్మం!


— సుధ

నరేష్ హీరోగా కృష్ణ సమర్పించే "ముక్కోపి"

"మా నరేష్ సరసన రాధ తొలిసారిగా హీరోయిన్‌గా నటిస్తోంది," అన్నారు విజయ నిర్మల. ఈమె స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో ఎస్ రమానంద్ నిర్మించే శ్రీ విజయకృష్ణ మూవీస్ "ముక్కోపి"చిత్రానికి మార్చి 23న బి. నాగిరెడ్డి స్విచ్ ఆన్, బి. సురేష్‌రెడ్డి క్లాప్‌తో ప్రారంభం జరిగింది. సుధాకర్, సత్యనారాయణ, రావు గోపాలరావు, సాక్షి రంగారావు, వేలు, టెలిఫోన్ సత్యనారాయణ, రమాప్రభ, అన్నపూర్ణ, సుమంగళి ఇతర భూమికలు నిర్వహిస్తున్నారు. సత్యానంద్ సంభాషణలు, రమేష్ నాయుడు సంగీతం, పుష్పాల గోపాలకృష్ణ ఛాయ, ఆదుర్తి హరినాధ్ కూర్పుతో ఆర్. పద్మనాభన్ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, ఎస్. రఘునాధ్ సహ నిర్మాత "అల్లు రామలింగయ్య గెస్టుగా కనిపిస్తారు .. ఏప్రిల్ 9 నుంచి 15, మే 17 నుంచి 22, జూన్ 11 నుంచి 19... జూలైలో పాచ్‌వర్క్ పూర్తిచేసి, ఆగస్టులో రిలీజ్ చేయాలనుకుంటున్నాం," అన్నారు నిర్వహణ బాధ్యతలు వహించే ఎస్. రవికుమార్.

వరండా

టి. యస్. ఎ. కృష్ణమూర్తి



వర్షం ఎక్కువవుతోండగా లైబ్రరీ నుండి వెలుపలికి వచ్చాను. వర్షానికి భయపడి నేను ఎప్పుడూ ఎక్కడా ఆగిపోయింది లేదు. అందుకే తడుస్తూనే బయల్దేరాను ఇంటికి. ఇల్లు చేరేసరికి తడచి ముద్దయిపోయాను. వరండా ప్రక్కనున్న సందులోకి వెళ్ళబోతున్న నన్ను చూసి బిగ్గరగా దగ్గుతున్న బాబాయ్ దగ్గును ఆపుకుంటూ అరిచాడు.

"ఎందుకురా అబ్బీ అలా తడిచావు ? ఎక్కడ చూసినా విషజ్వరాలున్నాయంటున్నారు ఊర్లో !"

జవాబుగా చిన్నగా నవ్వి సందులోకి వెళ్ళకుండా వరండా పైకెక్కి వెళ్ళి బాబాయ్ మంచం దగ్గరగా నిలబడ్డాను.

అనేక సంవత్సరాలుగా చల్లనీళ్ళ స్నానానికి అలవాటుపడిన వాడ్నవడం వల్లా, అనేక ప్రాంతాలలో, అనేక రకాల వాతావరణాలలో కాలంగడిపి వచ్చిన వాడ్నవడం వలనా ఎంత వర్షంలో తడిచినా నాకు కనీసం జలుబు కూడా చేయదు. అయితే ఈ పెద్దవాళ్ళకు పిల్లలు ఎంత పెద్దవాళ్ళయినా ఇంకా చిన్న పిల్లలుగానే కన్పిస్తారేమో! ప్రతిదానికీ కంగారు పడిపోతుంటారు.

"ఎలా ఉంది బాబాయ్ ? ఒంట్లో !" అని ప్రేమగా అడిగాను.

ఉమ్మడి కుటుంబాలలో వయసు వుడిగిపోయిన ముసలి వాళ్ళను గూర్చి ప్రత్యేక శ్రద్ధ కన్పించేవారు తక్కువ సహజంగా. నా ప్రశ్నకు బాబాయ్ కళ్ళలో తడి కన్పించింది కొద్దిగా.

"ఏముందిరా అబ్బీ... పోయేకాలమే కానీ.. వచ్చే కాలం కాదు కదా ? మొన్నటికి డెబ్బయి రెండేళ్ళు పూర్తయాయి నాకు. ఇంకెన్నాళ్ళుండబోతాను ? మహా అయితే ఓంకో రెండుమూడు నెలలు... అంతే !" అన్నాడు.

ముసలాయన చెప్పింది నిజమే. ఆయన చాల రోజులుగా జబ్బుపడి ఉన్నాడు. ప్రస్తుతం మంచం దిగలేని స్థితిలోకి వచ్చేసింది ఆయన పరిస్థితి.

బాబాయ్‌తో మాట్లాడి వరండా దిగి వచ్చేస్తోంటే ఆయన అన్నాడు :

"ఒరేయి అబ్బీ...ఈ వరండాలో ఓ దేముడి పటం తగిలించరా. చనిపోయేముందు దేవుడ్ని చూస్తూ కన్నుమూస్తాను."

నా మనసు అదోలా అయిపోయింది. తల ఊపి సందులోకి వచ్చేశాను.

సందు చివర్నవున్న నా గదిలోకి నేను చేరుకునేసరికి నా గదిలో మూతపెట్టబడ్డ పాత్రలో చపాతీలు, ఫ్లాస్కులో పాలు బల్లమీద సిద్ధంగా ఉన్నాయి.

నేను రాత్రులందు భోజనం మానేసి రెండేండ్లు అయింది. నా గది తాలంచెవి మరోటి ఇంట్లో వాళ్ళవద్ద ఉంటుంది. అందువల్ల నేనున్నా లేకపోయినా పిల్లలు సరిగ్గా రాత్రి ఏడు గంటలకు నా రాత్రి ఆహారంగా చపాతీలు, పాలు నా టేబిలుమీద ఉంచేస్తారు.

తల తుడుచుకుని దుస్తులు మార్చుకుని కుర్చీలో కూర్చుని చల్లారిపోతున్న చపాతీలు తింటూ నా గదిలో ఉన్న ఒకే ఒక దేముడి ఫొటోకేసి చూశాను.

* * *

సకల దేవతలూ పరివేష్టించి కొలుస్తోండగా, లక్ష్మీదేవి పాదములు ఒత్తుతోండగా సర్వాలంకారభూషితుడై ఆదిశేషుడిమీద పవలించివున్న శంఖు, చక్రధారి పోటోను ఉదయం పది గంటలప్పుడు తీసుకువెళ్ళి వరండాలో బాబాయ్

మంచం ప్రక్కనున్న గోడమీద మూడు మేకుల సహాయంతో బాబాయ్ పడుకున్నా కూడా పటం స్పష్టంగా కనిపించేలా వాల్చి తగిలించాను.

బాబాయ్ కళ్ళు మెరిశాయి. ప్రశంసా పూర్వకంగా నాకేసి చూశాడు.

''బాబాయ్ ! హాయిగా నా గదిలోకి వచ్చేయ రాదూ ? చలిగాలిలో ఈ వరండాలోనే ఉండి అవస్థపడకపోతే ? !'' అన్నాను.

ఆయన బిగ్గరగా నవ్వాడు.

''ఒరేయి అబ్బి... అసలు ఈ వరండాలు ఉడిగి బుడిగిలోకి వచ్చే ముసలివాళ్ళ కోసమే సృష్టింపబడ్డాయిరా నాన్నా !'' అన్నాడు.

''ఛా బాబాయ్ ! నీది మరీ చాదస్తం !'' అన్నాను తెల్లబోయి.

''చాదస్తం కాదురా నాన్నా... యధార్థం. మానవ జీవితంలో అతి భయంకరమైనది మనిషి చమరదశ. ఈ దశలో మనిషి ముసలితనంతోటే, జబ్బులతోటే పీడింపబడుతూ అసహ్యంగా తయారవుతాడు. ఆ అసహ్యాన్ని తక్కినవాళ్ళు భరించడం కష్టం. తక్కినవాళ్ళు భరించగలిగినా తను తక్కినవాళ్ళ మధ్య ఉండలేడు చమర దశలోని మనిషి. ఈ దశలోని మనిషి కోటీశ్వరుడు కావచ్చు, బిచ్చగాడు కావచ్చు... నిరాశా నిస్పృహలకూ, వంటరితనానికీ లోనుగాకుండా తప్పించుకోలేడు.

అందుకే తక్కినవాళ్ళు తమకు తెలియకుండానే కాస్త దూరంగా ఉంచాలని ప్రయత్నిస్తారు... తనూ వారికి కాస్త ఎడంగా ప్రత్యేకంగా వంటరిగా ఉండాలని అనుకుంటాడు. అలా వారు ఉంచడానికీ, ముసలివాళ్ళు ఉండడానికీ చక్కగా పనికివచ్చే ప్రదేశం... ముఖ్యంగా మధ్యతరగతి ఇళ్ళలో... ఏదో తెలుసా ? వరండా !''

గబగబా చెప్పడంవల్ల కొద్దిగా దగ్గి ఆయాసపడ్తూ నవ్వుతున్నాడు బాబాయ్. జీవితాన్ని కాచి వడబోసిన విజ్ఞానం ఆయన మనసు నిండుగా ఉంది. ఆయన చెప్పే ప్రతి మాటలోనూ వంద శాతం నిజమూ ఉంది.

''ఈ వరండాలోనే మా తాతవాళ్ళ అమ్మా నాన్నలు... అంటే మా ముత్తాత, ముత్తవ్వలు తమ చివరి రోజులు గడిపారని విన్నాను. మా తాతగారు ఆరడుగుల ఆజానుబాహుడు. తన చివరి దశలో దాదాపు ఆరునెలలు ఇదే వరండాలో ఇదే మంచంమీద జబ్బుతో తీసుకుని, తీసుకుని చనిపోవడం నేను చూశాను. ఆయన పోయాక ఆర్నెల్లకంతా మా బామ్మ ఈ మంచం మీదకు చేరి కొద్దిరోజులలోనే కన్నుమూయడం నాకు బాగా జ్ఞాపకం వుంది. అసలు ఆ రోజులలోనే వీధిన వెళ్ళేవారికి ఈ మంచంమీది మనుషులు కనపడకుండా ఉండడానికి వరండా సగానికి ఈ ఒంటి ఇటుక గోడ కట్టించారు.

ఈ మంచంమీద ఈ వరండాలో మనవాళ్ళు ఎందరో కడపటిరోజులు అనుభవించారు. నీవు చూసింది చాల కొద్దిమందినే ! ఇప్పటికి ఆఖర్న కన్నుమూసినవాడు మీ నాన్న. పదేళ్ళు దాటింది కదా ? వాడికన్నా నేను రెండేండ్లే చిన్నవాడ్ని ... ఇప్పటికి ఈ ఇంట్లో అందరికన్నా పెద్దవాడ్ని... ఇంకా కొన్నిరోజులలో...'' అంటూ అర్ధోక్తిలో ఆపేసి నవ్వుతున్నాడు బాబాయ్.

నా ఒళ్ళు జలదరించింది. వయసు ఉడిగిన వాళ్ళు చాలామంది తమ మరణాన్ని గూర్చి చాలా తేలికగా తీసుకుంటారు. మా బాబాయి మరీనూ. ఆయనకు చావంటే ఏదో పకోడీలు కొరుక్కు తిన్నట్లుగా ఉన్నట్లుంది.

*　　*　　*

పదిరోజులు గడిచాయి.

బాబాయ్ ఆరోగ్యం మరీ దిగజారిపోయింది. ఆహారం తీసుకోవడం బొత్తిగా మానేశాడు. కాలకృత్యాలు అన్నీ మంచంమీదే జరిపించాల్సి వస్తోంది.

''ముసలాయన టపా కట్టేసేలావున్నాడు!'' అనుకుంటున్నారు ఇంట్లో వాళ్ళందరూ. మునుపటికన్నా మరికాస్త శ్రద్ధగా ఆయనకేసి చూస్తున్నారు అందరూ. అందరికన్నా ఎక్కువ బాధపడ్డవాడూ ఆయన సేవా శుశ్రూషలలో ఎక్కువభాగం పంచుకున్నవాడూ వాసు. వాడు బాబాయ్ పెద్దకొడుకుకి రెండవ పుత్రుడు.

ఒకరోజు ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో నా గదికి వచ్చాడు వాడు.

''బాబాయ్ ! మీరు నాకు కాస్త తోడు రావాలి !'' అన్నాడు వచ్చీ రావడంతోటే.

''ఎక్కడికిరా ? ఎందుకూ ?''

''వరండాలోకి. తాతయ్య కాలకృత్యాలు కూడా మంచంమీదే చేసుకుంటున్నాడా ? ఆయన బట్టలు మార్చడానికీ, ఆయనకు ఒళ్ళు తుడవడానికీ అమ్మా, అత్తయ్యా వాళ్ళందరూ అయిష్టత చూపుతున్నారు. అసలు ఆయనకు సరయిన సౌకర్యాలు సక్రమంగా అమరడంలేదు ప్రక్కమీద. మీరుగానీ ఉదయం ఒక అరగంట, సాయంకాలము అరగంట నాతో సహకరిస్తే ఆయనకు మనం చేయగలిగిన సేవలు చేయవచ్చు శుభ్రంగా!'' అన్నాడు.

వాడ్ని చూస్తూంటే ముచ్చటేసింది నాకు. బి. ఎ. మొదటి సంవత్సరం చదువుతున్న చాకు లాంటి కుర్రాడువాడు. వాడిలోని దయాహృదయానికి వాడివైపు ప్రశంశాపూర్వకంగా చూడకుండా ఉండలేకపోయాను.

వాడి వెంబడి వరండాకేసి నడిచాను.

వాడు మొదట ఇంట్లోకి వెళ్ళి ఓ పాత చాప తీసుకువచ్చాడు. దాన్ని క్రిందపరచి నా సహాయంతో బాబాయ్‌ని మంచంమీదనుండీ చాప మీదకు దించి పడుకోబెట్టాడు. తరువాత చకచకా మంచం మీదవున్న పడకమీది దుప్పట్లూ, దిండు ముసుగూ అన్నీ తీసి కట్టకట్టి పనిమనిషి చేతికి ఇచ్చి వెళ్ళి దగ్గరలోఉన్న పిల్లకాలువలో ఉతుక్కురమ్మని పురమాయించాడు. ఇంట్లోంచి వేరే దుప్పట్లు, దిండు గలీబు, ఓ రబ్బరు షీటు తెచ్చి మంచంమీద ప్రక్క నీటుగా తయారు చేశాడు. ఇంట్లోంచి ఓ చిన్న గ్లాసులో ఉప్పు నీళ్ళు తెచ్చి బాబాయ్ నోరును శుభ్రపరిచాడు. మళ్ళీ ఇంట్లోకి వెళ్ళి ఓ పెద్ద బేసిన్‌లో వేడి నీళ్ళు తెచ్చి ఆ నీటిలో నాలుగు చుక్కలు డెట్టాల్ వేసి ఓ టవలుతో ఆ నీళ్ళు అద్దుకుంటూ ముసలాయన ఒళ్ళంతా శుభ్రంగా తుడిచి, ఆయనకు శుభ్రంగా ఉతికిన లుంగీ కట్టబెట్టాడు. తరువాత నా సహాయంతో బాబాయ్‌ని జాగ్రత్తగా మంచంమీదకు చేర్చాడు.

నిజానికి నేను చేసింది చాల స్వల్పం. వాడు పట్టుకోమన్నట్లు బాబాయిని పట్టుకోవడం.



వాడు క్వాలిఫైడ్ మేల్ నర్సులా చకచకా పనంతా చేశాడు.

ప్రతిరోజూ ఉదయమూ, సాయంకాలమూ రెండు పర్యాయాలు వాడూ, నేనూ కలిసి ముసలాయననూ, ఆయన పక్కనూ శుభ్రపరిచే కార్యక్రమమును కొనసాగించసాగాము. ఇంట్లో వాళ్ళందరూ మా పనిని చూసి చాల సంతోష పడ్డారు. వాళ్ళ సంతోషానికి రెండు కారణాలు కన్పించాయి నాకు. ఒకటి... వాళ్ళకు శ్రమ తగ్గడం. రెండు... ముసలాయనకు ఎవరో ఒకరు సేవలు చేస్తున్నారనే సంతృప్తి కలగడం.

వాసూని చూసి కాస్త బుద్ధి తెచ్చుకున్న తక్కిన పిల్లలు గంట గంటకూ బాబాయ్‌ని శ్రద్ధగా విచారించి ఆయనచేత ఏదో ఒకటి త్రాగిస్తున్నారు అక్కరగా.

మా ఫామిలీ డాక్టరు రవిచంద్ర ప్రతిరోజూ వచ్చి ముసలాయనని చూసి వెళ్తున్నాడు. ఏవో మందులు, ఇంజక్షనులు ఇస్తూనే వున్నాడు.

నా అసిస్టెన్సు తీసుకుని వాసూగాడు ఎంతో జాగ్రత్తగా ముసలాయన్ని చాలా పరిశుభ్రంగా ఉంచుతున్నాడు. అయినాకూడా బాబాయి దురదృష్టం ఏమిటోగాని ఆయనకు బెడ్ సోర్సు ప్రారంభం అయ్యాయి.

మొదట వీపులో వచ్చాయి పుండ్లు. డాక్టరు ఇచ్చిన పౌడర్ అద్ది, గాజుగుడ్డతో పుండ్లకు డ్రెస్సింగ్‌చేసి ప్రక్కకు తిప్పి పడుకోబెట్టాడు వాసు ఆయనను. మరునాడు ఉదయానికి ప్రక్కలోకూడా వచ్చాయి పుండ్లు.

ఒళ్లంతా రెండుసార్లు బాగా తుడిచి పుండ్లకు డ్రెస్సింగ్ చేసి ఇటువైపు త్రిప్పి పడుకోబెట్టాడు వాసు ఆయనను. మరునాటికి ఈవైపు కూడా వచ్చేశాయి పుండ్లు.

ఏమిటి చెయ్యడం ? అని నావైపు ప్రశ్నార్థకంగా చూశాడు వాడు. నేనేంచెప్ప గలను ? జబ్బుపడ్డ మనిషికి ఎలా సేవ చెయ్యాలో వాణ్ణిచూసి నేర్చుకుంటున్న మనిషిని నేను. తక్కినవాళ్లు నాకన్నా అన్యాయం. కావాలంటే ఏడుస్తారు, బాధపడ్తారు తప్ప అంతకుమించి ఏమీచేయలేరు.

"బా బా య్ ! తాతయ్యను బోర్లగిలా పడుకోబెట్టడానికి వీలులేదు. ఎందుకంటే ఊపిరి ఇప్పుడే సరిగ్గా ఆడడంలేదు ఆయనకి. బోర్లగిలా పడుకోబెడితే అసలు ఆడదు ఊపిరి. కాబట్టి ... వీపులో పుండ్లు కాస్త ఆరిపోయాయిగా... బాగా డ్రెస్సింగ్‌చేసి వెల్లకిలానే పడుకోబెడ్తాము..."

నేను తల ఊపాను. అరగంటలో ఆయన ఒళ్ళంతా శుభ్రపరచి పుండ్లకు బాగా మందువేసి డ్రెస్సింగ్ చేసి వెల్లకిలా పడుకోబెట్టాము.

ఆ కార్యక్రమం అయ్యాక ఇద్దరూ వెళ్లి డాక్టరు రవిచంద్రను హాస్పటల్‌లో కలిసి పరిస్థితి చెప్పాము వివరంగా.

వరండా

"ఏం జరిగినా ఇంకో నాలుగైదు రోజులు ...అంతే ! కావాలంటే మీ తృప్తికి హాస్పటల్‌లో అడ్మిట్ చేసుకుని సెలైన్ ఇస్తాను. ఏమిచ్చినా లైఫ్ ఇవ్వలేను !" అని చెప్పేశాడు డాక్టరు.

"దేవుడిపై భారం వేసి హాస్పటల్‌లో చేర్పిస్తాము" అన్నాడు వాసూ వాళ్ల నాన్న. కానీ ముసలాయన హాస్పటల్‌లో చేరడానికి ససేమిరా ఒప్పుకోలేదు.

"ఒరేయ్ అబ్బాయిలూ పోయేప్రాణాన్ని సెలైన్‌బాటల్లు ఆపలేవురా...ఆపగలిగినా ఒకటి రెండు రోజులు మాత్రమేగా ? హాస్పటల్‌లో ఇంతకన్నా సౌకర్యాలు నాకు లభించవు. నన్ను ఇక్కడ ఇలాగే ప్రశాంతంగా ఉండనివ్వండి. ఇక్కడే కన్నుమూస్తాను. ఇదే నా ఆఖరి కోరిక!" అనేశాడు ఆయన.

నా చితాగ్ని వెలిగిన చోటు

శిరసెత్తిన పశుతత్వం
చీలిపోయే చోటు
సౌందర్య పతంగ బింబాలు
శతథాదుల్లిపోయే చోటు
ఈర్ష్యా వాహినులు
ఇంకిపోయే చోటు
అసమానతల హద్దులు
అణగారే చోటు
పాంచభౌతిక కళేబరం
పంచవిధాల విశ్లేషితమయ్యే చోటు
మానవతా మందార పుష్పం
పరిమళాలు ప్రసరించే చోటు
శాశ్వత శాంతి పవనాలు
సంగమించే చోటు
అదే అదే నా చితాగ్ని వెలిగిన చోటు.

— మునుమూరు రఘువర్మ

కొద్దిగా పాలు, లేదా పండ్లరసం తప్ప ఆయన కడుపులోకి ఘనపదార్థం ఏదీ వెళ్లలేదు అప్పటికి ఇరవై రోజులుగా.

* * *

"బ్రతికిన బ్రతుకు చచ్చే చావులో తెలుస్తుంది!" అనేది ఒక పాత సామెత. ఇహలోకయాత్ర ముగించేప్పుడు పుణ్యాత్ములైతే సుఖంగానే వుండి సుఖంగానే కన్నుమూస్తారనే దీని భావము. కానీఈ సామెతలో ఆట్టే నిజం లేదనిపించింది నాకు. ఎందుకంటే నాకు తెలిసినంతవరకూ మాబాబాయ్‌లాంటి అతిమంచివాళ్ళు ఈ లోకంలో చాల తక్కువ. అలాంటి మంచి మనిషి చనిపోయేప్పుడు చాల బాధ అనుభవించాడు.

చాల ఘనంగా బ్రతికిన వ్యక్తి ఆయన. ఆయన చాల దయాహృదయుడు కూడా!

ఓ సంఘటన నాకు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లు జ్ఞాపకం ఉంది. నేను చిన్నవాడుగా వున్నప్పుడు ఓసారి బాబాయ్ ఏదో పనిమీద ఓ పల్లెటూరు వెళ్తూవుంటే నేనూ వెళ్ళాలని మారాంచేసి ఆయనను ఒప్పించి ఆయన వెంబడి వెళ్లాను. ఆ పల్లెకు బస్ సౌకర్యములేదు. పని ముగించుకుని కాలినడకన కాలిదారిన తిరిగి వస్తూ వున్నప్పుడు దారిలో ఇంకో చిన్న పల్లెటూరు వద్ద క్రిందపడి కొట్టుకుంటున్న ఓ మూర్ఛరోగిష్టి బిచ్చగాడు కన్పించాడు మాకు. కొందరు బిందెలతో నీళ్ళు తెచ్చి అతని నెత్తినా, ఒళ్ళంతా కుమ్మరిస్తున్నారు.

అతనికి తెలివి వచ్చాక ... అసలే చలి కాలమేమో, అతడు గడగడా వణుకుతూ ఉంటే మా బాబాయ్ తను తొడుక్కున్న చొక్కా, కప్పుకున్న వస్త్రమూ రెండూ తీసి అతనికి ఇచ్చేసి గోసి పంచెతోటే బయల్దేరి వచ్చేశాడు. అంతటి ఉదారుడూ, మంచిమనసు కలిగినవాడూ అయిన బాబాయ్ చివరిరోజులు చాల ఘోరంగా గడిచాయి ... "లలాట లిఖితే పునః ప్రయాతి" అన్న సూక్తి నిజం అన్పిస్తూ.

పడకపుండ్లు ఉధృతం అయిపోయి ఆయన శరీరం వాసన పట్టిపోయింది. వాసుగాడూ, నేనూ ముక్కులకు అడ్డుగా తుండుగుడ్డలు కట్టుకుని ఆయన ఒళ్ళు తుడచి మందులు పూయసాగాము. ఆయన శరీరానికి చీమలు పట్టకుండా మంచం చుట్టూ గెమాక్సిన్ పౌడర్ వేసి, వాసన ఎక్కువగా రాకుండా ఫెనాయిల్, డెట్టాయిల్ నీళ్లలో కలిపి చల్లేవాడు వాసు.

"నాలుగైదు రోజులే" అన్న డాక్టరు రవిచంద్ర అంచనా తప్పయింది. ఏ కాస్త కదిలించాలన్నా నరకయాతనకు గురవుతూ దాదాపు పదిహేనురోజులు బాధపడ్డాడు బాబాయ్.


తీరా ఆయన కన్నుమూసే ముందు నేనుగానీ, వాసూగానీ ఆయనవద్ద లేము. చనిపోయేముందు "వాసూ, వాసూ" అని కలవరించాడట ఆయన. వాసూవాళ్ళ నాన్నగారు త్రాగించిన గుక్కెడు తులసి తీర్థం త్రాగి వాసూ కోసం ఎదురుచూస్తూ ఇహలోక యాత్ర ముగించుకుని వెళ్ళిపోయాడు ఆయన.

* * *

రావల్సిన బంధువులందరూ వచ్చేశారు. ఇంట్లో అడుగు పెట్టడాన్కి అడుగు స్థలం లేకుండా మనుషులు నిండిపోయారు. ఏడుపులతో దుఃఖాలతో బాబాయ్ అంతిమయాత్ర ప్రారంభమైంది. అంతటి శోక సముద్రంలోనూ కన్నీరు కార్చని వ్యక్తులు ఇద్దరే ఇద్దరు. ఒకరు నేను, రెండవ వ్యక్తి వాసూ !

బాబాయ్ భౌతికకాయాన్ని పంచ భూతాలలో కలిపేసి తిరిగి వచ్చేటప్పుడు వాడ్ని అడిగాను "వాసూ ! నీకు ఏడుపు రాలేదురా ?"

వాడు చిన్నగా నవ్వాడు. "ఏడుపు రాలేదు బాబాయ్ ! హృదయంలో కొద్దిగా దుఃఖంగా



దర్శకత్వం: ఎ. కోదండరామిరెడ్డి నిర్మాత: వి. కనకరాజు లక్ష్మీఫిలిం



ఉగాదినాడు నెల్లూరు 'కళాప్రియ' ఆధ్వర్యంలో జరిగిన 'అష్టావధానం' కార్యక్రమంలో అవధాని డా. సి.వి. సుబ్బన్నగారిని నెల్లూరు సబ్ జడ్జి శ్రీ నారాయణరెడ్డిగారు సన్మానిస్తున్న దృశ్యం.

కర్మయోగి

సాధించలేకపోవచ్చు. కానీ సత్కర్మలు చెయ్యాలనే తపన సామాన్య మానవుని ఔన్నత్యానికి గీటురాయిలా భగవంతుని సహాయం కోరుతుంది. దయామయుడైన భగవంతుని అండా, సహాయం, అనుగ్రహం అపారంగా అందుకోగల మానవుడు అతీతుడుగా మానవాతీతుడుగా కన్పిస్తాడు. ఆ దైవ కృప వున్నంతవరకే — లేని క్షణం అతి సామాన్యుడైపోతాడు. విషయ వాంఛల వలయంలో చిత్రహింసలకు లోనౌతాడు. ఎంత ప్రయత్నించినా పూర్వపరిస్థితిని అందుకోలేకపోతాడు. మన కృషికీ మన సంకల్పానికీ తోడు దైవ కృప కూడా అండ వుండాలి అప్పుడే అనుకున్నది సాధించి తీరగలం.''

ధృఢవిశ్వాసంతో అంటూ చుట్టూ పరికించాడు కృష్ణారావు ఎదురుగా వయోవృద్ధులు వున్నారు. వాళ్ళ నవ్వులో సంతృప్తి వెలుగుతోంది. మధ్యవయస్కులూ వున్నారు, వాళ్లలో జిజ్ఞాస కన్పిస్తోంది. యువ్వనపు పొంగులో కొందరిలో తొందరపాటుతనం—చాలామంది పసివాళ్లలో అమాయకత్వం అర్థం చేసుకోలేని లేతదనం కన్పిస్తున్నాయి.

''విషయం వచ్చింది కనుక చెపుతున్నాను. మహాభారతంలో అర్జునుడి పాత్ర మీకు తెల్సు కదూ''

ఈ ప్రశ్న ఎవరికోసం ఉద్దేశింపబడిందో తెల్సుకున్న వయసు నుంచి ఉత్సాహం సమాధానం చెప్పింది.

తెల్సుకదూ, అర్జునుడు మహావీరుడు. నరనారాయణులలో వీరుడుగా ప్రసిద్ధి కెక్కిన వాడు దైవాంశసంభూతుడు. అంతేకాదు. నారాయణుడి ప్రతిరూపు. బహిఃప్రాణం. అస్త్రవిద్యలో తిరుగులేని మహా విలుకాడు. పాండవుల్లో ఎన్నదగ్గ మహనీయుడు. అందరినీ మించిన అదృష్టాన్ని స్వంతం చేసుకున్న పుణ్యమూర్తి అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీకృష్ణ భగవానుని బావగా, చెలికాడుగా, ఆత్మబంధువుగా ఆప్తమిత్రుడుగా— తన సర్వంగా భావించి క్షణం కూడా విడిచి వుండలేని మహోన్నతుడూ. శ్రీకృష్ణుని అండన ఎన్నో అతీత శక్తుల్ని దివ్యాస్త్రాలనీ అవలీలగా సంపాదించగలిగిన ప్రజ్ఞాశాలి. కురుక్షేత్ర రంగంలో సాక్షాత్తూ అపర బ్రహ్మనే సారధిగా చేసుకుని సమరోత్సాహంతో కదంత్రొక్కిన మహా మేధావి. మహా ఋషులకూ జ్ఞానులకూ— అవతారమూర్తులకూ కూడా అసంభవమైన శ్రీకృష్ణ పరబ్రహ్మ విశ్వరూప సందర్శనం దివ్య చక్షువులతో చూసి ధన్యత చెందిన మనవాతీతుడు. ఆ భగవానుని ద్వారా స్వయంగా గీతామృతాన్ని గ్రోలిన శిరోధార్యుడు. కురుక్షేత్ర రణరంగంలో— వీర సింహమై శత్రుసేనల్ని చీల్చి చెండాడి— మహా వీరుడుగా— వినుతి కెక్కిన యోధానుయోధుడు అక్షయ తుణీరాలతో— శక్తివంతమైన గాండీవంతో— శ్రీకృష్ణుని అపార అనురాగంతో మహా భారతంలో మహోన్నత స్థానాన్ని స్వంతం చేసుకున్న అంత మహావీరుడూ— శ్రీకృష్ణ నిర్యాణానంతరం ఏమైపోయాడు? మనసారధి— మన సచివుడు— మన నేస్తమూ— మనకు లేడనుకుని కృంగిపోయాడే గానీ, ఆత్మబంధువును కోల్పోయి కన్నీరు మున్నీరుగా విలపించాడేగానీ, కేవలం దుఃఖభారం చేతే— తను శక్తివిహీనుడ నయ్యానని నమ్మాడేగానీ—తాను జీవచ్ఛవాన్నని— ఎంత ఆలస్యంగా తెలుసుకోగలిగాడు? శ్రీకృష్ణునీ స్త్రీజనాన్నీ— యాదవుల్నీ సురక్షిత స్థలానికి జేర్చే ప్రయత్నంలో— శ్రీకృష్ణుని నిర్యాణానికి కృంగిపోయిన కిరీటి, ఆ భగవానుని ఆదేశాన్ని ఎందుకు అమలుజరపలేక పోయాడు? అంతటి మహావీరుడుగా భీభత్సుడుగా వినుతికెక్కిన యోధానుయోధుడు అతి సామాన్యులైన దుర్మార్గులు శ్రీకృష్ణుని స్త్రీజనాన్ని ఆక్రమించి నానా హింసలు పెడుతుంటే— మిగిలిన యాదవుల్ని చెండాడుతుంటే—ఎందుకునిర్వీర్యుడై నిలబడిపోయాడు?—ఎన్నో అక్షౌహిణీ సైన్యాలను త్రుటిలో కూల్చగల శక్తివున్న అక్షయ తుణీరం కూడా ఆ క్షణంలో శక్తి హీనమైపోయిందెందుకు? అంత యోధుడూ సామాన్యుడిలా— కిరాతకుల్ని ఎదుర్కోటానికి కేవలం బాహుబలాన్నే ప్రదర్శించాల్సివచ్చిందే — గాండీవిని శక్తివిహీనమైన కర్రగా మాత్రం ఉపయోగించాల్సిన గతి పట్టిందే — అప్పటికీ — అందర్నీ ఆదకోలేని నిస్సంశయుడిగా— కన్నీరు మున్నీరుగా విలపించాడే — ఈ హృదయవిదారక సంఘటనకి కారణం స్ఫురించిందా? — అంతదాకా తనకి దైవం అండగా వున్నాడు. దైవబలం చేయూతనిచ్చి నడిపించింది. మహావీరుడ్ని చేసింది చరిత్రలోనే ప్రసిద్ధిని ఆపాదింపజేసింది నారాయణుడు లేక నరుడు లేడనీ— భగవత్కృప లేనిదే మానవ ప్రయత్నం నిష్ఫలమనీ—జీవాన్నింపే దైవం దూరమైన క్షణంనుంచే తను జీవచ్ఛవం అయిపోయాననీ తెల్సుకున్న అర్జునుడు నిస్సారంగా నిర్వికారంగా మిగిలిపోయాడు. అంతవరకూ అజేయుడ్నని నమ్మిన పార్థుడు నిస్తేజుడైన నిదర్శనాన్ని మించి మరే నిదర్శనం వుంటుంది?''

మరే ఎదురుప్రశ్న లేకపోటంతో మౌనంగా వుండిపోయాడు కృష్ణారావు.

''అలా అనుకుని నిర్వికారంగా వుండకుండా ఇంకా ప్రయత్నిస్తే — విజయం సాధించే వాడేమో —''

ఎవరో చిన్నగా అన్నారు.

''ప్రయత్నించే విఫలుడై నిర్వికారంగా మిగిలిపోయాడు. విజయుడైన అర్జునుడూ సామాన్యుడా! తన ప్రయత్నాలు తను చేసే, దైవబలం దూరమైన కారణంగా విఫలుడై పోయాడు. మహాయోధుడైన పార్థుడు సామాన్యుడిలా మిగిలిపోయాడంటే దానికి ప్రబల కారణం వుండకపోతుందా!''

(ఇంకా ఉంది)



స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
విజయనిర్మల

నిర్మాత
టి.శ్రీనివాసరెడ్డి

సహనిర్మాత
శాఖమూరి సాంబశివరావు

నిర్వహణ: కె.బి.ప్రసాదరెడ్డి, కె.వెంకటేశ్వర్

కృష్ణ ఎంటర్‌ప్రైజెస్

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

బి. వి. ఆర్. — కొత్తపట్టణం

స్త్రీలు పువ్వులంటే ఎందుకంత మోజు పడతారు ?

★ స్త్రీలే ఏం కర్మ? వాటి సౌకుమార్యం, సౌందర్యం — పరిమళం — నాగరికులందరినీ ఆకర్షిస్తాయి.

పి.వి.వి.,ఎస్.ఎన్.ఆర్.—ఛండీఘర్

ఈ రోజులలో ఎక్కువ మానభంగములు జరుగుటకు కారణము — మగవారిని మేలుకొలిపే నేటి ఆడవారి అర్థనగ్న వేషధారణ అని అంటాను. మీరేమంటారు ?

★ మగవారిలో సంస్కార లోపం కారణం అంటాను. ఏం— తల్లి చెల్లె ప్రేయిసిలని చూసి మేల్కోని మగవారు పరాయి స్త్రీలని చూసీ మేల్కోవడం ఎందుకు జరుగుతుంది ? దుస్తులే ధరించని ఆటవిక జాతిలో జరుగని యీ దారుణాలు — నాగరికులమని చెప్పుకునే యీనాటి వారి మధ్య ఎందుకు జరుగుతోంది ?— లోకువ. దొరికేదాకా అంతా పెద్దమనుషులే కదా? ఎవరు పట్టుకోకలరు అన్న ధీమా. ముఖ్యంగా— ఆడదంటే— ఉన్న దరిద్రపు వూహ.

పి. ఆర్. ఎల్ — విశాఖపట్నం

పురుషులతో సమానంగా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నా కట్నం బాధ తప్పటం లేదు. దీనికి కారణం ఏమిటి ?

★ పెళ్లో — పెళ్లో అని పరితపించి పోడం ! ఆడపిల్లకి జీవితధ్యేయం ఒక్క పెళ్లే అనుకోవడం. చదివి ఉద్యోగంనుండి తన కాళ్లపై తాను నిలబడకల్గిన అమ్మాయిలు సహితం — పెళ్లికోసం — సిగ్గు లజ్జ వదలడానికి సిద్ధపడడం — డబ్బిచ్చేనా మొగుడ్ని సంపాదించుకోకపోతే — అంతా ఏమేనా అనుకుంటారని బాధపడడం.

వి. డి. — భీమవరం

అక్కయ్యా, వరకట్నం అంటే ఏమిటి ?

★ ఒక మగవాడు — పెళ్లి చేసుకుని — పెళ్లాన్ని ఏలుకొందుకు, జీవితాంతం అన్నం పెట్టడానికి, బట్ట యివ్వడానికి — అడిగే డబ్బు!

సిహెచ్ ఎస్. ఆర్ — భద్రాచలం

ఆనందదాయక జీవితం అంటే ?

★ చీకూ చింతా లేకుండా — కాలం వెళ్లమార్చడం.

కళాకేళి — గుంటూరు


నేటి రచనలలో సామాజిక స్పృహ ఎంత వరకు వుందో ఓ రచయిత్రిగా మీ అభిప్రాయం ?

★ సామాజిక స్పృహ అంటే ఏమిటి ? ఒళ్లు దగ్గిర పెట్టుకురాయడమేగా ? లేక — ఏదో ఇజానికి సంబంధించిన సమాజం ఎలా వుంటుందో వూహించి రాయడమా? నమ్మదగ్గ రచనలన్నీ సామాజిక స్పృహ కల్గే వుంటాయి.

కె. ఎన్. ఆర్. — చెన్నూరు

ప్రస్తుత ప్రభుత్వంపై మీ అభిప్రాయం ఏమిటి ?

★ ప్రజలకు తగిన ప్రభుత్వం లభిస్తూ వుంటుందని కదా సామెత.



జి. ఎన్. కె. — ఉరవకొండ

ప్రేమంటే గుడ్డిది. అది ఒక వరము. అందరికీ లభించదు అంటారు ? కారణం ?

★ అందరికీ గుడ్డివాళ్లవడం యిష్టం వుండదు. తనుకు నచ్చినవాళ్లు లభిస్తే గుడ్డి అవడానికీ అభ్యంతరం వుండదు.

డి. ఎమ్. ఆర్. — రాయదుర్గం

దేవాలయాలమీద బూతు బొమ్మలు ఎందుకు ?

★ మానవ జీవితంలో రక్తి ముక్తి నాణేనికి రెండు పక్కలు అని — చాటిచెప్పడానికి.

కె. పి. ఎమ్. — చక్కరాళ్ళ

నీకు ఆధునిక ప్రేమ విషయాలు తెలియవని, నీవు వట్టి బుద్ధావతారమని నా మిత్రులు నన్ను గేలి చేస్తుంటారు.

★ తక్షణం— వస్తున్న అన్ని సీరియల్ నవలలు, ప్రచురింపబడుతూన్న అన్ని నవలలు— చదవడం ప్రారంభించండి. తప్పకుండా జ్ఞానోదయం అవుతుంది.

బి. ఎస్. ఎస్. — విశాఖపట్నం

భార్యను బాధపెడుతూ తల్లిని సుఖపెట్టే వారిని ఏమనాలి ?

★ ముందుచూపు లేనివాళ్లు.

ఆర్. ఎన్. ఆర్. — మాచర్ల

రాజుల పాలన వస్తే ?

★ ఏమిటీ ? ఇప్పుడున్నది— రాజులపాలన కాదా ?!

ఎమ్. వి. కె. — ఉరవకొండ

మనిషి జీవితాన్ని సముద్రమట్టంతో పోలుస్తారెందుకు ?

★ దిగేదాకా లోతు తెలియదు; సాగిస్తూ పోతున్నా కాలందదు — జీవితం. అందుకే అలా అంటారు.

కె. ఎస్. ఎమ్. ఎస్. — గజపతినగరం

ఇద్దరు మగవాళ్ల మధ్య విరోధం వుంటే— మధ్యలో ఒకతని భార్య అవతలివాని మంచి చెడ్డలు తెలుసుకోకుండానే—అతనిని దూషించడం న్యాయమా ?

★ ఇది మరీ బాగుంది — మర్యాదగా తిట్టమన్నట్టు ! తన భర్తకి శత్రువు తన శత్రువని అనేసుకుంటుంది ఆడది !


కె. ఎస్. వి. — మంగళగిరి

మీ ఇంటి పేరు 'కె' అంటే ఏమిటి ?

★ కూచి !! ★

మరింత పొడుగవండి

స్త్రీలకూ,
పురుషులకూ కూడా



కేవలం 2 వారాల తర్వాతనే మీ పొడవు కొలిచి చూసుకోండి. అది పెరిగిందని మీకే తెలుస్తుంది— ఆ పెరుగుదల 15 సెం.మీ. వరకూ ఉండొచ్చు. గుర్తుంచుకోండి, ఫలితాలు మీకు సంతృప్తి కలిగించకపోతే, మీ డబ్బు వెంటనే వాపసు చేస్తాం, ప్రశ్నలేమీ అడగం.

శ్రమ కలిగించే వ్యాయామాలు అవసరం లేదు. ఎలివేటర్ షూస్ లాంటి కృత్రిమ సహాయకాలతోగాని, మరే ఉపకరణాలతోగాని పనిలేదు.

న్యూ హైట్ కార్యక్రమం శరీరమంతటికీ తిరిగి ఉత్ప్రేరణ కలిగించే, ప్రత్యేకమైన స్విస్ సూత్రం మీద ఆధారపడ్డ శాస్త్రీయ పద్ధతి.

న్యూ హైట్ స్త్రీలకీ, పురుషులకీ కూడా ఎంతో బాగా పనిచేస్తుంది. ఈ విషయం యూరోపు అంతటా వేలాదిమంది విషయంలో ఋజువైంది. ప్రతిరోజూ కొద్ది నిమిషాలపాటు ఈ కార్యక్రమంలోని సూచనలను ఒకదాని తర్వాత ఒకటిగా అనుసరించండి.


ఈ రోజే వాడి చూడండి

నిశ్చయమైన ఫలితాలు లేదా మీ డబ్బు వాపసు!

మీ ప్రస్తుత వయస్సు ఎంతైనా సరే, మీలో మంచి మార్పు కనబడుతుంది!

ఆత్మ విశ్వాసంతో నిటారుగా ఉండే వ్యక్తి సఫలతకు ప్రతిరూపం—మగ అయినా సరే, ఆడైనా సరే. పొడవైన ఆకృతి ఆడవాళ్లనిగాని, మగవాళ్లనిగాని మరింతగా ఆకట్టుకొంటుందని పరిశోధనలో తేలింది. కేవలం సరైన ఆకృతి లేకపోవడంవల్ల జీవితంలో ఆనందాలెన్నింటినో కోల్పోతున్నారా? నిస్పృహ చెందకండి. మీ వయస్సు ఎంతైనా సరే, మీ ప్రస్తుత స్థితి ఏదైనా సరే—మీకో శుభవార్త ఇదుగో!


విఫలం నుంచి సఫలానికి కేవలం 14 రోజుల్లో



న్యూ హైట్ ఉపయోగించినవారి నుంచి ప్రశంసా పరంపర:

"పొడుగు పెరగడం సాధ్యమని నేను అనుకోలేదు. కాని నన్ను ఆశ్చర్యానందాల్లో ముంచుతూ న్యూ హైట్, నా పొడవు 185 సెం.మీ. వరకూ పెరిగేందుకు తోడ్పడింది." —ఎస్.ఆర్.కె.

"న్యూ హైట్ కోర్సు దానెత్తు బంగారం కన్నా విలువైనది. నా పొడవు మరో 11 సెం.మీ. పెరగడంతో నా జీవితమే మారిపోయింది." —ఆర్.హెచ్.



న్యూ హైట్ కార్యక్రమం కొన్ని శాస్త్రీయ వ్యాయామాల సహాయంతో మరింత పొడుగు పెరగడం, ఆకృతిని సరిచేసుకోవడం అన్నదాని మీద ఒక సూచనల పుస్తకం. అది మందు గాని, మాకు గాని కాదు.

న్యూ హైట్
మెహతా మహల్, 15 మాథ్యూ రోడ్, బొంబాయి 400 004.

ఈ రోజే కూపన్ పోస్టు చేయండి

న్యూ హైట్ మెహతా మహల్, 15 మాథ్యూ రోడ్, బొంబాయి 400 004. NH-201-TEL.

దయచేసి నాకు న్యూ హైట్ పంపండి. ఫలితాలు నాకు పూర్తిగా సంతృప్తి కలిగించకపోతే 14 రోజుల్లోగా ఈ కార్యక్రమాన్ని తిప్పి పంపితే, వెంటనే డబ్బు వాపసు (ప్యాకింగ్, పంపకం మొదలైన ఖర్చులు మినహాయించి) పంపుతారని గ్రహించాను.



దయచేసి తగిన గడిలో ☑ టిక్కు పెట్టండి. SW-22

☐ వి.పి.పి. ద్వారా పంపండి. సరకు అందిన మీదట పోస్టుమన్‌కు రూ. 54/- చెల్లిస్తానని మాట ఇస్తున్నాను.

☐ రిజిస్టర్డ్ పోస్టు పార్సిల్ ద్వారా పంపండి. రూ. 54/- డ్రాఫ్టు/ఐ.పి.ఓ./ఎమ్.ఓ. ద్వారా పంపుతున్నాను దాని నంబరు......... తేదీ.................. (బుక్ వర్కర్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి చెల్లించవలసినది).

పేరు..........................

చిరునామా..........................

.... పిన్‌కోడ్.............. సంతకం..............

సీరియల్: గోరంత దీపం

—వింధ్యవాసిని

(గత సంచిక తరువాయి)

11

పరశురాం కర్నూలుకి వచ్చి మూడేళ్ళు అవుతోంది. విశ్వం బియ్యే పాసయ్యాడు. కోరుకున్న విధంగా అక్కడే కొత్తగా ఆరంభించబడిన ఒక మిషనరీ స్కూల్లో మాస్టరుగా చేరాడు. అయితే పరశురాం వాళ్ళతోబాటు వెళ్ళలేదు.

ఈ మధ్య చాలా రోజులుగా స్వంతగా మకాం ఏర్పరచుకోవాలని ఉంది పరశురాంకి. తను, తన పనులు, వ్యాపారంవల్ల ఇంట్లోవాళ్ళకి ఎంత ఇబ్బంది కలిగిస్తున్నదీ తెలుసు. కానీ వాళ్ళు చూపే స్నేహాభిమానాలముందు, తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేకపోయాడు.

విశ్వం మరో ఇంటికి మారాలని అనుకున్నప్పుడు, ఇల్లు వెతికిపెట్టింది పరశురామే. అయితే సరిగ్గా సామాను చేరవేసే రోజు చెప్పాడు. ''నా సామాను ఇక్కడే ఉండనీ. నా వ్యాపారానికి ఇక్కడినించే అనుకూలంగా ఉంటుంది'' అన్నాడు.

విశ్వం ఊహించని పరిణామం ఇది. ''ఎందుకురా వేరే ఉండటం. కొత్తగా ఈ బుద్ధి ఎట్లా పుట్టింది నీకు'' అడక్కుండా ఉండలేకపోయాడు.

''ఏంలేదు విశ్వం. కట్టుబట్టలతో వచ్చిన వాణ్ణి బాగుపడి ఈ స్థితిని చేరుకున్నానంటే అది మీ అభిమానంవల్లనే. కానీ ఇప్పుడు నా సరకు, సరంజామా ఎక్కువయింది. ఇన్నింటితో మీకు ఇబ్బంది కలిగించలేను ఇంకా.''

''పోనీ నువ్వు చెప్పేది నిజమయితే, ప్రతీ రోజూ భోజనానికి మాత్రం వచ్చి తీరాల్సిందే'' అంది మీనాక్షి.

''అలాగే వదినా'' అన్నాడు పరశురాం. కానీ రోజూ తప్పకుండా వెళ్ళటం మాత్రం వీలయేదికాదు. అయితే ప్రతి ఆదివారం మాత్రం తప్పకుండా వెళ్ళి, రోజంతా వారితో గడపటం అలవాటు చేసుకున్నాడు.

సింగినమల నుండీ వచ్చిన ఏడాది లోపలే చెల్లెలి పేరన రెండుత్తరాలు వ్రాశాడు పరశురాం. రాజ్యం దేనికీ జవాబు వ్రాయలేదు. కానీ వాళ్ల చిన్నాన్న ఒక కార్డు మాత్రం వ్రాశాడు, ''నువ్వెప్పుడయితే, పెద్దవాళ్లమన్న గౌరవం లేకుండా ఇల్లు విడిచి పారిపోయావో, ఆనాడే నీతో మా సంబంధం తెగిపోయింది. మాకు నీవు చచ్చిన వాడికిందే జమ అని గుర్తుంచుకో'' అని రాశాడు. ఇంక చేసేదేమీ లేకపోయింది.

* * *

తనుంటున్న వీధిలోనే పిండిమర ఒకటి అమ్మకానికొస్తే కొన్నాడు పరశురాం. వ్యాపారం బాగానే పెరిగింది. స్వంతానికి మర ఉంటే మంచిదనిపించింది. రోజుకూలికి ఒక బండిని కూడా కుదిర్చి ఉంచుకున్నాడు. ఈ విధంగా కొంత శరీరశ్రమ తప్పింది. కావలసిన గోధుమ బస్తాలు, ఇప్పుడు అతని ఇంటికే వస్తున్నాయి.

ఒక ఆదివారం విశ్వమూర్తి ఇంటికి బయలుదేరాడు. అతను సైకిలు ఆపి దిగటం మీనాక్షి, విశ్వం ఇంటి ముందర రిక్షా దిగటం ఒక్కసారే జరిగాయి.

''పొద్దుటే ఎక్కడికో వెళ్లొస్తున్నారే ?'' అడిగాడు.

ముసిముసిగా నవ్వుతూ తలుపు తాళం తీసి లోపలికి అడుగు పెట్టాక చెప్పాడు విశ్వం, ''త్వరలో నువ్ బాబాయివి కాబోతున్నావురా'' అని.

''ఆఁ నిజంగా'' అని ఆశ్చర్యపోయి, మరుక్షణమే సైకిలు మీద బజారుకు పరుగెత్తాడు పరశురాం. పువ్వులు, లడ్డూలు కొన్నాడు. టెంకాయ పూజ సామాను కొని, సాయిబాబా ఆలయంలో మీనాక్షి, విశ్వమూర్తుల పేరున అర్చన చేయించాడు.

> **జరిగినకథ—3 :** 'గోరంత దీపం' రాయలసీమ వార్తా వారపత్రిక ఎడిటర్ విశ్వమూర్తి, ఎం. డి. పరశురామ్ ప్రాణస్నేహితులు. విశ్వమూర్తి కూతురు రమణ అదే ఆఫీసులో పనిచేస్తోంది. పరశురామ్ కూతురు కరుణకు ట్యూషన్ చెబుతున్న హరిప్రసాద్ కరుణ సహాయంతో ఆ ప్రెస్‌లోనే ఉద్యోగం సంపాయిస్తాడు. మంచి తెలివితేటలు, గౌరవం గల హరిప్రసాద్‌కు తన పెద్దకూతురు అరుణను ఇచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించుకొంటాడు పరశురామ్. గతంలో—గుండూరావ్ ప్రెస్‌లో పని చేస్తుంటాడు విశ్వం. ఇంట్లో వాళ్లకు తెలియకుండా తమ కులం కాని మీనాక్షిని చేసుకొని ఆ వూర్లో కాపురం పెడతాడు. తన స్నేహితుడు పరశురామ్‌ని కూడా తీసుకొచ్చి ఆ ప్రెస్‌లోనే చేర్పించి, తన ఇంట్లోనే ఉంచుకొంటాడు. పరశురామ్‌కి చదువు లేకపోయినా వ్యాపారం పై ఆశక్తి ఎక్కువ. అందువల్లే క్షణం తీరిక లేకుండా ఏవో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తుంటాడు.

ప్రసాదం తీసుకుని ఇంటికొచ్చాడు పరశురాం. అతని ఆనందాన్ని చూస్తే ముచ్చటగా ఉంది మీనాక్షికి. ''వచ్చేవారం నీకు కోడిపులావ్ వండి పెడతాను పరశురాం'' అని మాట ఇచ్చేసింది.

మీనాక్షి చేతులకి రెండు జతల బంగారు గాజులు చేయించాలని, పరశురాంకి ఎన్నాళ్ళుగానో ఉంది. విశ్వం తిడతాడని ఆ పని చెయ్యలేదు. ఇప్పుడింక ఆలస్యం లేకుండా చేయించాలి. తన కెవరున్నారు ? వదినె అయినా, తోబుట్టువు అయినా అన్నీ ఆమే అయింది. పుట్టింటివారితో సంబంధాలు సవ్యంగా ఉంటే ఇప్పుడామెకోసం ఏమేమి చేయించి ఉండేవారో !

సరిగ్గా అప్పుడే చెల్లాయి రాజ్యం గుర్తుకొచ్చింది. దానికిప్పటికి పెళ్లయిపోయుంటుంది, నాకే సంగతీ తెలియకుండా ఉంది అనుకున్నాడు. వెళ్లి ఒక్కసారి రాజ్యాన్నీ, పిన్నమ్మనీ చూడాలని ఎన్నిసార్లు అనిపించినా, చిన్నాయన నోటికి భయపడి వెళ్లలేకపోయాడు పరశురాం.

భోజనం చేసి, మిత్రులిద్దరూ చెరొక పట్టెమంచం మీద నడుం వాల్చారు. మూడింటికి మెలకువొచ్చింది, పరశురాంకి. మీనాక్షి వంట ఇంట్లో ఏదో పని చేస్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి.

పక్కనే టేబిల్ మీద ఒక న్యూస్‌పేపరు, కొన్ని పత్రికలు, ఒక లావాటి బౌండు పుస్తకమూ కన్పించాయి. పుస్తకం అందుకుని పేజీలు తిరగేశాడు. ఏవో గేయాలు, పద్యాలూ వ్రాసి ఉన్నాయి అందులో. దస్తూరి చూస్తే మీనాక్షిది లాగే ఉంది. తనకిష్టమయినవి వేరే పుస్తకాల నుంచో ఎత్తి వ్రాసి పెట్టుకుంది కాబోలు అనుకున్నాడు. అక్కడక్కడ ఒకటీ అరా చూస్తే ఆసక్తి కనిపించింది. వరసగా చదవటం మొదలుపెట్టాడు.

పరశురాంకి సాహిత్యంతో పరిచయం చాలా తక్కువ. అతనెన్నుకున్న జీవిత విధానంలో, సాహిత్యావలోకనానికి అవకాశమూ తక్కువే.

తను చిన్నప్పటి నుంచీ చదివిన చదువులో కవిత్వం అంటే ఊరికే చదివితే అర్థం కాదనీ, తెలుగు మాస్టరు భాష్యం చెబితేనే తెలుస్తుందనీ ఒక భావం ఏర్పడింది అతని మనసులో. దాన్ని కాస్త పటాపంచలు చేస్తోంది అతనిప్పుడు చదువుతున్న కవిత్వం.

సులభంగా అర్థం అయ్యే, సాధారణ పదాలనే మాలలుగా కూర్చినట్లున్నాయా గేయాలు. భాష సరళంగానూ, భావం సుందరంగానూ ఉంది, తన మనసుని తాకినట్లయింది. గంటన్నరసేపు సర్వం మరిచి చదువుతూ ఉండిపోయాడు.

అందులో ముప్పయి దాకా గేయాలున్నాయి.

మొదటి కొన్నింట్లో, ప్రేమభావం. ప్రకృతిలో అందాలు, రెండు మనసులు దగ్గరయినప్పుడు ఏర్పడే స్నేహంలో మాధుర్యం వంటివి వర్ణించబడి ఉన్నాయి. చల్లని వెన్నెల్లో కూర్చుని పిల్లగాలులను పీలుస్తూ ఉన్న అనుభూతి కలుగుతుంది అవి చదువుతూ ఉంటే.

తరవాతి పద్యాలలో దేశభక్తి చోటు చేసుకుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన ఎందరో మహనీయులు, వారి ద్వారా నడిచిన ఉద్యమాలు ఎన్నో దృష్టిలో ఉంచుకొని వ్రాయబడినవి. "స్వాతంత్ర్యం మా జన్మహక్కు" అన్న గేయం పరశురాంకి చాలా నచ్చింది. తనకు తెలియకుండానే ఏదో ఆవేశం కలిగింది. చివరగా అనంతపురం కాలేజి విద్యార్థి ఒకతను, ఇల్లు, చదువు అన్నీ వదిలి ప్రాంతీయ ఉద్యమ నాయకుడుగా ఎన్ని కష్టాలకి గురి అయిందీ, చివరికెంత దారుణంగా మరణం పాలయిందీ అంతా కళ్ళకు కట్టేలా ఒక గాథలా వ్రాసి ఉంది. కంట నీరొచ్చింది పరశురాంకి, చదువుతూ ఉండగానే.

తరువాతి పది పైచిలుకు గేయాలు అతనికి బాగా అర్థం అవలేదు. స్పష్టాస్పష్టంగా తెలుసుకున్న దొకటి — ప్రతీ మనిషి అంతరాంతరాల్లో ఏదో తెలీని ఒంటరితనం ఎప్పుడూ బాధిస్తూ ఉంటుంది. దాన్నుంచీ తప్పించుకు పారిపోయేందుకు మనం ఎన్నో ప్రయత్నాలు చేస్తో ఉంటాం—అని. నిజమేనేమో అనిపించింది పరశురాంకి.

విశ్వం నిద్రలేచాడు. మంచంమీదే కూర్చుని ఆవులిస్తూ "ఏమోయ్, టీ ఏమయినా ఇస్తావా ?" అని పిలిచాడు భార్యని.

"మా 'నె ఇంత మంచి కవిత్వం రాస్తుందని చెప్పలేదే నా కెప్పుడూ" అడిగాడు పరశురాం.

"నాకు మాత్రమేం తెలుసు. రాసి రహస్యంగా పెట్టెలో దాచుకుంది. ఈ మధ్యే కనుక్కొని బయటికి తీసాను."

"ఇంత చక్కని కవితల్ని పెట్టెలో దాచి ఏం లాభం ? అచ్చువేస్తే నలుగురూ చదివి ఆనందిస్తారు."

"వింటున్నావా మీనా, మీ మరిది నీ గేయాలన్నీ అచ్చేస్తాడట !" తమాషా చేసాడు విశ్వం, పకోడీలు తెచ్చిన మీనాక్షితో.

"వేయించనివ్వండి ఏం ?" బింకంగా అన్నది.

"ఊ. మొగుణ్ణి గాబట్టి నాకూ, మరది కాబట్టి వాడికీ చదవటం తప్పదనుకో. వెరొక కాపీ కొంటాము, మిగతావాళ్ల కేం పని-కొని చదివేందుకు" అని గేలి చేశాడు.

"విశ్వం మాటలకేం. మీరిలాగే చూస్తూ వుండండి. ఏదో ఒకరోజు నేనీపని చేసితీరతాను! ఎంతమంది చదివి మెచ్చుతారో చూసి మూర్ఛ పడిపోడూ ?" తగు విధంగా జవాబు చెప్పినా, సీరియస్‌గా ఏదో నిర్ణయించుకున్నవాడిలా అన్నాడు పరశురాం.

12

నెల రోజులుగా ఊరంతా ఒకటే సందడి, హడావిడిగా ఉంది. వీధులన్నీ రిపేరుచేస్తున్నారు. అక్కడక్కడా కర్రలు పాతి రంగురంగుల కాగితాలతో, చిన్న చిన్న జాతీయ జండాలతో అలంకరిస్తున్నారు. సర్కారు ఆఫీసులన్నీ శుభ్రం చేసి సున్నాలు వేస్తున్నారు. కోల్స్ హైస్కూలు గ్రౌండ్‌లో మూడడుగుల ఎత్తు ప్లాట్‌ఫారం ఒకటి కొత్తగా కట్టి బ్రహ్మాండంగా ఏర్పాటు చేస్తున్నారు. ఎవరినోట విన్నా అదే మాట "నెహ్రూజీ మనూరి కొస్తారట. కోల్స్ హైస్కూలు గ్రౌండ్‌లో బహిరంగ సభలో ఉపన్యసిస్తారట" అని. ప్రతీ ఒక్కరూ ఒక్కసారి ఆయన్ని కళ్లారా చూస్తే చాలు అన్నట్లుగా ఎదురు చూస్తున్నారు.

కొన్నాళ్లుగా చేస్తున్న ఆలోచనలన్నీ ఒక రూపానికొచ్చాయి పరశురాం మనసులో. అతనికి స్వంతగా ఏదయినా పుస్తకం అచ్చువేసి అమ్మాలని వుంది. అందుకిది మంచి అవకాశం అనుకున్నాడు.

విశ్వం సహాయం కోరాడు.

"విశ్వం. నెహ్రూజీ జీవిత విశేషాలు, స్వాతంత్ర్యోద్యమంతో ఆయనకున్న సంబంధం ఇలాంటి కొన్ని ముఖ్యమయిన విషయాలు సులభంగా అర్థం అయే భాషలో రాసివ్వు నాకు.



ఈ సందర్భంలో ఒక పుస్తకంగా అచ్చువేసి అమ్మాలనుకుంటున్నాను.''

ఈ ఆలోచన కొత్తగా వుంది విశ్వమూర్తికి. ఇది పరశురాంకి పుట్టిన బుద్ధేనా అని అనుమానం వచ్చింది. అతనింతవరకూ ఎన్నోవిధాల చిన్న వ్యాపారాలు చేసే ప్లాన్లు వేయటం తను చూసాడు. కానీ ఇలా ఓ పుస్తకం అచ్చేయటం అంటే మాటలు కాదు. కాపీలు అమ్మటం దగ్గిర మొదలవుతుంది అసలు సమస్య. అక్కడ ఫెయిల్ అవుతే పెట్టిన ఖర్చు అంతా గంగలో పోసినట్లే.

''బాగా ఆలోచించావా ?''

''నాకెందుకో సులభంగా అమ్మగలనని అనిపిస్తుంది. అదంతా నేను చూసుకుంటాను. నేనడిగిన వివరాలు రాసిపెట్టు విశ్వం'' బ్రతిమాలినట్లే అడిగాడు పరశురాం, అడ్డు చెప్పద్దన్నట్లుగా.

గుండూరావుగారి అనుమతితో ప్రెస్ ఉపయోగించుకున్నాడు. పాకెట్ డైరీ సైజులో ఏభయి పేజీల పుస్తకం తయారయింది. దానిమీదుగా 'శాంతిదూత' అనే పేరు, నెహ్రూజీ ఫోటో అచ్చువేసారు అట్టకోసం. ధైర్యంచేసి మూడు వందల కాపీలు వేయించాడు పరశురాం. ఒక్కో కాపీ వెల అర్ధరూపాయి.

మిగిలింది పుస్తకాల్ని అమ్మే పని. ఏవిధంగా అయితే ఎక్కువ అమ్మవచ్చునా అని ఆలోచించాడు. నెహ్రూజీ రావటం రెండు రోజు లుండనగా అమ్మటం మొదలుపెట్టాలి అని నిర్ణయించుకుని అప్పటికి కాపీలు తయారు చేసాడు. పుస్తకంలో ఒక్కొక్క అక్షరాన్ని తనే కంపోజింగ్ చేసి, ప్రూఫులు దిద్ది, కాపీలు వేశాడు.

బుధవారం సాయంత్రం స్పెషల్ ట్రెయినులో వచ్చి దిగుతారు నెహ్రూజీ. ఆరు గంటలకి బహిరంగ సభ. అందుకు తగిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నవి.

వూళ్లో న్యూస్‌పేపర్లు, పత్రికలు అమ్మే ఏజెంటు ఒకతనున్నాడు. చందాదారుల ఇళ్ళకి వెళ్ళి పత్రికలు, పేపర్లు అందజేసి వచ్చేందుకు ముగ్గురు అబ్బాయిలున్నారు. ముందుగా వాళ్ళని ఆదివారమే ఒకచోట చేర్చి మాట్లాడాడు. ఒక్కొక్కరు కొన్ని కాపీలు తీసికెళ్ళి వారపత్రిక వెంబడి ఇంటింటా 'శాంతిదూత'ని చూపించి కొనమని అడగాలి. అందుకు వాళ్ళకి కొంత కమీషను ముట్టజేస్తాననికూడా చెప్పాడు.

వాళ్ళు ముగ్గురూ కలిసి ఏభయి కాపీలు అమ్మటమే చాలా కష్టం అయిందని, మిగిలిన పుస్తకాలు, డబ్బు చేత బెట్టారు. ఒక్కొక్కరికి ఒక రూపాయిచ్చి పంపించేశాడు. ఇంతేనా అమ్ముడయింది అని కొంత నిరుత్సాహం కలిగింది పరశురాంకి, కానీ విశ్వంతో అనలేదు, ఎద్దేవా చేస్తాడేమోనని.

గోరంత దీపం

మంగళవారమంతా ప్రెస్‌కి సెలవుపెట్టేసి పుస్తకాల కట్ట కట్టుకుని బస్టాండులో, రైల్వే స్టేషన్లో గడిపాడు. రాత్రి పన్నెండు గంటలకి అలసి ఇల్లు చేరాడు. ఇంకా మూడొంతుల కాపీలుండి పోయాయి.

తెల్లారి ఆరింటికి కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగా విశ్వం.

''నిన్నంతా ఏమయిపోయావ్, పత్తా లేకుండా'' అనడిగాడు. పలకలేదు పరశురాం.

''పుస్తకాలు మిగిలిపోయాయే అని దిగులు పడ్డావా ? పిచ్చివాడా తిండీ తిప్పలు లేకుండా ఇలా నీరసపడితే ఏం పని చేయగలవు ? ఈరోజే నీకసలయిన ఛాన్స్! సాయంత్రం మూడింటికల్లా కోల్స్ హైస్కూల్ గ్రౌండ్‌కి వెళ్ళదాం పుస్తకాలు తీసుకుని. వేడి వేడి పకోడల్లా అమ్ముడవకపోతే అప్పుడడుగు. లేలే. పద ఇంటికి. మీ వదినె దోశలు చేస్తోంది,'' అంటూ హడావిడి పెట్టేసి లాక్కువెళ్ళాడు. ఆవేళ ప్రెస్ మూసేశాడు గుండూరావు.

విశ్వం స్కూలుకి సెలవే. మధ్యాహ్నందాకా విశ్వం దగ్గరే గడిపాడు పరశురాం. గడిపాడు అనటంకంటే, విశ్వం అతన్ని అక్కడ్నించే కదల నివ్వలేదు అనటం సరిగ్గా వుంటుంది. భోంచేసి, కాస్సేపు విశ్రాంతి తీసుకుని మిత్రులిద్దరూ బయల్దేరారు.

అక్కడ వాలంటీర్లుగా చేస్తున్నవారిలో విశ్వం పనిచేసే స్కూలు మేష్టర్లు కొంద రున్నారు. వాళ్ళ సహాయంతో కొన్ని పుస్తకాలు అమ్మారు. సభకి వచ్చి గుంపులుగా అక్కడక్కడ నిలుచుని ఉన్న కొందరికి పుస్తకాలని చూపి అమ్మే ప్రయత్నం చేశాడు పరశురాం. అయిదు గంటలయింది. ఇంకా వంద కాపీలకి పైగానే వున్నాయి. సభలయి, నెహ్రూజీ వెళ్ళిపోయేక, ఇవి ఎందుకూ పనికిరావు, చింపి మంట పెట్టె య్యాల్సిందే— అనుకున్నాడు పరశురాం.

ఇంతలో నల్లకారొకటి గేట్లోంచి దూసు కొచ్చింది. అందులోంచి ఓ యాభయ్యేళ్ళ పెద్ద మనిషి దిగేడు. ఆయనెవరో పరశురాంకి తెలీదు. కానీ ముఖం మాత్రం ఎక్కడో చూసినట్లుగా అనిపించింది. ఆయన చుట్టూ చేరబోతున్న జనాన్ని వదిలించుకుని ముందుకు సాగుతూ ఎదురొచ్చిన పోలీస్ ఆఫీసర్లతో ఏదో మాట్లాడు తున్నాడాయన.

ఏమయినాసరే అని ధైర్యంచేసి ముందుకు వెళ్ళాడు పరశురాం. నేరుగా వెళ్ళి పెద్దాయన చేతిలో ఓ పుస్తకం పెట్టాడు చొరవగా. ఎవరది అని కోపంగా కళ్ళెర్రచేయబోయినాడు. ఒక్కక్షణం పుస్తకానిపై దృష్టి మరల్చి, కాస్సేపు పేజీలు తిప్పిచూసాడాయన. చల్లగా పుస్తకం జేబులో పెట్టుకునేసి, మరో జేబు లోంచి పర్సుతీసి అర్ధరూపాయి పరశురాం చేతపెట్టి ముందుకు సాగిపోయేడాయన. చుట్టూవున్న వాళ్ళంతా పరశురాంనీ, అతనిచేత ఉన్న పుస్తకాల కట్టనీ ఆశ్చర్యంగా చూస్తున్నారు. అప్పటికప్పుడే కొందరు కొన్నారు కూడా, తలా ఒకటి.

''ఆయనెవరు ?'' అని అటువచ్చిన ఓ పోలీసు కానిస్టేబుల్ని అడిగాడు పరశురాం కుతూహలంగా. ''ఆ మాత్రం తెలీదూ ? ఆయనెవరు అనడుగుతున్నావే. మన వూర్నించీ ఎమ్. పీ. గా ఢిల్లీ వెళ్ళిన చెన్నకేశవ రెడ్డిగారు ఆయనే'' తను ఆయన ముఖం ఏ న్యూస్ పేపర్లోనే చూసి ఉంటానని అనుకున్నాడు పరశురాం.

అతనింకేం చేయాలా అని దిక్కులు చూస్తూ నిలుచుని ఉండగా ఒక పోలీసు జవానొచ్చి, ''చూడు అబ్బాయి, ఆ పుస్తకా లమ్మింది నువేగదూ ? రెడ్డిగారు పిలుస్తున్నారు రా'' అని మర్యాదగానేపిలిచినా కంగారుగా వెళ్ళాడు పరశురాం ఏమయిందోనని.


''ఈ పుస్తకం అచ్చు వేసిందెవరు ?'' అడిగారు రెడ్డిగారు. ప్లాట్‌ఫారమ్‌కి అవతల ఒక తడికల షెల్టర్‌లో కూచుని ఉన్నాడాయన కాఫీ తాగుతూ.

''నేనేనండి...''

''ఆ మాట చెప్పటానికి అంత సిగ్గుపడతా వేమోయ్. ఇంత మంచి పుస్తకాన్ని మనవూరి వాళ్ళకి సమయం, సందర్భానికి తగినట్లు అంది స్తున్నందుకు గర్వించాలిగాని. నువ్విక్కడే కూర్చో. జనాన్ని నీ దగ్గిరికే వచ్చి కొనుక్కునేలాచేస్తాను'' అని కాఫీ ముగించి లేచిపోయారు. ఆయన వెంట ఆశ్రితులు వెళ్ళటంతో ఖాళీ షెల్టర్‌లో

కర్ణభేరి మార్పిడి !

జపానులోని ఒక డాక్టర్ల బృందం కర్ణభేరి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా చేస్తున్నది. ఈ చికిత్స తరువాత కొంతమంది మామూలుగానే వినగలుగుతున్నట్లు ప్రొఫెసరు తోరుమినటోగావి ఇటీవల ఒక సమావేశంలో తెలియచేశారు. చనిపోయిన వారి శరీరాల నుండి, వారు మృతి చెందిన 24 గంటల లోపుగా కర్ణభేరులను తొలగించి, సున్నకంటే 70 డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతలో నిల్వఉంచుతారు. ఈ విధంగా వీటిని అయిదు సంవత్సరాలపాటు నిల్వఉంచ వచ్చును. వీరు ఇంతవరకు జరిపిన పదకొండు శస్త్రచికిత్సలలో ఎనిమిది విజయవంతం అయినాయి.



ఎవరన్నారు నేను రిటైర్ అయ్యానని. కొత్త జీవితాన్ని ప్రారంభించానంతే! ప్రతి రోజు చిన్ననాటి స్నేహితులతో కలిసి షికారుగా పార్కుకి వెడతాను. పాట కచేరీలకు, హరికథలకు, గ్రంధాలయానికి వెడతాను. పెరట్లో మొక్కలకు నీళ్ళు పోస్తా. మనవలతో ఆడుకుంటా. ఇలా రోజంతా గడిచిపోతుంది. నేను రెండుపూటలా హార్లిక్స్ తాగుతాను. నా పనులు నేను చేసుకుని, హాయిగా కాలం గడపడానికి హార్లిక్స్ నాకు తోడ్పడుతుంది.
మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు వన్నె గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో రుచికరమైన పానీయం.
పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాలకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?
Horlicks
The Great Nourisher
కొత్త సమయం, కొత్త రూపం
మంచి పుష్టికరమైనది
HTD-HMM-8071 TEL

పరశురాం ఒక్కడూ ఓ స్టూలు మీద కూచున్నాడు, ఎదురుచూస్తూ.

అతని పుస్తకం స్టేజిమీద మైక్రోఫోన్‌లో పరిచయం చేసారు ఎవరో. కావలసిన వారు వచ్చి ఫలానాచోట పుస్తకాలు కొనచ్చు అని చెప్పారు.

అయిదు నిముషాల్లో జనం పరశురాం దగ్గరికి రావటం మొదలయింది. అరగంటలో పరశురాం చేతులు ఖాళీ అయిపోయినాయి. అతని సంతోషానికి అవధుల్లేవు. దూరంగా నిలుచుని గమనిస్తున్న విశ్వంకి ఇది చిత్రంగాను ఉంది. ''ఇవాళనించీ నా మిత్రుడ్ని వరించిన అదృష్టం వీణ్ణి ఇలాగే ఇంకా పయికి తీసుకువెళ్ళాలి'' అని మనసారా కోరుకున్నాడు.

13

రెండేళ్ళ క్రితం మొదలయిన ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఉద్యమపు గాలులు అప్పుడప్పుడు రాయలసీమ వయిపు వీస్తూ ఉన్నాయి. కానీ కోస్తా ఆంధ్రుల ఆధిక్యతమీద నిరసనతో ఇటు వయిపు వారు చాలా కాలం తాటస్థ్యన్నే వహించారు కానీ రానురాను ఉద్యమంలో ఎక్కువ మంది ముఖ్యనాయకులు పాల్గొని విస్తరింపజేయటంతో ప్రత్యేకరాష్ట్రంకోసం, ప్రాంతీయభేదాలు మరచి ఒక్కటయినారు తెలుగువారందరూ. ఏభయి ఎనిమిది రోజుల నిరాహారదీక్ష అనంతరం పొట్టి శ్రీరాములుగారు తనువు చాలించటంతో, ఆంధ్రులంతా తల్లడిల్లిపోయారు.

తరవాత రెండు రోజులకి నెహ్రూజీ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ప్రకటించారు. కర్నూలు కొత్త రాష్ట్రానికి రాజధాని అయింది.

ఉద్యమ సమయంలో చెన్నకేశవరెడ్డిగారి వంటి నాయకులకి కర్నూలులోని పెద్ద వ్యాపారస్తులు, ధనికులు ఎందరో ఉద్యమ వ్యాప్తికి ఆర్థికసహాయాన్ని అందజేసారు. ఉచితంగా కొన్నివేల కరపత్రాలు తన ప్రెస్‌లో అచ్చు వేయించటం ద్వారా తాను భాగం వహించాడు గుండూరావు.

కొత్త రాజధాని అయిన కర్నూల్లో వెలసిన ఎన్నో సర్కారు ఆఫీసులకి, ఫైళ్ళు, అకౌంటు పుస్తకాలు, రూళ్ళకాగితాలు వందల్లో, వేలలో కావలసివచ్చాయి. ఆ కాంట్రాక్ట్స్, వీలయినన్ని సంపాదించటంలో, ఒప్పుకున్న పనిని నిర్ణీత సమయంలో ముగించి ఇవ్వటంలోనూ పరశురాం ముఖ్యపాత్ర వహించాడు.

ఆ రోజుల్లో తన స్వంత వ్యాపారాలన్నీ మూలకి పెట్టటం తప్పలేదు అతనికి. ప్రెస్ నించీ అర్ధరాత్రికిగానీ బయిటపడటానికి వీలయేది కాదు. సరిగ్గా అప్పుడే అతను గుండూరావుకి ప్రీతిపాత్రుడు అయాడు.

పరశురాం మొదట తన దగ్గరికి వచ్చినప్పుడే అతనిమీద మంచి అభిప్రాయం ఏర్పడింది గుండూరావుకి. తర్వాత పనిలో అతను చూపుతూ వచ్చిన శ్రద్ధ, చేస్తున్న ఉద్యోగాన్ని నిర్లక్ష్యం చేయకుండానే, ఇతర వ్యాపకాలు కల్పించుకుని డబ్బు సంపాదిస్తున్న అతని చాకచక్యం ఆ అభిప్రాయాన్ని మరింతగా బలపరిచాయి. అందుచేతనే విశ్వం మానేసినప్పుడు ఆ ఉద్యోగాన్ని పరశురాం కివ్వటం ఎక్కువ ఆలోచించకుండానే చేశాడు.

ఈమధ్య కొన్నాళ్ళుగా గుండూరావు ఆరోగ్యం బాగుండటంలేదు. ఎక్కువగా ఇల్లు వదిలి తిరగలేకుండా ఉన్నాడు. అయినా ఆ తేడా ఏమీ కనిపించనివ్వకుండా పరశురాం ప్రెస్‌వర్క్ అంతా చూసుకుంటున్నాడు.

అప్పుడప్పుడు ఆయనకి అనిపించేది, ఆస్తి అంతా కట్టబెట్టి తన కూతుర్నెవరో ముక్కూ మొఖం తెలీనివాడి కిచ్చేందుకు బదులుగా, పరశురాంనే అడిగేస్తే అని. అయితే బొత్తిగా వెనకాముందూ ఎవరూ లేనివాడు, తన బంధువులంతా ఏమనుకుంటారోనని భయపడ్డాడు. కానీ అతను స్వంతంగా ఓ పుస్తకం అచ్చువేసి, అమ్మి, రెడ్డిగారి మెప్పు సంపాదించటంతో ఆ భయం కాస్తా ఎగిరిపోయింది. ఆయన పుణ్యమా అని పరశురాం పేరు న్యూస్‌పేపర్లలోకి కూడా ఎక్కింది.

పరశురాంని ఒకరోజు ఇంటికి పిలిపించాడు గుండూరావు. ఎప్పుడూ తను వసారాలో కూచుంటే, ఎదురుగా పిట్టగోడ నానుకుని నిలబడే మాట్లాడతాడు పరశురాం. అలాంటిది వాళ హాల్లో పెద్ద సోఫాలో తను కూర్చుని వున్నాడు అతనొచ్చేసరికి. ''రావోయ్ లోపలికి'' అని సాదరంగా ఆహ్వానించి, అతను మొహమాట పడుతున్నా వినకుండా పక్కన కూచోబెట్టుకున్నాడు.

పరశురాంకీ ఆదరమూ, మర్యాదా కొత్తగా ఉన్నాయి. డబ్బు విషయంలోనూ, తనకింద పని చేసేవార్ని చెప్పుచేతల్లో పెట్టుకోవటంలోనూ, ఆయన ఎంత నిక్కచ్చిగా ఉంటాడో తనకి అనుభవ పూర్వకంగా తెలుసు. అలాంటి దీరోజు తరతమ భేదాలు మరిచి సరసన కూచోబెట్టుకుంటున్నాడంటే ఏదో విశేషమే ఉండాలి అనుకున్నాడు అతను.

''కామమ్మా. కాఫీ తీసుకురా తల్లీ'' కూతుర్ని కేకేసాడు.

ఇదింకా కొత్తగా వుంది పరశురాంకి. అతను ఆశ్చర్యంలోంచి కోలుకోక ముందే కామేశ్వరి కాఫీ తెచ్చింది. నడకలోనే కుడిపాదం ఈడ్చి నడవటం తెలుస్తుంది. అదొక్క లోపం తప్పిస్తే, ముక్కు, ముఖం తీరు చక్కగానే ఉంటుంది.

అక్కడున్న బల్లమీద కాఫీ పెట్టేసి వెళ్ళిపోయిందామె. చెరొక గ్లాసు కాఫీ అందుకున్న తరవాత అడిగాడు గుండూరావు. ''నేరుగా అడిగేస్తున్నానని ఏమీ అనుకోవద్దు. నాకు ఉన్న విషయం దాచి మాటల గారడీ చేయటం రాదు. నీకా వెనక ఎవరూ లేరు. నువు మా పాపని పెళ్ళి చేసుకుంటావా అని అడగాలనే పిలిపించింది. అమ్మాయిని చూశావు గద, నీ అభిప్రాయం ఏమో చెప్పు.''

పరశురాం ఊహించని పరిణామం ఇది. హఠాత్తుగా వచ్చిన ప్రశ్నకి అంత వెంటనే

బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాలలో శ్రీ కళాభారతివారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన నన్నయ సహస్రాబ్ది ఉత్సవ సభానంతరం నృత్య ప్రదర్శన చేసిన చి. ఎన్. శాయిసంధ్య (8), గానం చేసిన కుమారి ఎన్. వి. ఆర్. శ్రీదేవి, ఎన్. భగవతి, టి. సూర్యకుమారిలని చిత్రంలో చూడవచ్చు.



జవాబేం చెబుతాడు ? మౌనంగా కాఫీ తాగుతూ ఉండి పోయాడు. "ఇందులో బలవంతం ఏమీ లేదు. నా బిడ్డని గూర్చి గొప్పలు చెప్పుకోవటం బాగుండదు. కాలు వంకర తప్పిస్తే, వేరే లోటు లేదు. మంచి మనసు. అందులో గుడికట్టి పూజ చేస్తుంది, కట్టుకున్న వాణ్ణి."

"నిజానికి నన్నల్లుణ్ణి చేసుకుందుకే మీరు బాగా ఆలోచించాలి బాబూ ! ఆస్తి, అంతస్తూ ఎందులోనూ మీకు తూగలేని వాణ్ణి."

"అదంతా ఎన్నాళ్ళుగానో ఆలోచించే అడుగుతున్నానులే అబ్బాయి, ఎవరూ లేకపోతే ఏం, పెళ్ళవుతే అందరం ఒకటి అవుతాము. అయినా తొందరేం లేదు. బాగా ఆలోచించుకునే చెప్పు. దూరపు బంధువులెవరయినా ఉంటే చెప్పు. పిలిపించి, మాట్లాడుతాను నీ కిష్టమయితే."

ప్రత్యేకించి చెప్పకపోయినా, అర్థం చేసుకో లేని తెలివితక్కువవాడు కాదు పరశురాం. ఆ అమ్మాయిని పెళ్లాడితే మొట్టమొదట ప్రెస్ తనకి స్వంతం అవుతుంది. అది అతన్ని చాలా ఆకర్షించింది. అతనారోజు ఏ ముహూర్తంలో ప్రెస్ వర్క్సులో చేరాడో కానీ, దానికీ అతనికీ అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది. అందుకే స్వంతంగా ఎన్ని వ్యాపారాలు చేయగల శక్తి ఉన్నా ఆ ఉద్యోగాన్ని మాత్రం వదులుకోలేదు.

ప్రపంచంలో చాలా కొంత మందికి మాత్రమే జీవితం వడ్డించిన విస్తరిలా వుంటుంది. మిగిలిన చాలామందికి ఏది కోరుకున్నా, అంత దూరంలో ఉండి, అందీ అందక ఊరిస్తూ వుంటుంది. తనీకోవకి చెందిన వాడినని పరశురాంకి తెలుసు. తనకిప్పుడు ఆసరాగా ఉండే వ్యక్తులు, కొంత డబ్బు కావాలి, ముందుకి వెళ్లాలంటే. అందుకనే, ఆ పిల్లకున్న లోపాన్ని మరిచిపోయి, ఒప్పుకుందుకే నిర్ణయించుకున్నాడు.

నెల తిరిగేసరికి పరశురాం, కామేశ్వరిల వివాహం అయింది. అతను పాత ఇల్లు వదిలి మామగారింటికి మకాం మార్చాడు.

* * *

పెళ్లిలో అన్నీ తామే అయి తిరిగారు మీనాక్షీ, విశ్వమూర్తి. స్వంత అక్కచెల్లెళ్లులేని కామేశ్వరి సహజంగా మీనాక్షితో బాగా కలిసి పోయింది. అందుకనే ప్రసవానికి కొద్దిరోజులు ముందు మీనాక్షిని తన ఇంట్లో వుంచుకుందా మనే సలహా తనే ఇచ్చింది పరశురాంకి.


ఒక విధంగా స్వార్థం కోసమే తనీ పెళ్ళి చేసుకున్నా తర్వాత తానేదో పోగొట్టుకున్నాననే అభిప్రాయం మార్చుకోక తప్పలేదు పరశురాంకి. కామేశ్వరి దృష్టిలో అతను దేవుడు. తన తండ్రి కున్న ఆస్తి, పరపతి ఉపయోగించి, కూతురు అవిటితనాన్ని కప్పిపెట్టయినా, తనకి మంచి సంబంధాన్ని తేగల శక్తి వుంది. కాని అలా చేసుకున్న వాడు తనని జీవితాంతం సుఖపెడతా డనే గ్యారంటీ ఏముంది ? అందుకనే తండ్రి పెళ్లి మాటెత్తినప్పుడల్లా బెదురుగా వుండేది ఆమెకి. నాలుగయిదు సంబంధాలు చూడటం కూడా అయింది. కానీ పెళ్లిచూపుల దగ్గరే ఆగిపోయినాయి. తండ్రికి అవతలివారు నచ్చకో, వారికి తను నచ్చకో.

కానీ పరశురాం నాలుగేళ్ళుగా తెలుసు. అతను ఒక్కనాడయినా తనని తేరిపార చూడక పోయినా తను అతన్ని తమ ఇంటికి వచ్చినప్పుడల్లా గమనిస్తూనే వుంది. మొదటగా అతను విశ్వమూర్తి వెంట వచ్చినప్పుడు చూసింది. ఆవేళ అతడ్ని గూర్చి తనకేమీ తెలీకపోయినా, ఏదో అర్థం కాని అభిమానాన్ని ఏర్పరుచుకుంది మనసులోనే. అయితే దానివెంటే కొంత నిస్పృహ లేకపోలేదు. "తనెవరి మీదెంత ఆశలు పెంచుకుంటే ఏం, తన అవిటితనాన్ని భరించి తనకి దగ్గరయే దెవరు ?" అనే బాధ మనసుని ముల్లులా గుచ్చి గుర్తుచేసేది. అతను ప్రెస్‌వర్క్సులో తండ్రి అభిమానాన్నెలా సంపాదించిందీ, స్వయంగా వ్యాపారం చేసి ఎలా నెగ్గుకొస్తున్నదీ, స్వంతంగా ఒక పుస్తకం ప్రచురించి అమ్మటంలో విజయం సాధించటం అన్నీ తెలుసుకుంటూనే వుంది ఆమె. తండ్రీ కూతుళ్ళిద్దరూ మంచి స్నేహంగా వుంటారు. తనలో లోపానికి భయపడి ఎప్పుడూ గడపదాటి కదలదు కామేశ్వరి. కానీ ఆమె తండ్రికి బయట జరిగే ఏ విషయాలయినా కూతురికి వివరించి చెప్పటం సరదా.

చివరకి పరశురాం తన్ని పెళ్ళి చేసుకుందుకు ఒప్పుకున్నాడని తెలియగానే గుండెల మీదినుంచీ పెద్ద బరువు ఏదో తీసేసినట్లయింది. అతను ఈ పెళ్ళికి ఒప్పుకుంటే బాగుండు అని ఎన్నిసార్లు అనుకుందో, అంతకు ముందు.

పెళ్ళయిన తర్వాత, అతన్ని గురించి తాను చేసిన ఆలోచనలు ఒక్కొక్కటీ అతనికి చెప్పింది సిగ్గుపడుతూనే. అన్నిటికీ నవ్వేసి వూరుకునేవాడు పరశురాం. మనిషన్న తర్వాత తగిన వయసులో పెళ్ళి చేసుకుని ఒక తోడు ఏర్పరచుకోవటం అవసరం అని అతని అభిప్రాయం. అయితే తను చేసుకోబోయే అమ్మాయి ఇలా ఉండాలి, ఇంత అందంగా వుండాలి అని అతనెప్పుడూ కలలు కనే తీరుబాటు ఎక్కడుంది ? అందువల్లనే కామేశ్వరిని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్న నాడు, తన జీవితంలో జరిగి తీరాల్సిందేదో జరిగి పోతోంది అనే భావనే అతన్లో వుండేది.

అయితే పెళ్ళి అయిన కొన్ని రోజుల్లోపలే కామేశ్వరి మంచితనమూ, తనంటే ఆమెకున్న అభిమానం అర్థం అయినాయి పరశురాంకి. తనకి ఉదయం లేచినప్పట్నించీ రాత్రి ఇల్లు చేరేవరకూ ఎన్నో వ్యాపారాలు, వ్యవహారాలు, ఆలోచనలూను. తను తిరుగాడే ప్రపంచం పెద్దది. ఆమెకలా కాదు. ఆమె ఆలోచనా పరిధి చిన్నది. వాటినిండా తనే నిండి వుంటాడని తెలుసు. తను కాస్త నీరసంగా కనిపించినా, ఏ మాత్రం నలత పడినా ఆమె ఎంత హడావిడి చేస్తుందో, ఎంత గాభరాగా తనకి సేవలు చేస్తుందో చూశాడు. తానూ అంతే ! ఎక్కువగా పనేదయినా వుండి ఆలస్యంగా ఇల్లు చేరాల్సి వచ్చిన రోజున భార్య భోజనం చేయకుండా తనకోసం చూస్తుంటుంది కదా అని బాధ పడేవాడు. ఒకోసారి తామిద్దరి మధ్యా ఇంత తక్కువ కాలంలో ఏర్పడిన ఈ ప్రేమాభి మానానికి ఆశ్చర్యం వేస్తుంది. ఇన్నాళ్ళు ఆకలిగా వుంటే హోటల్లో భోజనం చేయటం, విశ్రాంతి కోసం ఇల్లు చేరటం చేసేవాడు. ఇప్పుడా రెండు



అవసరాలకి మించిన ఆకర్షణ శక్తి ఏదో తన్ని ఇంటికి లాగుతోంది.

పెళ్ళితో కొంత ఆస్తి, ఒక అంతస్తు వచ్చాయి పరశురాంకి. అందుకే చిన్న వ్యాపారాలు వదిలేసాడు. పిండిమరని ఇంకెవరికో అమ్మేసి, మామగారి సలహామీద పిండి, రవ్వ, మైదా తయారుచేసే పెద్ద ఫ్లోర్ మిల్లింగ్ మెషీను కొన్నాడు. స్వంతంగా భూములు, పొలాలు చూసుకునే ఓపిక లేక అన్నీ అమ్మేసి అల్లుడికి అవసరమయిన పెట్టుబడి అందించాడు గుండూరావు. మిల్లుకీ, ప్రెస్‌కీ తిరుగుతూ రెండూ చూసుకుంటున్నాడు పరశురామ్. కొత్తగా మోటార్ సైకిలొకటి కొనుక్కున్నాడు.

14

మీనాక్షి మొదటిసారి మూడవ నెలలో గర్భస్రావం అయినప్పట్నుంచీ ఆమెను అతి జాగ్రత్తగా చూసుకున్నాడు విశ్వం. ఆమెకి కూరగాయలు తరిగివ్వటం దగ్గర్నించీ, వంటలో ఎంతో సహాయం చేసేవాడు. ఆమె ఏకాస్త

గోరంత దీపం

అలసినట్లు, నీరసంగా కన్పించినా మంచం దిగనిచ్చేవాడు కాదు.

మీనాక్షికి రెండోసారి నెల తప్పినప్పుడు ఎంతగా ప్రార్థించాడో దేవుణ్ణి ఆమెకే అపాయమూ జరగకుండా సవ్యంగా పురుడు జరిగి పోవాలి అని. అన్ని ప్రార్థనలూ వ్యర్థమే అయినాయి. నిండు చూలాలిగా కళకళలాడుతూ పరశురాం పెళ్ళి అంతా తనే అయి తిరిగిన మీనాక్షి, నెల తిరిగేలోపునే పురుడు కష్టం అయి హాస్పిటల్లోనే ప్రాణాలు విడిచింది. ఒకప్పుడు పరశురాం ఆమెకి చేయించి పెట్టినవీ, ఇన్నాళ్లు ఆమె చేతుల్లో కదలాడినవి రెండుజతల బంగారు గాజులు మాత్రం భద్రంగా తీసి దాచుకున్నాడు విశ్వమూర్తి.

అతనికా ఇంట్లో, ఆ ఊర్లో ఉండటం కూడా వద్దు అనిపించింది. స్వతహాగా కాస్త గుండెనిబ్బరం కలవాడు కావటంవల్ల పూర్తిగా దిగజారిపోలేదు. దుఃఖాన్ని బయటికి చూపలేదు. తన బాధని ఒకరితో చెప్పుకోనూలేదు. వీలయినంత సమయం స్కూల్లోనే గడుపుతున్నాడు. ఇంటికి రావటం అంటేనే బెదురుగా ఉంటుంది. ఏ గదిలో ఉన్నా, ఏం చేస్తున్నా శూన్యంగా అర్థం లేనట్లుగా అనిపిస్తుంది. ఒంటరితనం అన్నది, మనసులో భాగం అయినవారు పోయిన తర్వాత ఏర్పడేది, ఇంత భయంకరంగా ఉంటుందని అతను మునుపెన్నడూ ఊహించలేదు.


ఏదో ఒక విధంగా బుర్రకి పనిపెట్టాలని, ఎమ్. ఏ. పరీక్షకి కట్టాడు, ప్రయివేటుగా రాద్దామని. అర్ధరాత్రి అయినాసరే నిద్రరాక ఏవో పుస్తకాలు ముందు వేసుకుని కూర్చునేవాడు. ఆ రోజుల్లోనే అనుకోకుండా ఆ వూరు వదిలి వెళ్ళాలన్న అతని కోరిక తీరింది. బెంగుళూరులో ఒక ఆంగ్ల దినపత్రిక ఆఫీసులో ఖాళీలు పడితే అప్లయిచేసి, రిపోర్టర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు.

(ఇంకా ఉంది)

షాకుని షేరి

ఎన్నికల్లో మంత్రాలు !

కెన్యా రాష్ట్ర (దేశ) పతి ఎన్నికల సమయాలలో మంత్ర విద్యలు చూపించవద్దని, మాంత్రికులను చేరదీయవద్దనీ ప్రజలను వేడుకున్నారట. ప్రెసిడెంట్ డేనియల్ అరఫ్‌మొయి తన ప్రసంగంలో పోయిన ఏడు యిలానే మంత్ర విద్యలు చూపి, వోటు వేయకపోతే నిన్ను బుగ్గి చేస్తామని కొందరు భయపెట్టడం జరిగిందని అన్నారట – అక్కడా వుందీ !



కలియుగ బకాసురుడు !

కాలిఫోర్నియాకు చెందిన అబ్రహాం మిల్లర్ అనే వో అభినవ బకాసురుడు సాదా మానవునికి పన్నెండు రెట్లు ఆహారం తింటాడట. మామూలు మనిషికి రోజుకు రెండువేల కేలరీల శక్తినుత్పత్తి చేసే ఆహారం కావలసివుంటే యితడికి పాతికవేల కేల రీలు కావాలట. మఠం వేసుక్కూచుని అతి సునాయాసంగా 27కోళ్ళను తినేస్తాడట యీ మహానుభావుడు.

విజ్ఞానశాస్త్రంలో వనితలు !

విజ్ఞానశాస్త్ర విభాగాలలో పనిచేసేవారిలో దేశం మొత్తంమీద తేలిన లెక్కలనుబట్టి నూటికి 39.1 మంది చదువుకున్నవారిలో యీ విభాగాలలో వున్నారట. ఇందులో 33.4 శాతం ఆడవారున్నారట. కేరళ రాష్ట్రంలో దేశం మొత్తం విద్యావంతులలో అధికశాతం వుంటూంటారు. అయితే కేరళ విద్యావంతుల లోని స్త్రీలలో 31.9 శాతం యీ విజ్ఞాన శాస్త్ర విభాగాలలో (ప్రొఫెసర్లు, డాక్టర్లూ వగైరా) పనిచేస్తున్నారట. ఏవిటో ? కాస్త తికమకగా వున్నట్టుందా !

తేనెలో శక్తి !

తేనెలో అధికశక్తి వున్నదనీ అది శరీర ఆరోగ్యానికి చాలా మంచిదనీ చాలామందికి తెలుసు. ఒక కిలో తేనెలో 3500 క్యాలరీల శక్తి వున్నదట. ఒక్క కిలో తేనె 65 కోడి గుడ్లకుగాని, అయిదు లీటర్ల పాలకుగానీ సమమట. రోజూ వో చెమ్చాడో, రెండో తేనె నాకేస్తే సరిపోతుందా !

మూషిక సంతానం !

ఎలుక ఒక రోజుకు 28 గ్రాముల ఆహారాన్ని స్వీకరించగలదట. ఓ ఆడఎలుకా, మగఎలుకా కలిస్తే ఏటికి ఎనిమిది వందల ఎలుకలను సంతానంగా బహూకరింపగలదట. అయ్యో యిదీ వరుస !

పసిపిల్లలు ఏడవకుండా చిట్కా !

పసిపిల్లలు పట్టువదలకుండా ఏడవడం ఆపాలంటే వో తమాషాపని చేయవచ్చునని ఆరమ్‌స్ట్రాంగ్ స్టేట్ కాలేజికి చెందిన సైకాలజీ ప్రొఫెసర్ గ్రీస్ మార్టిన్ అన్నాడుట. పసిపిల్లలు ఏడుస్తూండగా వారి ఏడుపును టేపుచేసి, మళ్ళీ వాళ్ళు ఏడ్చేటపుడు వారికే వినిపిస్తే తమ ఏడుపును తక్కునాపేస్తారట. అయితే టేపులో పరాయిపిల్ల ఏడుపు వినిపిస్తే పనిచేయదనీ, ఏ పిల్ల ఏడుపు ఆ పిల్లకే పనిచేస్తుందనీ, పుట్టిన 20 గంటలలోపు పసికందే తన గొంతునూ, పరాయి గొంతునూ గుర్తుపట్ట గలదనీ ఆవిడన్నారట.

బాంక్‌లో డబ్బు వేస్తే మర తుపాకులు !

యు. యస్. ఏ. పెన్సిల్వేనియాలోని కొలంబియా బ్యాంకు ఫిక్సెడ్ డిపాజిట్ అయిదేళ్ళకు వేస్తే, అట్టి ఖాతాదారులకు 459 డాలర్ల విలువ చేసే ఆటోమెటిక్ రైఫిలు ప్రజంటేషననీ, అయిదేళ్ళకు 1310 డాలర్లు డిపాజిట్ చేయాలనీ ప్రకటించారట. ఈ డిపాజిట్లకు తగిన విధంగా అనేక వేలల్లో పిస్టళ్ళు బహూకరిస్తామని ఆ బ్యాంకు వైస్ ప్రెసిడెంటు చార్లిస్ బిషప్ అన్నారట.

రూపాయికి 20 పైసలే !

ఒక రూపాయికి భారతదేశంలో కొనుగోలు శక్తి లెక్కలుకట్టిన నిపుణులు 20.12పైసలు మాత్రమేనని తేల్చారట. ద పర్చేజింగ్‌పవరాఫ రూపీ యీజ్...ప్స్.

అవమానం భరించలేక ఆత్మహత్య!

ఆత్తూరు (తమిళగం)కు చెందిన శీలయంపట్టి గ్రామానికి చెందిన 50 ఏళ్ళ సుబ్బరాయన్ తన కూతురు తంగమ్మను అదే వూరుకు చెందిన తంగవేలుకు యిచ్చి వివాహం చేశాడట. తంగవేలుది వుమ్మడి కుటుంబమట. అతను లేని సమయంలో అతని తమ్ముడు చెల్లదుర్రై తంగమ్మను చేరపట్టచూసి, కుదరనందువల్ల ఆవేశంతో చితకబాదేశాడట. ఈ అవమానం భరించలేక తంగమ్మ వురిపోసుకుని చనిపోయిందట. దాంతో ఆమె తండ్రి సుబ్బరాయన్ వారింటికేవెళ్ళి, దారిలో పేకాడుతూన్న ఆ చెల్లదొర్రై కనుపించేసరికి ఆతన్ని కత్తితో కసకసా పొడిచి చంపేశాడట.

పోనీటైల్ వల్ల బట్టతల !

పోనీటెయిల్ అనే ప్యాషను పేర ఆడవారు జుట్టు దువ్వి, జడ వేయకుండా ముచ్చలిగుంట దగ్గరకి యీడ్చి బిగించి



కట్టుకోడంవల్ల ఆడవారిలో బట్టతల వచ్చే ప్రమాదమున్నదట. అలా వచ్చిన బట్టతల యిహ ఏ మందుకూ లొంగదట. జుట్టును లాగి బిగించడం వల్ల నుదురు, చెంపల ప్రాంతాలలోని గ్రంథులు దెబ్బ తింటాయాట. దీనివల్ల రక్త ప్రసరణ మండలం ఆ ప్రాంతమంతా దెబ్బ తిని వూరుకుంటుందని స్కిన్ ఫిజియాలజి విభాగానికి ప్రెసిడెంటు (ఫ్రెంచి ఎసోసిఏషన్) డాక్టర్ ఆరాన్ బ్రునిట్టేరి అన్నారట. ★

స్వయంవరం

ఆదూరి సావిత్రి



"శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ కళాశాల." అనే గుండ్రని అక్షరాలు చెక్కిన ముఖ ద్వారంలోనుంచి గుంపులు గుంపులుగా బయట కొస్తున్నారు అబ్బాయిలు, అమ్మాయిలు...

సైకిళ్ళమీదున్న స్టూడెంట్స్ రోడ్డుమీద నడుస్తున్న విద్యార్థి బుజంమీద ఒక చెయ్యివేసి, ఒక చేత్తో హ్యాండిల్ పట్టుకుని కంట్రోల్ చేసుకుంటూ విలాసంగా వస్తున్నారు...

రంగు రంగుల చీరలు, లంగాలు, పంజాబీ డ్రస్సులతో ఉన్న అమ్మాయిలు నవ్వుతూ తుళ్ళుతూ రోడ్డంతా ఆక్రమించుకుంటున్నారు..

పడమటి దిక్కుగా జారిన సూర్యుడు చీకూచింతాలేనట్లు తుళ్ళిపడుతున్న వాళ్ళందర్నీ, మొహమంతా ఎర్రగా చేసుకుని ఈర్ష్యగా చూస్తున్నాడు.

మధ్య మధ్య వాళ్ళను తప్పించుకుంటూ స్కూటర్లమీద, సైకిళ్ళమీదా వస్తున్నారు లెక్చరర్స్...

"ఏమే వాణీ సెలవలకెక్కడికన్నా చెక్కేస్తున్నావా... ఇంటికేనా ?" అన్నది ఉష.

నీలం రంగుమీద బంగారు కలరు చుక్కలున్న షిఫాన్ చీరతో... పొడుగ్గా ఉన్న జడను మధ్యకు మడిచి, మొదట్లో రిబ్బన్ పువ్వులా కట్టుకున్న తెల్లగా నాజూగ్గా ఉన్న పదహారేళ్ళ అమ్మాయి కళ్ళు పైకెత్తి చూస్తూ "ఏమిటే?" అన్నది.

"ఏ లోకంలో ఉన్నావ్ తల్లీ ? సెలవల కెక్కడికెడుతున్నారు రాణీగారు ?"

"ఈసారి ఇంటికెళ్ళను. మా అత్త దగ్గర కెడతాను. నాన్నగారు వెళ్ళమని రాశారు. ఈ రాత్రే హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేస్తున్నా." అన్నది వాణి.

"ఆ అత్తకేమన్నా కొడుకూ గట్రా ..."

"నీ మొహం. ఎవరూ లేరు. అంతా కూతుళ్ళే."

"అబ్బా ! వేస్టు !"

" మధ్యన నీకెందుకే దిగులు ?" అంటూ ఉషను మోచేత్తో పొడిచిందో అమ్మాయి.

ఇంతలో వెనకనుంచి "నిలువవే వాలుకనుల దానా...వయారీ హంస నడకదానా..." అంటూ ఈలపాట మొదలెట్టాడొకడు.

అమ్మాయిలంతా నిశ్శబ్దంగా అయిపోయారు

"ఏమిటి గురూ... ప్రకృతి ఇంత ప్రశాంతంగా మారిపోయింది ;" అన్నాడు రవి.

"మన పాటంటే... మరి మజాకా అనుకున్నావేమిటి ?" మీసం మెలేస్తూ నవ్వాడు రాకేష్.

"ఇంతకీ మనలో వాలుకనుల వయ్యారి ఎవరూ ?" సందేహంగా గుసగుస లాడిందో అమ్మాయి.

"వాడికదో జబ్బు ... నీకిదో తెగులు. నోర్మూసుకో." చిన్నగా కసిరింది వాణి.

'శ్రీ గోల్డ్ కవరింగ్' ముందుకు రాగానే "నేను వానిషింగ్ క్రీము, పౌడరు, కొనుక్కోవాలే" అన్నది ఉష.

"పద, నేనూ జడపిన్నులు, తిలకం సీసా కొనాలి !" అన్నది వాణి.

వాళ్ళు షాపు మెట్లెక్కగానే "ఒరేయ్ నేను బెల్ట్, కర్చీఫ్‌లూ కొనాలి" అంటూ ఓ

నలుగుర్ని వెంటేసుకుని తనూ షాపులో దూరాడు రాకేష్

"ఖర్మ, స్వర్గానికిపోయినా సవతిపోరు తప్పదని ..." గొణుక్కుంటూ గబగబా తమ క్కావలసినవి కొనుక్కొని బయటపడ్డారు అమ్మాయిలు.

*　　　*　　　*

విండోలోనుంచి వాణి ముఖం కనపడగానే బస్సు దగ్గరకొచ్చారు ఇందిర, జయ.

"అమ్మయ్యా! వచ్చావుగదా. మావయ్య నిన్నిక్కడికి రానిస్తాడో ... లేకపోతే ఇంటికే వచ్చెయ్యి అని లాక్కుపోయాడో ... నీ ఉత్తరం చూశాక కూడ మాకు సందేహమే. ఆఖరు క్షణంలోవచ్చి, పదపద ఇంటికి అన్నాడేమోనని" నవ్వుతూ వాణి చేతులో లగేజ్ అందుకుంది జయ.

ఇంటికెళ్ళగానే అభిమానంగా ఎదురొచ్చింది రాజేశ్వరి.

"మొహం కడుక్కో. రాత్రనగా బయల్దేరావు. అన్నమైన తిన్నావోలేదో. ఇడ్లీ వేడిగా ఉంది. పెడుతున్నా, కారప్పొడి వెయ్యనా ... చట్నీ వేసుకుంటావా ?" అన్నదామె హడావుడి పడిపోతూ.

"మేనగోడలొచ్చిందనే సంతోషంతో ఈ జీవుడి సంగతి మర్చిపోక. నాకు కంపెనీకి టైమవుతోంది" జోక్‌గా అంటూ " ఏం వాణీ పరీక్షలెలా రాశావ్ ?" అన్నాడు పురుషోత్తం.

"బాగా రాశాను మావయ్యా. ఫస్ట్‌క్లాస్ ష్యూర్" బ్రష్‌మీద పేస్టు వేసుకుంటూ అన్నది వాణి.

"బి. ఏ. ఎక్కడ చదువుతావ్ ?"

"ఎక్కడేమిటి ? ఇప్పుడు చదివేచోటే. ఆ కాలేజీలో బాగా చెపుతారు."

ప్లేటులో ఆరిడ్లీలు పెట్టింది రాజేశ్వరి.

"నాయనోయ్ ! అన్ని తినలేనత్తయ్యా." అంటూ మూడు తీసి వేరే పళ్ళెంలో వెయ్య బోతున్న వాణిని వారిస్తూ "మీ ఇంట్లో చేసినంత పెద్దవికావే. ఎంత చిన్నవో చూడు. ఇవి ఆరూ కలిసినా మీ ఇంట్లో మూడిటికి సాటిరావు." అన్నది రాజేశ్వరి.

ఎంత చెప్పినా, వాటిని మళ్ళీ వేసుకొని మేనగోడల్ని "ఇంత నాజూకు తిళ్ళు తినబట్టే... గాలేస్తే ఎగిరిపోయేలా ఉన్నావ్." అంటూ మందలించింది.

*　　　*　　　*

"ఒదినగారూ జోస్యం చెప్పే కోయ వాడొస్తే పిలవమన్నారుగా. రండి." అన్న దొకావిడ వచ్చి.

"నువ్వూ రావే వాణీ. చెయ్యి చూపించు కుందుగాని. అతను చెప్పినవి చాలావరకూ నిజమౌతున్నాయిట. అంతా నమ్ముతున్నారు" అంటూ వాణిని కూడా తనతో తీసుకెళ్ళింది రాజేశ్వరి.

వరండాలో ఓ పదిమందిదాకా కూర్చుని, కోయవాడుచెప్పే జోస్యం కబుర్లు వింటున్నారు...

"ఇదిగో ఇది నేను రామారావుతో, నాగేశ్వర్రావుతో తీయించుకున్న ఫొటో. ఇది ప్రధానమంత్రితో తీయించుకున్నాను. ఇది వాణిశ్రీతో... వీళ్ళంతా నేను చెప్పిన జోస్యం నిజమైందనే సంతోషంతో నాతో ఫొటో దిగారు." అంటున్నాడతను.

"ఈ అమ్మాయి చెయ్యి చూడు," వాణి చెయ్యి పట్టుకుని ముందుకు చాపుతూ అన్నది రాజేశ్వరి.

"దీనికి ఇంటర్‌లో క్లాసొస్తుందా ?" ఆత్రంగా అడిగిందామె.

"ఆ ! ఫస్ట్ క్లాసొస్తది ఈ కూనను బి. ఎ లో ఒకడు ప్రేమించి పెళ్ళి చేసు కుంటడు..." అంటున్నాడు కోయవాడు.

"ఇంతకూ... ఆ అబ్బాయి దీన్ని బాగా చూసుకుంటాడా ?" నవ్వుతూ అన్నది రాజేశ్వరి.

వాణి ముఖంలో కదులుతున్న సిగ్గును, కుతూహలాన్నీ ఓరగా పరికిస్తూ "ఓ ! భేషుగ్గా చూసుకుంటడు. కదిలితే కందిపోతదనుకుంటడు. ఎర్రగా బుర్రగా నీకు సరిజోడుగా ఉంటడు..." కోయవాడు చెపుతున్న మిగిలిన మాటలు వినటం మానేసింది వాణి.

తనను బి. ఎ లో ప్రేమించబోయేవాడి గురించి కలలు గనటంలో మునిగిపోయింది.

అస్తమానం ఈ విషయంమీదే జోక్ చేసేవారు ఇంట్లో అంతా. "జాజిపువ్వులా ఉంటావ్ ! ఎవడైనా... ఎగరేసుకుపోయి మరీ చేసుకుంటాడు నిన్ను." అనేది రాజేశ్వరి.

రిజల్ట్సు వచ్చాయి...

వాణి ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది.

"నే చెప్పలా ? ఆ కోయదొర చెప్పినవన్నీ నిజమౌతుంటాయి." అన్నది రాజేశ్వరి.

"అయితే... ఇంక నీ హీరో రంగప్రవేశం చెయ్యటం మిగిలిందన్నమాట" అంటూ నవ్వింది జయ.

వాళ్ళందరి మాటలూ వాణి ఎదిగీఎదగని మనసుమీద బలంగా పనిచెయ్యసాగాయి...

కొందరు... ఏదో జోక్ చేస్తున్నామని మాత్రమే అనుకుంటారుగానీ... తమ మాటల ప్రభావం ఆ పసిపిల్లలమీద ఎలా ముద్రపడు తోంది... దీని ఫలితం ఎంత దారుణంగా ఉంటుంది అనే విషయాన్ని కొంచంకూడా ఆలోచించరు.

హైదరాబాదునుంచి వచ్చేశాక బి. ఎ.లో చేరింది వాణి.

*　　　*　　　*

బి. ఎ. సెకండియర్‌కూడా సగం గడిచి పోయింది. దిగులుగా ఉంది వాణికి.

ఇదేమిటి ? ఇంతవరకూ తనెవర్నీ ప్రేమించ లేదు !

మరి జోస్యం ?


పడుచుదనంలో చెలరేగే కోరికల్ని సాంప్ర దాయం...కట్టుబాటు అనే సంకెళ్ళతో బంధించి, మనసు నదుపులో పెట్టుకుంటారు ఆడపిల్లలు.

అలాగే సాగబోతున్న వాణి మనసుమీద కోయజోస్యం ఊహించని విధంగా పని చేస్తోంది. హైదరాబాదులో తనవాళ్ళందరి మాటలూ ఇంకాస్త ఎగదోస్తున్నాయి. ఆ అమ్మాయికి తెలియకుండానే సాంప్రదాయపు సంకెళ్ళు లూజయి, ఆలోచనలన్నీ కట్ట తెగిన వరదలా తనను ప్రేమించబోయే వాడిచుట్టూ విజృంభించ సాగాయి.

శృతిచేసిన వీణలా ఉన్న ఆమె మనసు ఏ చిన్న ఆధారాన్నైనాసరే పట్టుకోటానికి సిద్ధంగా ఉంది. తననెవరూ ప్రేమించకుంటే ?

చదువై ఇంటికెళ్ళాక... తన పైనున్న ముగ్గురక్కల పెళ్ళిళ్ళు అయి, తనదాకావచ్చే సరికీ తనుకాస్తా ముసలిదైపోతుంది.





స్వయంకృతం

నో ! జోస్యం అబద్ధం కాకూడదు. తనది లౌ మ్యారేజ్ ! అంతే !

* * *

ఏదో ఆలోచిస్తూ పుస్తకాలు గుండెల కదుముకుని నడచివస్తున్న వాణి ఎదురుగా వస్తున్న ఓ యువకుడు బలంగా డాషివ్వటంతో తూలిపడబోయి ఆపుకుంది.

"సారీ వాణీ!" అంటూ కిందపడ్డ పుస్తకాలు ఏరి చేతులో పెడుతున్న అతన్ని చిరాగ్గా చూసింది. తన పేరు కూడా తెలుసే!

"కోపంగా ఉందా ? నిజంగా ... కావాలని డాషివ్వలేదు నేను" సిన్సియర్‌గా, మృదువుగా అన్నాడతను.

మాట్లాడకుండా చరచరా వెళ్ళిపోతున్న వాణిని చూసి పెదవి విరిచి బుజాలెగరేశాడు తను.

ఆ తర్వాత అతననేకసార్లు ఆమె దృష్టిలో పడ్డాడు. వాణిని చూడగానే అతని పెదవులు కొంటెగా నవ్వేవి.

"ఎవరా హీరో ?" పక్కనున్న రమ నడిగింది వాణి.

"అతనిపేరు అశ్వద్ధామ. ఫైనల్ బి.ఎస్‌సి. చదువుతున్నాడు" అన్నది రమ.

"నయం. ఘటోత్కచుడని పెట్టుకోలేదు !" గట్టిగా నవ్వింది వాణి.

వెనక్కి తిరిగి చూశాడు అశ్వద్ధామ.

"నెమ్మదిగా నవ్వలేవూ ?" రమ మాటలకూ, అతని చూపులకూ బెదిరి టక్కున నోరు మూసుకుందామె.

* * *

కాలేజీ వెనకాలున్న గార్డెన్‌లో గుబురుగా పెరిగిన చెట్లచాటున వాణి ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు అశ్వద్ధామ.

"వాణీ ... ఇంత త్వరగా దగ్గరౌతామనుకోలేదు. ఈ ఊర్వశి నా ప్రియురాలనుకుంటే ... ఓహ్ ! సంతోషంతో మతిపోతోంది నాకు ... " అంటున్నాడతను.

"ఊc! ఇంకా ... " కొంటెగా నవ్వింది వాణి.

"ఇంకా చాలా ఉంది. నువ్వొప్పుకోటల్లేదుగా ?" నిష్ఠూరంగా అన్నాడతను.

"పెళ్ళయ్యాక అన్నీ ఒప్పుకుంటాను."

"అంతవరకూ అద్వాన్నుగా..."

"ఒద్దు."

"రేపు రాత్రి ఏడు గంటలకు బాగుంది. వేణుగోపాలస్వామి గుళ్ళో దండలు మార్చేసుకుందాం. నా ఫ్రెండ్స్ నలుగురు సాక్షులుగా వస్తారు, నీ ఫ్రెండ్స్‌నికూడా పిలుచుకో."

"నిజంగా ?!" సంభ్రమంగా అన్నది వాణి.

"నిజం !" అంటూ లేచాడు అశ్వద్ధామ.

అతను ప్రజెంట్ చేసిన ఎరుపుమీద జరీ పువ్వులున్న బెనారస్ చీర కట్టుకుంది వాణి.

ఆమె ఫ్రెండ్సే ముత్తయిదువులుగా వ్యవహరించి, కాళ్ళకు పారాణిపెట్టి, నుదుట కల్యాణ తిలకం, బుగ్గన చుక్క దిద్దారు.

తలంటుకున్న తలలోనుంచి తప్పించుకొచ్చిన ముంగురులామె పచ్చని ముఖం మీద పారాడుతున్నాయి.

కింద పెదవిని పై పంటితో నొక్కిపెట్టి వాణిని చూశాడు అశ్వద్ధామ.

మంచి పర్సనాలిటీ, చక్కని ఛాయతో అందంగా ఉన్న అతను పెళ్ళి బట్టల్లో ఇంకా అపురూపంగా ఉన్నాడు.

"అదృష్టమంటే మీదే. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అన్నట్లున్నారు." అంటున్న ఫ్రెండ్స్ మాటలకు ఇద్దరూ గర్వంగా నవ్వుకున్నారు.

అశ్వద్ధామ గదిలోనే అందరికీ చిన్న పార్టీ లాంటిది అరేంజ్ చేశాడు...

ఆ కోలాహలమంతా అణిగి, అందరూ వెళ్ళిపోయాక అశ్వద్ధామ, వాణి ఇద్దరే మిగిలారు.

ఇదంతా చాలా థ్రిల్లింగ్‌గా ఉంది వాణికి.

అశ్వద్ధామవేపు సరిగ్గా తలెత్తి చూడలేకపోతోంది.

ఆమె దగ్గరగా వచ్చాడతను..

అతని పెదవులామె మెడచుట్టూ ప్రదక్షిణం చేసి ముందుకొచ్చి, అక్కడేదో ఆకర్షణ మెరుపులా కొట్టటంతో కదలలేనట్లు ఆగిపోయాయి...

ఊపిరి నిలిచిపోతుందా అనిపిస్తోందామెకు...

"వాణీ... మాట్లాడు... ప్లీజ్ !" అస్పష్టంగా... మత్తుగా ఉందతని కంఠం.

జవాబుగా ఆమె చేతులతన్ని పెనవేసుకున్నాయి. పట్టలేని ఆవేశంతో ఆమెను చుట్టుకున్నాడతను.

... ...

అశ్వద్ధామ రూంలోనే ఉంటోంది వాణి.

అంతకుముందు వాణితోసహా ఓ అయిదుగురు ఆడపిల్లలు రమ నాయనమ్మ పర్యవేక్షణలో ఒక ఇల్లు తీసుకుని ఉండేవాళ్ళు.

అశ్వద్ధామ చాలా ప్రేమగా చూసుకునేవాడు వాణిని. మగవాడితో పెనవేసుకున్న ఆడపిల్ల జీవితం ఇంత సుందరంగా...అద్భుతంగా ఉంటుందా ! అనుకుంటూ విస్తుపోతోంది వాణి.

వాణి సెకండియరు, అశ్వద్ధామ ఫైనలియరూ ఎగ్జామ్స్ రాశారు.

ఇంటికి ప్రయాణమయ్యాడు అశ్వద్ధామ.

"నేనింక చదవను. మీతో వచ్చేస్తాను." బేలగా అన్నది వాణి.

"నువ్వీ సెలవలకి ఇంటికెళ్ళు. చదువు మానటంలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు. నేను నిన్ను మోసం చేస్తానని భయపడకు. నువ్వు నా ప్రాణానివి.

కానీ... ఇంత హఠాత్తుగా మనం ఇంటి కెడితే... అక్కడ మనకి ఘనమైన సత్కారాలేం లభించవు. ముందు నేవెళ్ళి నచ్చచెప్పి, నిన్ను తీసుకెడతాను. మా నాన్నకి కోపమొస్తే ఆయన చెప్పే మొదటి డైలాగ్ 'నా ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వను.'

ఏం తిని బ్రతుకుతాం? ప్రాక్టికల్‌గా ఆలోచించాలి గదా. ప్రేమనే తిని జీవించలేం.

నా మాట విను వాణీ. ఇన్నాళ్ళు నీతో కలిసి ఉన్నాను. ఆ మాత్రం మమత, బంధం నాకుండవా?

ఈ అడ్రసు నీ దగ్గరుంచు. లెటర్స్‌రాయి. మన విషయం తేలిందాకా ... నేను తరుచుగా వచ్చి నిన్ను చూసిపోతుంటాను.'' ఆమె గడ్డం పట్టుకుని, బ్రతిమాలుతున్నట్లుగా అన్నాడు అశ్వద్ధామ.

''సరే. సెలవలయిపోయి, నేనిక్కడి కొచ్చే సరికి, మీరు నాకోసం వచ్చెయ్యాలి.'' కన్నీళ్ళతో అన్నది వాణి.

''ఓకే!'' అంటూ ఆమె కళ్ళు తుడిచి, ఆమె నుదుట చుంబించి, వెళ్ళిపోయాడతను.

* * *

సెలవులయి తిరిగి వచ్చిన వాణి అశ్వద్ధామ కోసం క్షణమొక యుగంగా ఎదురు చూసింది.

ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు.

తను ప్రెగ్నెంట్! ఇలాంటప్పుడు అది మాత్రం తప్పకుండా వస్తుంది.

ఏం చెయ్యాలి? మళ్ళీ తనవాళ్ళకి ముఖమెలా చూపాలి? అసలా భర్త అనబడే వ్యక్తి ఉంటే ఎలాగో నచ్చజెప్పొచ్చు.

అతనేడి?

కాలేజీలో అందరికీ తనకూ, అశ్వద్ధామకూ పెళ్ళయినట్లు తెలుసు. చాటుగా చెవులు కొరుక్కున్నా... అంత గొడవేం లేదు.

చివరికో నిశ్చయానికొచ్చి, ధైర్యం చేసుకుని అశ్వద్ధామ ఇచ్చిన ఎడ్రస్ పట్టుకుని అరసవీడు ప్రయాణమయింది వాణి...

''అరసవీడు... అరసవీడు...'' కండక్టర్ అరుపుతో తడబడుతూ బస్సు దిగింది వాణి.

రోడ్డుమీదనుంచి ఒక ఫర్లాంగు లోపలికి ఉంది ఊరు. శుద్ధ పల్లెటూరు.

గుండెల్లో అదటుగా.. నాలుక పిడచగట్టుకు పోతున్నట్లుగా ఉందామెకు.

అతనిక్కడే ఉన్నాడా? తనను చూసి ఏమంటాడు? ఒంటరిగా బస్సుదిగి ఊళ్ళో కొస్తున్న ఆ అమ్మాయిని కుతూహలంగా వింతగా చూస్తున్నారు జనం.

''ఓరింటికెళ్ళాలం?'' తలగుడ్డవిప్పి, మళ్ళీ సరిగ్గా చుట్టుకుంటూ అడిగాడో రైతు.

వాణి సమాధానం చెప్పేలోగా పొడుగు చేతుల చొక్కా, చీలమండలదాకా పంచకట్టుకున్న ఒక నలభయ్యయిదేళ్ళ మనిషి ఆమె దగ్గర కొచ్చాడు.

''ఎవరింటికెళ్ళాలి?'' అని అడిగాడు వాణి కళ్ళల్లో బెదురును, అదటును నిశితంగా చూస్తూ.

''రామ్మోహన్రావుగారింటికి.'' నాలుకతో పెదవులు తడిచేసుకుంటూ అన్నది వాణి.

''ఏం పని ఆయనతో?''

''ఆయన కొడుకు అశ్వద్ధామ. నా...నేను, అతను ఒకే కాలేజీలో చదువుకున్నాం.''

''ఈ ఊర్లో ఉంటానని చెప్పాడా?''

''ఔను. ఈ అడ్రసే ఇచ్చాడు. రామ్మోహన్రావుగారు ఈ ఊరి ప్రెసిడెంటుట. మీకు తెలుసా?''

''నేనే రామ్మోహన్రావును.''

''వ్వాట్ ?!'' పక్కలో బాంబు పడ్డట్టు అన్నది వాణి.

''ఏం? ఎందుకంతాశ్చర్యం? నా గుణగణాలూ, రూపురేఖలూకూడా వర్ణించి చెప్పాడా? రాక్షసుడులా ఉంటానన్నాడా?'' వెటకారంగా అన్నాడాయన.

''అబ్బెబ్బే! అదేంలేదండి, మీరు... చాలా మంచివారని చెప్పాడు'' ఖంగారుగా అందామె.

''సరే, ఇంటికి పద'' అంటూ వాణిని ఇంటికి తీసికెళ్ళాడాయన.

''ఎవరీపిల్ల?'' ముఖం చిట్లించుకుంటూ అడిగిందాయన భార్య.

''ఎవరోలే, తర్వాత చెవుతాను'' అంటూ ''నువ్వు స్నానమదీ చెయ్యి'' అని వాణికి చెప్పి ''ఇదిగో, నువ్వాపిల్లని ప్రశ్నలతో చంపావంటే... బొమికలేరేస్తాను.'' అంటూ గాండ్రించాడాయన భార్యను.



ఇంతలో ''రెడ్డి'' అని ఎవరో పిలవటంతో బయటకెళ్ళిపోయాడాయన.

స్నానానికి నీళ్ళు తోడుతూ వివరాలడిగిందాయన భార్య.

''ఏమిటేమిటి! మా కొడుకుతో చదువుతున్నావా! అసలు మాకు కొడుకులే లేరు!'' అంటూ పెద్దగా నవ్విందావిడ.

''అదేంటి? మీ ఆయన పేరు రామ్మోహన్రావు కాదూ? ఆయనీ ఊరి ప్రెసిడెంటు కాదూ?'' కళ్లలో నీళ్ళు తిరుగుతుంటే అయోమయంగా అడిగింది వాణి.

ఇంకా పసితనం వీడనట్లున్న ఆ అమ్మాయి ముఖం చూస్తూ జాలిగా అన్నదావిడ.

''అమ్మాయ్! వాడెవడో తప్పుడు ఎడ్రసిచ్చి నిన్ను బాగా మోసం చేశాడు. నిన్ను చూడగానే ...ఏదో ఇలాంటి కేసే అని చెప్పి, మా ఆయన నమ్మించి నిన్నీ కొంపకి తెచ్చాడు. మా ఆయన రామ్మోహన్రావు కాదు. ఈ ఊరి ప్రెసిడెంటు పేరదికాదు. ఆయన పేరు చెంచురెడ్డి. అసలా పేరుగల వాళ్ళెవరూ ఇక్కడ లేరు. నా మాట విని మా ఆయనొచ్చేలోగా నువ్వెళ్ళిపో. ఇప్పుడు బస్సుంది పద నిన్నెక్కిస్తాను. ఇంకెప్పుడూ ఇలా ఒంటరిగా ఎక్కడకీ వెళ్ళకు. నిన్ను పంపేసినందుకు నా మొగుడేసే శిక్ష నేను భరిస్తాలే'' అంటూ వాణి దొడ్డిదారిన తీసికెళ్ళి బస్సు ఎక్కించేసొచ్చిందావిడ.

తిరునాళ్ళలో తప్పిపోయిన చిన్నపాపలా ఉంది వాణి. భయం... దుఃఖం ఆమెను చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చెయ్యసాగాయి.

అశ్వద్ధామ వాణి నుంచి సాంతం పారిపోయాడనే సంగతి కాలేజీ అంతా స్పష్టంగా తెలిసిపోయింది.

దొంగ సానుభూతులు ... హేళనలు ... వీలైతే తాము కూడా ఓసారి ఆమెను పొందాలనే మగవాళ్ళ వేట ... కారడవిలో ... కార్చిచ్చు నడుమచిక్కిన లేడికూనలా గజగజలాడిపోతోంది వాణి.

ఎక్కడికెళ్ళాలి? ఏం చెయ్యాలి?

ఇంటికి ఏ ముఖంతో వెడుతుంది?

నేనున్నానని ధైర్యం చెప్పేవారెవరు?

ఇంతటి విశాల విశ్వంలో ... దగాపడిన ఆడపిల్లకు జానెడు చోటు దొరకదు.

వాటేపిటీ !


ఇదంతా ''స్వయంకృతం.''

తన అజ్ఞానం. తెలిసీ తెలియని మూర్ఖత్వం.

ఆ తెల్లారి ...

వాణి అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని ప్రకృతి స్తంభించలేదు.

కాలం ఆగిపోలేదు.



"వాడి పేరేమో ఈ రిజర్వ్‌డ్‌లిస్టులో ఉంది కాని వాడు మాత్రం కనిపించటంలేదురా!" బెజవాడ స్టేషన్లో దామోదరరావు రామలింగంతో అన్నాడు, కొంచెం ఆశ్చర్యపోతూ.

"ఆ అబ్బాయి మీ ఫ్రెండా? రాత్రి ఒకసారి లేచి వెళ్ళాడు. మళ్ళీ కనిపించలేదు. ఇక్కడే ఎక్కడేనా ఉన్నాడనుకున్నాను. అదిగో అతని సామానుకూడా అక్కడే ఉందే!" అన్నాడు సామాను దింపించి కూలిని కుదుర్చుకుంటున్న ఒక నడివయస్సు మనిషి.

"అలాగండి! వారే దామోదరం రిపోర్టిద్దాం రారా!—" రామలింగం, దామోదరం తమతో మాట్లాడిన వ్యక్తితో స్టేషన్ మాష్టరు ఆఫీసు వయపు నడిచివెళ్ళారు. "అతను మా ఫ్రెండండి. మెడ్రాసులో చదువుకుంటున్నాడు, ఇంజనీరింగ్ కాలేజిలో. సెలవులకి ఇంటికెడుతూ ఇక్కడ రెండ్రోజులుండి పోదామనుకున్నాడు. ఏమిటో..."

* * *

పెద్ద బ్రేకుల చప్పుడుతో రయిలు బండి నెమ్మదిగా ఆగింది. తలుపు దగ్గిరే నుంచుని ఉన్న సూరి కిందకి దిగాడు. అప్పటికి మధ్య రాత్రి దాటింది. బాగా వెన్నెల కాస్తోంది. ముందు పెట్టెల కొన్నిటి దీపాలు పసుపుపచ్చగా వెలుగుతున్నాయి. దూరంగా ఇంజన్ కూత వినిపిస్తోంది. వెన్నెలలో ఆవిరి, పొగ స్పష్టంగా కనిపిస్తున్నాయి. బండి ఆగటంతో కొందరు ప్రయాణికులు దిగుతున్నారు. అసలు ఎందుకు ఆగిందో సూరికి అర్థంకాలేదు. అది పెద్ద బయలు ప్రదేశం. ముందు స్టేషన్‌కాని సిగ్నల్ కాని కనిపించటంలేదు. ఎవరో పొరపాటున గొలుసు లాగి ఉంటారని ఊహించాడు. మాకు అందినది ఆఖరిపెట్టె. రయిలుబండి చిట్టచివర నుంచుంటే ఎలా ఉంటుందో, అనిపించింది సూరికి హటాత్తుగా. పెట్టె వెనుక వయపుకి నడిచి వెళ్ళాడు. అనాలోచితంగా మరికొంత దూరం పట్టాల వెంబడే నడిచి వెళ్ళాడు. వెనక్కి తిరిగి చూశాడు. దూరంగా ఏవో మాటలు, ఇంజన్ బుసలు సన్నగా వినిపిస్తున్నాయి. బండి గభాలున బయలుదేరి వెళ్ళిపోతే తను ఈ చోట వంటరిగా ఉండిపోతాడు. ఈ ఊహకి సూరి నవ్వుకున్నాడు. చుట్టూ కలయచూశాడు. అది చాలా చదును ప్రదేశంగా కనిపించింది. నేల వెన్నెలలో తెల్లగా మెరుస్తోంది.

అక్కడక్కడ చెట్లు నల్లటి పొదలలాగా కనిపిస్తున్నాయి. పరధ్యాన్నంగా మళ్ళీ ముందికి సాగిపోయాడు సూరి. మూడు నాలుగు అడుగులు వేశాడోలేదో కాలు బద్దీలో ఇరుక్కుని బోర్లాపడ్డాడు. ఏదో నుదుటికి గట్టిగా తగిలింది...

* * *

సూరికి స్పృహ వచ్చేసరికి ఒక క్షణం తమ రయిలు పెట్టెలో ఉండటానికి బదులు కంకర్రాళ్ల మీద చెంప ఆనించి ఎందుకు పడుకున్నాడో అర్థం రాలేదు. కాని వెంటనే జరిగినదంతా జ్ఞాపకం వచ్చింది. గాభరాగా లేచి చూశాడు. రయిలు బండి కనిపించ లేదు. కంగారుగా కొన్ని గజాల ముందుకి పరిగెత్తాడు. తర్వాత కోలుకుని చేతిగడియారం చూసుకున్నాడు. వొంటిగంట కావస్తోంది. అంటే తను ఇక్కడ అరగంట, ముప్పావు గంటకి పయిన స్పృహ తప్పి పడి ఉన్నాడన్నమాట! నుదురు తడిమి చూసుకున్నాడు. పెద్ద బొప్పి కట్టింది. మొదట కొద్ది క్షణాలలో తను గమనించలేదు. కాని తల భారంగా పోటుగా ఉంది. పెద్దగాయం తగలలేదు కాని తనిప్పుడు ఏమి చెయ్యాలి?

"ఉత్తనే కంగారుపడి లాభం లేదోయ్!" అని తనతో తనే చెప్పుకున్నాడు. రుమాలు బయటికి తీసి మొహం అంతా శుభ్రంగా తుడుచుకున్నాడు.

—చుట్టుపక్క లేమయినా ఊరు ఉంటే ముందు అక్కడికి పోవటం మంచిది!— నలు దిక్కులా చూశాడు. ఒకవయిపు సన్నగా, నీలంగా ఏదో కాంతి కనిపిస్తోంది. గ్రామంలో గాస్ లయిటు వెలిగించి ఉంటారు, అనుకుని అటు బయలుదేరాడు. వెన్నెలలో దారి సులభంగా కనిపిస్తోంది. జోరుగా వీస్తున్న గాలి తల భారం మరపింపచేసేట్లుంది.

దగ్గిరికి వెళ్ళేకొద్దీ వెలుగు అధికం అవుతోంది. వెలుగుతోబాటే ఏదో ఒక శబ్దం కూడా వినిపిస్తోంది. పెద్ద మోటారు పని చేస్తూంటే వచ్చే మోతలాగా ఉంది. అంతా దట్టంగా ఎదిగిన చెట్ల సమూహం వెనక నుంచి వస్తున్నట్లుంది.

—ఊరేమీ కనిపించడం లేదేమిటి!— అనుకుంటూ సూరి నడకవేగం హెచ్చించాడు. నాలుగయిదు నిముషాల్లో చెట్ల గుంపుని ప్రవేశించాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి అదిరిపడ్డాడు.

* * *

చెట్లగుంపు అవతల చిన్న బయలు ప్రదేశం వొకటి ఉంది. దాని మధ్య సుమారు డెబ్బయి, ఎనభయి అడుగుల వెడల్పు ఉన్న పెద్ద షళ్లెం లాంటి వస్తువు ఒకటి ఉంది. ఏదో వెండిని పోలిన లోహంతో చేసి ఉందేమో వెన్నెలకాంతిలో, వాని మధ్యనే ఉన్న గాజు గోపురంలాంటి నిర్మాణంలో నుంచి వస్తున్న నీలం వెలుగులో విచిత్రంగా మెరుస్తోంది. దాని అంతర్గర్భంలో నుంచి వస్తున్నట్లుంది. ఎన్నో తుమ్మెదల ఝుంకారం పోలిన శబ్దం. ఆ శబ్దానికి నేలకూడ అదురుతున్నట్లు ఉంది. సూరి తలంతా దిమ్మెక్కిపోయినట్లుంది.

భారతి

సాహిత్య మాస పత్రిక

తెనుగువారి

సం
స్కృ
తి
కి

ప్రతిబింబం

విడి పత్రిక రు. 4-00



నిర్మాత: జి.ఆర్.కె.రాజు దర్శకత్వం: రాజశేఖర్

నైజాం: గోపికృష్ణ ఫిలింస్ • సీడెడ్: వీరబ్రహ్మేంద్ర కంబైన్స్

కార్టూన్లు పంపేవారికి మనవి

కార్టూన్‌లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు పెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ—3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6 నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్‌లు 'టపా'లో పోయినా, దారి తప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్‌లు పంపేవారు కవరుమీద ఆ సంచిక పేరు ఉదహరించాలి. ఈ కార్టూన్‌లకి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

—సం.

దూర ప్రయాణం

అనుమతి లేనిదే ఏ గోళంమీది జీవులతో సాన్నిహిత్యంకాని వీలులేదని మా ప్రభుత్వంవారు శాసించారు. ఇప్పుడు అనుకోకుండా నువ్వు మాకు తగిలావు. మేము వెళ్లే గ్రహంలో మా అధికారులకి జరిగినదంతా చెప్పి వారి ఆజ్ఞానుసారం నడుచుకొనవలసి వస్తుంది...'' అన్నాడు 'డక్క ఎ' నుంచి వచ్చిన వ్యక్తి.

సూరికి ఏమనాలో తెలీదు. ఒకటి రెండు క్షణాలు ఆలోచించి అమాంతంగా లేచి బయటికి పారిపోతే ? కాని తలుపువేసి ఉంది !

''నువ్వు సరిగ్గా నడుచుకొనకపోయినట్లయితే నిన్ను నిర్బంధించవలసివస్తుంది. అనవసరంగా ఆ పరిస్థితి రానివ్వకు !'' యంత్రంలాగ చెప్పాడు ఆ వ్యక్తి.

* * *

''వీడే అడవిలోనో దిగితే ఏ పులో, సింహమో పట్టుకుపోయిందేమో ?'' అన్నాడు దామోదరరావు రామలింగంతో.

''నీ మొహం, ఇక్కడ పులులూ సింహాలూ ఎక్కడరా ! ఇదేదో పెద్ద విచిత్రంగానే ఉంది. పేపర్లో ఎడ్వర్టయిజ్మెంట్ వేశాము కదా! ఎవరో ఏదో చెప్పకుండా ఉంటారంటావా ?''

* * *

ఆ విమానంలో పదిమంది ఉన్నారు. ఇంకా అయిదు మందికి సరిపోయే ఖాళీ, సౌకర్యాలు ఉన్నాయి. సూరి కూడా తక్కిన ప్రయాణికులలలాగే తన సీటు బెల్టు వేసుకుని కూర్చున్నాడు. విమానం లోపలి యంత్రాల మోత విపరీతంగా పెరిగింది. దాని కదలికలకి వళ్లంతా అదిరిపోతున్నట్లనిపించింది అతనికి. కొన్ని నిముషాల తర్వాత విమానం పయికి లేచినట్లనిపించింది. అతి వేగంగా లేవటంవల్ల కొంత సేపు చాలా బాధపడ్డాడు. ఒక అరగంట గడిచింది. తర్వాత అక్కడికి తనతో మాట్లాడిన వ్యక్తి వచ్చాడు. అతనిపేరు 'హమా' అని సూరికి తెలిసింది. ఆ విమానం ముఖ్యాధికారి పేరు 'నెబు'ట. తక్కినవారి కొందరి పేర్లు హమా చెప్పాడు కాని కొత్తగా ఉండటం చేత అవి సూరికి తల కెక్కనే లేదు.

''విమానం పూర్తిగా బాగుపడలేదు. మామూలు వేగంలో వెళ్లలేకపోతున్నాము.అయినా ఇటొచ్చి చూడు, మీ భూగోళం ఎంత స్పష్టంగా కనిపిస్తోందో !'' అన్నాడు ఒక టెలివిషన్‌వంటి యంత్రం చూపిస్తూ.

''పెద్ద చంద్రగోళంలాగ ఉంది !'' ఎన్ని బొమ్మలు, ఫోటోలు పత్రికలలో పడినవి చూసినా వింత కాంతితో వెలుగుతూ కనిపించిన భూగోళాన్ని చూసేసరికి సూరి గొంతుకలో ఏదో ఇరుక్కున్నట్లయింది.

''అదిగో మీ దేశం !'' లేత నీలం, ఆకుపచ్చ, ఉదారంగులతో ముదురు నీలం కలిసి ఉన్న ఖండాల సముద్రాల రేఖలలో భారతదేశం ఆకారం బడిలో చూపించే గోళాల నమూనాలలో కనిపించే ఆకారంలాగే ఉంది !

''మా ప్రపంచంలో వారూ త్వరలో చంద్ర మండలానికి వెళ్లబోతున్నారు తెలుసా?'' అన్నాడు సూరి కొన్ని క్షణాల మవునం తర్వాత.

''విన్నాను ! మా గ్రహం చుట్టూ నాలుగు ఉపగ్రహాలు పెద్దవి తిరుగుతూ ఉంటాయి. కొన్నివేల సంవత్సరాల క్రితమే వాటిలో మేము స్థావరాలు ఏర్పరుచుకున్నాము. మా అంతరిక్ష యానం చాలా పురోగమించింది—మీరు సాధించిన దానితో పోలిస్తే, ఈ విమానం గంటకి కొన్ని వేల కిలోమీటర్ల వేగంతో ఆకాశంలో వెళ్లగలదు. లేదా ప్రత్యేకమయిన ఏర్పాట్లతో కాలంలో కూడా ప్రయాణం చెయ్యగలదు. ఈ రకం గమనం గురించి మీ శాస్త్రజ్ఞులు కనిపెట్టే ఉంటారు.''

''అవును, అయిన్‌స్టైయిన్ అనే ఆయన దీనిని గురించి కొన్ని సిద్ధాంతాలని ప్రతిపాదించాడని చదివాను. నా చిన్నప్పుడు హెచ్.జి. వెల్స్ అనే బ్రిటిష్ రచయిత 'టయిమ్ మెషీన్' అనే పుస్తకం చదివాను. అందులో కాలంలో గమనం గురించి ఎంతో బాగా రాశాడు ! మనం కూడా ఆ రకం ప్రయాణం చేస్తామా ?'' అని కుతూహలంతో అడిగాడుసూరి. ఇదంతా ఒక కలయేమో అనే అనుమానం చూచాయగా కలుగుతున్నా దానిని అణగదొక్కి వేశాడు. తన మామూలు ప్రపంచం ఇప్పుడు ఎంతో దూరంగా అనిపిస్తోంది. 'డక్క ఎ' గ్రహవాసులు వింతగా కనిపించటం లేదు. ఆకారంలో చిన్న భేదాలు, మాట తప్ప ఇంచుమించు మనుష్యులలాగే ఉన్నారు. హమా వద్ద ఎన్నో కొత్త విషయాలు అడిగి తెలుసుకోవాలని ఆరాటంగా ఉంది సూరికి.

''విమానం పూర్తిగా బాగుపడలేదని చెప్పాను కదూ ? లేకపోతే ఆకాశంలో బదులు కాలంలోకి మారి పోయేవారమే ... విూ సూర్యమండలంలో ఒక ఎర్రటి గోళం ఉంది. అక్కడ దిగి అవసరమయిన మరమ్మత్తులు చేసుకోవటానికి నిశ్చయించుకున్నాము. మా లోకానికి రేడియో సంకేతం ఒకటి పంపాము. జవాబు రావటానికి ఒకటి రెండు రోజులు పట్టవచ్చు. మామూలు రేడియో ప్రసారాలు దానికి చాలవు. వేగం మరీ తక్కువ ! ప్రత్యేకమైనకిరణప్రసారం వాడుకుంటాము...''

''మరి వేగం తగ్గి ప్రయాణ కాలం అధికం అయినప్పుడు ఆహారం, గాలి వంటి సౌకర్యాలకి ఇబ్బంది కాదా?'' సూరికి హటాత్తుగా అనుమానం కలిగింది.

''వస్తుంది ! నిజం చెప్పాలంటే ఇప్పటికే మన పరిస్థితి ఏమీ బాగాలేదు. కాని నేను చెప్పిన గ్రహం—దానిని ఇంగ్లీషులో మార్స్ అంటారనుకుంటాను—చేరేదాకా ఎలాగో అలా సద్దుకోవచ్చు. మీలాగే మేమూ ప్రాణవాయువు పీలుస్తాము.

మా దేహ స్వభావం కూడా ఇంచుమించు అటు వంటిదే కాని కృత్రిమ ఆహారాలకి అలవాటు పడగలిగాము. త్వరలో నీకూ రుచి చూపిస్తాము.''

సూరి ఏదో అనపోతూ ఉండగా వారి విమానం అమాంతం ఒక కుదుపు ఇచ్చింది. దాని వేగానికి తట్టుకోలేక సూరి పడ్డాడు. ఇంతలో వారున్నగదిలో లవుడ్ స్పీకర్‌లో నుంచి ఈలలు కొన్ని, ఏవేవో మాటలు వినిపించాయి. గోడమీద చెయ్యిపెట్టి పడిపోకుండా నుంచున్న హమా మాత్రం దానిని వింటూ కంగారు పడ్డట్టు కనిపించాడు.

''సూరీ! త్వరగా లేచి నీ సీట్లో కూర్చో పరిస్థితి ప్రమాదంగా ఉందిట! X —! X X X - !!! ?'' తత్తరపాటులో హమా తన భాషలోకి మారిపోయాడు.

* * *

''వెన్నెల చూడరా ఎంత బావుందో! పాపం, సూరి ఒకసారి వెన్నెల గురించి కవిత్వం రాస్తే వాడ్నెంత ఏడిపించామూ! వాళ్లమ్మా, నాన్నతో చెప్పి ఇంజనీరింగ్ మాన్పించి లిటరేచరులో చేర్పిస్తామని అన్నాము గుర్తుందా?'' వంతెన మీద నుంచుని పాదరసంలాగ మెరిసి పోతున్న నదిలోకి చూస్తూ అన్నాడు.

''వాడికసలు అంతరిక్ష యానమంటేనే పిచ్చి! ఎప్పటికయినా స్పేస్ ట్రావెల్ అంతర్జాతీయం అయితే అందులో కెలాగయినా వెళ్లటానికి ప్రయత్నిస్తానని అంటూ ఉండేవాడు ... వాళ్ల తాతయ్య మాత్రం మనిషి చస్తే చంద్రలోకం చేరు కోలేడనే వాదిస్తాడు మారినర్లు, ఆర్బిటర్లు, వోస్కోడ్లు అంతా మోసం అంటాడు...!''

* * *

''అయితే ఇప్పుడేమి చేద్దాము?'' అనడిగాడు సూరి మళ్లీ. ఈ ప్రశ్న ఎన్నిసార్లు వేశాడో లెక్కలేదు. హమా సమాధానం ఇవ్వలేదు. ఇద్దరూ చిన్న టాంకువంటి వాహనంలో చంద్రగోళం మీద ఒక లోయలో కూర్చుని ఉన్నారు. అప్పటికి చీకటిపడింది. కాని, ఆకాశంలో ఉజ్వలంగా వెలిగే భూమి 'వెన్నెల'లో ఇరువైపులా ఉండే రాతికొండలు భయంకరంగా, అందంగా కనిపిస్తున్నాయి.

వారి విమానం చెడిపోవటంతో దాని అధికారి చోదకుడు, ఇంజనీరు — వీరిద్దరితోనూ అత్యవసరంగా సంప్రదించి దిగటానికి సౌకర్యంగా ఉన్న చంద్రగోళంమీద దింపటానికి నిశ్చయించుకున్నాడు. కొంచెం కష్టంమీద విమానాన్ని చంద్రగోళంమీద దింపారు. మరమ్మత్తు సాగుతూ ఉండగా నెబు హమాకి, సూరికి ఒకసారి బయటికి వెళ్లిరావటానికి అనుమతి ఇచ్చాడు. బయట తిరిగి రావటం కోసం చిన్న టాంకు వంటి బండి ఒకటి ఉంది. అది నిజానికి జెట్‌ల వల్ల నడిచే బండి. అవసరానికి టాంకులకి ఉండేటటు వంటి చక్రాలు, పట్టీలు కూడా ఉన్నాయి. భూమీమీద కాలానికి సుమారు రెండు గంటలకి సరిపోయే వ్యవధి ఇచ్చి తిరిగి వచ్చెయ్యమన్నాడు కెప్టెన్ నెబు. చిన్నబండికీ విమానానికి మధ్య రేడియో సౌకర్యం ఉంది.

సూరి, హమా జాగ్రత్తగా విమానం దిగిన ప్రదేశం చుట్టూ తిరగటం ప్రారంభించారు. ఎటుచూసినా చెట్టు చేమలేని రాతికొండలు, స్తంభించిపోయిన అగ్ని పర్వతాలు, ఊహకి అందనంత. పూర్వకాలంలో చిత్రవిచిత్రంగా గడ్డకట్టుకుపోయిన శిల. కలలో కూడా ఇంత వింత ప్రకృతి స్వరూపం చూడలేదనుకున్నాడు సూరి.

''ఇంతకన్నా విచిత్రమయిన గోళాలు చూశాను. బురద సముద్రాలూ, జంతువులని తినే చెట్లూ మన అంత ఉన్న పతులూ — ఒకటేమిటి!'' అన్నాడు హమా సూరి తన ఆశ్చర్యాన్ని ప్రకటించగా. ''ఒక గంట అయింది. ఇంకొక గంట ఉంది. మరమ్మత్తు ఎంతదాకా వచ్చిందో నెబుని అడుగుతాను!''

హమా తన భాషలో ఏదో అన్నాడు రేడియో మయిక్రోఫోన్‌లోకి. కొంత సంభాషణ జరిగింది. ఇంతలో అతని సాధారణ ధోరణి మారిపోయి ఒక చిన్న కేక వేశాడు. అతనితో కొంత పరిచయం కలిగిన సూరికి అతని ముఖంలో ఆశ్చర్యం, భయం, ఆందోళన కనిపించాయి.

''ఏమయింది?'' అని అడిగాడు.

''అదే అర్థం కావడంలేదు! నెబూతో మాట్లాడుతూనే ఉన్నాను. ఒక పెద్ద శబ్దం అయింది. ఆ తర్వాత పూర్తి నిశ్శబ్దం! ఎందుకయినా మంచిది. వెనక్కి తిరిగి వెళ్లిపోదాం...''

బండిని వెనక్కి తిప్పారు. ఒక చిన్న లోయలో మలుపు తిరగగానే వారి కంటికొక భయంకర దృశ్యం కనిపించింది. వారి విమానం తునాతునకలయి పొగలు కక్కుతూ ఉంది. ఆ బీభత్సం మధ్యవారికి చాలా పెద్ద బండవంటిది ఒకటి కనిపించింది.

''పెద్ద ఉల్క ఒకటి రాలి ఉంటుంది. ఎంత ప్రమాదం జరిగింది! కోటికొక ఉల్క కూడా ఇలా ఇంతమందిని నేలమీద చంపి ఉండదు'' అంటూ మొదలుపెట్టిన హమా క్రమంగా తన భాషలోకి మారిపోయాడు. సూరికికూడా ఎవరో ఆప్తులు పోయినట్లనిపించింది. జాగ్రత్తగా విమానాన్ని సమీపించారు. ఆ బీభత్సంలో వారికి ఏదీ మిగిలినట్లు కనిపించలేదు. ఇక తక్కినవారికోసం వెతికి లాభంలేదని నచ్చచెప్పాడతనికి సూరి.


ఎంతసేపు అలా ఉండిపోయారో సూరికి తెలియలేదు కాని అప్పుడప్పుడు— ''ఇప్పుడు ఏం చేద్దాము?'' అని అడిగేవాడు. తన దుఃఖంలో మునిగిఉన్న హమా అతన్నిముందు అంతగా పట్టించుకోలేదు. కాని చివరికి, ''వీలయినంత కాలం ఇలా ఇక్కడ ఉండిపోదాము! లేదా బయటికి పోయి ప్రాణాలు వదులుకుందాము...'' అన్నాడు.

''అదేం మాట? అంత తేలిగ్గా ఆశవదులుకుంటే ఎలాగ? ఇంత నిర్మానుష ప్రదేశంలోనూ ఎక్కడో మన బండిని దాచుకునే చోటు ఉండక పోదు. ఇక్కడే ఇలా ఉంటే మనమీద ఒక రాయి పడవచ్చు కదా?''

* * *

''చూశావా మనవాడు 'ఇన్టర్ ప్లానెటరీ ఎసోసియేషన్'లో చేరాట్ట! మనకి చెప్పనే లేదు!!'' హాస్టల్లో సూరి రూమ్‌మేట్ శ్యామలరావు కార్డు ఒకటి చదివి దాన్ని రామలింగానికి అందచేస్తూ అన్నాడు.

'చంద్రుని కెక్కలేనమ్మ గ్రహానికేమెక్కుతుంది? ముందు 'మూన్ ట్రావెలర్స్ ఎసోసి



యేషన్' పెడితే సరిగ్గా ఉండేది!'' అన్నాడు నాగరాజు.

''త్వరలోనే ఎప్పోల్లో ప్రాజెక్టుని ఆమెరికన్లు ప్రయోగిస్తారుట— అంతలోనే రష్యన్లు కాస్తా ఆ పని చేస్తారేమో!'' శ్యామలరావు అన్నాడు.

''అప్పటికయినా మనవాడు దొరుకుతాడంటవా? సూరీ వాళ్లమ్మ పాపం చాలా బెంగ పెట్టుకుంటోందిట ...''

* * *

''ఆ గుహలోకి వెడదామా?'' అని అడిగాడు సూరి. కొన్ని గంటలు తిరిగిన తర్వాత ఒక పెద్ద కొండలో గుహ ఒకటి కనిపించింది.

''ప్రాచీన మానవుడు గుహవాసి కద! మన స్వభావం ఎక్కడికి పోతుంది?'' హమా పరిహాసంగా మాట్లాడుతున్నాడని సూరికి తెలుసు.

జాగ్రత్తగా వాహనాన్ని గుహ వద్దకి తీసుకుపోయాడు హమా. చాలా లోతుగా ఉన్నట్లుంది, అవతల వయిపు గోడ కనిపించటం లేదు. హమా లైట్లు వేశాడు.

''ఇదేమిటి? కలకంటున్నానా? నేను చూసేదీ నీకూ కనిపిస్తోందా!'' సూరి కళ్లు నులుముకుంటూ అన్నాడు.

''కలకాదు నిజమే...''

గుహ సుమారు వంద అడుగుల లోపల బాగా వెడల్పయి లోపల మహామందిరం వంటి ప్రదేశం ఉంది. ఈ మందిరం పొడుగు కొన్ని వందల గజాలు, వెడల్పు కనీసం వంద గజాలు ఉంది. దీనంతటికీ మధ్య బోర్లించి ఉన్న బార్లె మూకుడు వంటి పెద్ద 'గాజు' నిర్మాణం వుంది. దాని పరిణామాలు ఎత్తు సుమారు ఏభయి అడుగులు. వెడల్పు సుమారు మూడు, నాలుగు వందల అడుగులు ఉంది. స్పష్టమయిన గాజు లోపల ఏవో నిర్మాణాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. అనుమానంగానే తమ బండిని గాజు మూకుడు దగ్గరికి తీసుకుపోయాడు హమా.

దూర ప్రయాణం

''లోపలికి వెళ్లేందుకు తలుపదిగో! లోపలివన్నీ ఏదో పవర్ హవుస్‌లాగ కనిపిస్తున్నాయే!!''

''ఇంత దూరం వచ్చిన తర్వాత ఇక సందేహించి లాభంలేదు. ఈ సూట్లు వేసుకుని బయటికి దిగి దానిలోపలికి వెళ్లటానికి ప్రయత్నిద్దాము రా!'' అన్నాడు హమా, సూరి ఉత్సాహంగా అన్న మాటలకి సమాధానంగా.

పది నిముషాల లోపల ఇద్దరూ అంతరిక్ష వస్త్రాలు ధరించి గాజు నిర్మాణం తలుపుముందు నుంచున్నారు. సూరి సంకోచం లేకుండా చెయ్యి జాపి తలుపు పిడిని పట్టుకు లాగాడు. సునాయాసంగానే తలుపు తెరవగలిగాడు. ఇద్దరూ లోపలికి అడుగు వేశారు. అది చిన్న గదిలాగ ఉంది. ముందు మరొక తలుపు కనిపించింది.

''ఇది వాయుబంధం వంటిది. వెనకతలుపు మూసుకోనీ!'' అన్నాడు హమా రేడియోద్వారా. సూరి వెనక్కి తిరిగి చూశాడు. తలుపు మూసుకుంది. వెంటనే ఆ గది ఒక నీలం వెలుగుతో నిండిపోయింది. కొన్ని క్షణాలు గడిచాయి.

''ఇక్కడ గాలి వుంది! ప్రాణ వాయువు ఉన్నట్లే చూపిస్తోంది ఈ మీటర్!'' హమా తమ అంతరిక్షవస్త్ర సామగ్రితోబాటే వచ్చే మీటర్ ఒకదానిని ముందు పట్టుకుని పరిశీలిస్తూ అన్నాడు. 'పీడనం కూడా సరిగ్గానే ఉంది!!'

సూరి తన తల కప్పు తీసివేశాడు. గాలిలో ఏదో రసాయనం వాసన ఉన్నప్పటికీ పీల్చటానికి సరిగ్గానే ఉన్నట్లుంది.

పదిహేను నిముషాల తర్వాత ఇద్దరూ లోపల ఒక చిత్రపటం ముందు నుంచున్నారు. అది వారు నుంచున్న గాజు నిర్మాణానికి సంబంధించినదేనని స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

'ఈ భాష నాకు తెలుసు!' అన్నాడు సంతోషంగా హమా పటంలోని అక్షరాలని కొన్నిటిని చూసి. 'ఇది ఒకప్పుడు అంతరిక్ష యానంలో మా ప్రాంతంలో వివిధ గ్రహాలవాళ్లు వాడేవాళ్లు. తర్వాత ఇది ఒక గ్రహం వారిదని, అందరిమీదా రుద్దటం అన్యాయమనీ కొందరు పోట్లాడారు! ఇది మా భాష కాదు కాని నాలాగ అంతరిక్షయానం తరచుచేసే వారందరికీ ఏదో కొంత రాకుండా ఉండదు...'

* * *

'ఇలా చంద్రమండలం మీద— పోనీ కొండ గర్భంలోపల! — కొన్ని వేలకి వేల ఏళ్లముందు ఎవరో ఒక లోకంవారు ఎందుకో కట్టుకున్న ఈ భవనంలో మనం ఇలా అన్ని సౌకర్యాలూ అనుభవిస్తున్నామంటే నాకే నమ్మేట్లు లేదు!' అన్నాడు సూరి. ఇద్దరూ లోపల ఒక గదిలో కూర్చుని ఒక వింత పానీయాన్ని తాగుతూ, వింత ఆహారాన్ని తింటూ కూర్చున్నారు. ఆ భవనంలో వాతావరణం, ఆహారం, పానీయాలూ అన్నీ కృత్రిమంగా తయారయ్యేవే. హమా చెప్పిన దాని ప్రకారం అప్పటికి సుమారు ఏభయి వేల సంవత్సరాల క్రితం చంద్రమండలంలో ఒక గ్రహంవారు రహస్యంగా కట్టుకున్న స్థావరం అది. అక్కడ అణ్వస్త్రాలు కొన్ని దాచి ఉంచాలని వారి ఉద్దేశం. చివరికి వారి పథకం నెగ్గలేదు. కాని స్థావరం రహస్యంగా అలాగే ఉండిపోయింది. అందులో ఉన్న కొందరూ క్రమేణా నశించి ఉంటారని హమా ఊహ. కాని, అసలు స్థావరం నిర్మాణం చాలా కట్టుదిట్టంగా ఉండటంవల్ల, లోపల స్థాపించిన యంత్రాలు చెక్కు చెదరకుండా పని చెయ్యటం వల్ల ఆ కృత్రిమ నగరం అలాగే ఉండిపోయింది. దాని నిర్వాహకులు సాంకేతికంగా ఊహించరానంతగా అభివృద్ధి చెందినవారయి ఉంటారని సూరి గ్రహించాడు.

''అవును, కాని ఇలా ఈ గుహలో ఎంత కాలమని ఉండగలం?'' హమా ప్రశ్నవేశాడు.

''గత్యంతరం లేదు కదా! లోపల వెతుకుదాము. రేడియో ప్రసారం వంటి దేదయినా వీలయితే సందేశాలు పంపిద్దాము. లే, హమా! పని మొదలుపెడుదాము రా ...''

* * *

''ఒరే, దామోదరం! ఈ వార్త చూశావా? చంద్రమండలయానం అనుకున్న దానికంటే తొందరగా అవుతుందిట! ఆరునెలల్లో మొదటి రాకెట్ బయల్దేరుతుందిట!!'' శ్యామలరావు ఒకరోజు అన్నాడు.

''అరె! అలాగా? మన సూరే కనక ఇక్కడిప్పుడుంటే ఎంత సంతోషించేవాడో కదా! వాళ్ల తాతయ్యతో కాసిన పదిరూపాయల పందెం గెలుచుకునే కాలం దగ్గిర కొచ్చిందన్నమాట...''

* * *

విజయనగరం లియోక్లబ్‌వారు ఇటీవల 'చార్టర్' దినోత్సవం జరుపుకున్న సందర్భంగా లియోక్లబ్‌ల జిల్లా చైర్మన్ లయన్ డా. గోలి శ్రీరాములు 'చార్టర్' బహుమతిని అందజేస్తున్న దృశ్యం. శ్రీమతులు వి.వి. కల్యాణి (కార్యదర్శి), బి. జయశ్రీ (అధ్యక్షురాలు), సమతా జైన్ (కోశాధికారిణి)గార్లని కూడా చిత్రంలో చూడవచ్చు.



హైదరాబాద్ నోట్‌బుక్

ఉపాధ్యాయులకు నోటీసు :

నవంబర్ 15న నిజాం కళాశాలకు వెళ్లాను ఒక ఉపాధ్యాయులను కలుసుకోడానికి. అది మధ్యాహ్న భోజన సమయం. తమ ఉమ్మడి హాలులో ఉపాధ్యాయులంతా ఉన్నారు. భోజన సమయం గడిచింది. తరగతుల ప్రారంభం సూచించే గంట గంటకొట్టింది. కొందరు ఉపాధ్యాయులు కదల్లేదు. ఏమిటి మీకు తరగతులు లేవా? అనడిగాను. ఉన్నాయి. విద్యార్థుల కోసం ప్రతీక్షిస్తున్నాము — అన్నారు. మీరు ప్రతీక్షించడమేమిటి? విద్యార్థులు మీకోసం ప్రతీక్షించాలి కదా! — అన్నాను. ఇక్కడి సంప్రదాయం వేరు. మేమే ప్రతీక్షించాలి — అన్నారు. ఇంతలో టేబిల్‌పైన ఒక సర్క్యులర్ కనిపించింది. యథాలాపంగా చూచాను. అది ఉపాధ్యాయులకు వైస్‌చాన్సలర్ పంపిన సర్క్యులర్. దాని సారాంశమిది :— ఉపాధ్యాయులు డ్యూటీలో వున్నప్పుడుకూడ ఏదో సాకుతో సరిగా తరగతులకు వెళ్లి పాఠాలు చెప్పడంలేదని నా దృష్టికి వచ్చింది. పాఠాలు చెప్పడం, విశ్వవిద్యాలయం తన ప్రయోజన దృష్టితో అప్పజెప్పిన తక్కిన పనులను నిర్వర్తించడం ఉపాధ్యాయుల విద్యుక్తధర్మమని చెప్పడం అనవసరం. ఈ సర్క్యులర్ తాత్పర్యాన్ని ప్రిన్సిపాలులు, ఆయా శాఖల అధిపతులు ఉపాధ్యాయులు గ్రహించేట్టు చేయాలి; ఉపాధ్యాయులు తమ విధులను, పరీక్షలు మొదలయిన ఇతర కార్యాలను శాయశక్తులా, చిత్తశుద్ధితో నిర్వహించేట్టు చేయాలి. తరగతులలో కచ్చితంగా విద్యార్థుల హాజరీ తీసుకోడంతో పాటు ఉపాధ్యాయులు తాముకూడ డ్యూటీలో వున్నప్పుడు తరగతులకు కచ్చితంగా వెళ్లాలి — ఉపాధ్యాయులను ఇంతగా శాసించే వైస్‌చాన్సలర్లు విద్యార్థులను శాసించవచ్చుకదా! వారు తరగతులకు వచ్చేట్టు చర్యలు తీసుకోవచ్చుగదా! రాజు తలచుకుంటే దెబ్బలకు కరవా? కాని వారు అలా చేయలేరు. దీనికి కారణం విద్యావిధానంలో లోపమే. నేటి విద్యార్థులలో అధిక సంఖ్యాకులకు చదువు వ్యాపారం. వారివెంట ఏ రాజకీయ నాయకులో అధికారంలో వుంటారు. వారు వీరిపై ఈగ వాలనివ్వరు. ఇలా పరమపద సోపానం ఎక్కినవారే రేపు ఇంజనీర్లు, డాక్టర్లు. అలాటివారితో జాతి ఎంత సంపన్నమవుతుందో చెప్పవలసిన పనిలేదు! విద్య పరమార్థం విస్మృత మయింది. లేకపోతే విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రతీక్షించవలసిన దుర్గతి ఏర్పడుతుందా? విద్య కేవలం అర్థకం అనే అభిప్రాయం ఏర్పడింది గనుక విద్యార్థులు యేనకేనా ప్యుపాయేన పట్టాలు పుచ్చుకొని, తద్వారా అదే పద్ధతిలో ఉద్యోగాలు సంపాదించే ప్రయత్నం చేస్తున్నారు. అలాటివారికే ఉద్యోగాలు. అంటే ఇదొక విషమవలయమయింది. స్వాతంత్ర్యాత్ పూర్వం గుమస్తాలను, బానిసలను తయారుచేసే చదువు వద్దని ఎన్ని జాతీయ విద్యాలయాలు నెలకొనలేదు. అలాటి విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు కూడ నేడు తమ ఆదర్శాలు మాని సాధారణ విశ్వవిద్యాలయాయి. కనుక, ప్రభుత్వ విధానం మారినప్పుడే విద్యారంగంలో పాతకాలపు గురు శిష్య సంబంధాలు నెలకొంటాయి.

బాలల దినోత్సవం :

నెహ్రూ జన్మదినోత్సవం బాలల దినోత్సవంగా జంట నగరాలలో జరిగింది. మునిసిపల్ శాఖామంత్రి శ్రీ వై. రామకృష్ణుడు ఆబిడ్ సర్కిల్‌లోని నెహ్రూ విగ్రహాన్ని 14వ తేదీ ఉదయం పూలమాలలతో అలంకరించారు. లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్సవంలో జంటనగరాలలోని పెక్కు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని బృందగానం చేశారు. దీనిలో దాదాపు ఐదువేలమంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామంతపురంలోని భారతీయ విద్యా వికాస సమితి శ్రీకృష్ణాచార్య స్మారక సంస్కృత మహావిద్యాలయంలో నవంబర్ 13న వివిధ భాషాకవి సమ్మేళనం 14నబాలల దినోత్సవం జరిపింది. కవి సమ్మేళనానికి డాక్టర్ దివాకర్ల వేంకటావధాని అధ్యక్షత వహించారు; సంస్కృత కవిత పఠించారు. ధరల పెరుగుదల, వరదక్షిణ కవితా విషయాలూ, శ్రీయుతులు డాక్టర్ కె. రాజన్నశాస్త్రి, వి. సుందరశర్మ, ఏ రాములు, రామాచార్య ఘనపాటీ సంస్కృత కవిత, డాక్టర్ సి.హెచ్. రామారావు తెలుగు కవిత, శ్రీయుతులు ఇందు వసిష్ఠ, గిరిజాశంకర శర్మ, ఓంప్రకాశ్ నిర్మల్, మేహరాజ్‌శర్మ, బాలకృష్ణశర్మ, వేణుగోపాల్ అగ్రవాల్, మాయా శ్రీవాస్తవ, కె.కె. పురే, శ్రీమతీవీరా, సావన్ హిందీ కవిత పఠించారు. డాక్టర్ రాజన్న శాస్త్రి జామాతా దశమగ్రహః — అనే దానిని వ్యంగ్యరీతిలో చెబుతూ, నవగ్రహగుణాలూ అతనికి వుందని వర్ణించారు. అతడు తపనుడు (తాపం కలిగించేవాడు), దోషాకరుడు (దోషాల పుట్ట), కుజనుడు (చెడ్డ పుట్టుకగలవాడు), ఆత్మస్తుతిలో గీష్పతి, అసత్య కథనంలో కవి (శుక్రుడు), స్వార్థరహితంగా పనిచేయడంలో పంగువు (కుంటివాడు — శని), ఇతరులను దూషించడంలో బుధుడు — ఈ విధంగా సప్తగ్రహాల గుణాలున్నాయన్నాడు రాజన్నశాస్త్రి.

ఉపశ్రుతి :

"ఏమి సార్, అంబర్‌పేట రస్తా ముఫ్ఫై ఏళ్లగా గతుకులు, గుంతలతో ఉంది గదా, అప్పుడు లేంది ఇప్పుడు రాస్తారోకో ఉద్యమం తలపెట్టారేమిటి?" అనడిగాను ఉద్యమ నాయకులను. "భలే ప్రశ్నండీ. అప్పుడు మా పార్టీ అధికారంలో వుంది. ఉద్యమాలకు మాకు తీరికేదీ? ఇప్పుడు తీరిక దొరికింది ప్రజాసేవకు" అన్నారు వారు.

— తిరుమల రామచంద్ర ★

"ఈ యంత్ర పరికరాన్ని అర్థం చేసుకుని పని చేయించే సామర్థ్యం నాకు లేదు — ప్రయత్నిద్దాము కాని, కొన్ని సంవత్సరాలకి గాని ఏదీ తెలియదేమో ..." హమా అన్నాడు కొంచెం నిస్పృహతో.

"తప్పకుండా ప్రయత్నిద్దాము! పరిధి పెడ్తే ఎలా? రోజూ కావలసినంత ఆహారం ఎలా దొరుకుతుందో కనిపెట్ట గలిగాము. ఇక్కడి రేడియో ప్రసార యంత్రంతో వీలయినన్ని పరిశోధనలని జరుపుదాము ..." లోపల సందేహంగానే ఉన్నా బయటికి ధైర్యంగా మాట్లాడాడు సూరి.

* * *

ఆంధ్రసచిత్రవారపత్రిక 1967 అగస్టు 18, సంచిక నుంచి

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబర్ 21 :— అధ్యక్షుడు శ్రీ — ఈ రోజు ఐ.రా.స. సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ పైవారం చంద్ర మండలంలో దిగిపోయే తమ అంతరిక్ష నావికులు తప్పకుండా అక్కడ ఉంటున్న శ్రీయుతులు హమా, సూరిలని కలుసుకోగలరని ఆశిస్తున్నామన్నారు. భూమి చంద్రమండలాల మధ్య రేడియో ప్రసార సౌకర్యం ఏర్పడింది కాబట్టి అంతరిక్ష నావికులకి ఇది చాలా సౌకర్యంగా ఉండగలదన్నారు. ఇంకా శ్రీ —... వార్త. ●

అవీ ఇవీ అన్నీ

వ్యాసరచన పోటీ

టెక్కలి సాహిత్య సాంస్కృతిక సమాజము వారి ఆధ్వర్యములో ''దేశభాషలందు తెలుగులెస్స'' అనెడి అంశముపై రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీ నిర్వహింపబడుచున్నది. వ్యాసములు తే 5-1-84 దీలోగా ప్రధాన కార్యదర్శి, సాహిత్య సాంస్కృతిక సమాజము, టెక్కలి-532201 వారికి చేరునట్లు పంప వలెను. ఆరు బహుమతులు కలవు అని సమాజం అధ్యక్షులు తెలియచేస్తున్నారు.

పొన్నూరులో యువ రచయిత(త్రు)ల సభలు

ఆధునిక సాహిత్యంలోని వివాదస్పదమైన వివిధ సాహిత్య ప్రక్రియలపై యువ రచయిత, రచయిత్రుల ద్వితీయ మహాసభలు జనవరి నెలలో సాంస్కృతీ సమాఖ్య (యువ సాహితీ వికాస వేదిక) గుంటూరుజిల్లా విభాగము ఆధ్వర్యాన పొన్నూరులో జరుగనున్నాయి. ఈ సభల్లో రాష్ట్ర ప్రాంతంలోని యువ రచయిత, రచయిత్రులు ప్రసిద్ధ సాహితీవేత్తలతో ఉపన్యాసా లుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా సాహితీమిత్రులు సభల్లో పాల్గొని విజయవంతం చేయవలసిందిగ సమాఖ్య రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి తెలియచేసారు. ఇతర వివరములకు శ్రీ ఉత్పల వరదరాజా, పొన్నూరు, గుంటూరుజిల్లాకు తెలియచేయ కోరుతున్నారు. ★

ఉత్తరాలు

[4వ పేజీ తరువాయి]

రోగం ఒకచోట....

2-12-83 తేది ఆంధ్రపత్రికలో హైద్రాబాద్ నోట్‌బుక్‌లో పోస్టర్లపై మహిళల దాడి అనే అంశంపై వ్రాశారు. ఇది కందకులేని దురద...సామెత జ్ఞాపకం తెస్తున్నది. పోస్టర్లలో నగ్నంగా, అర్థనగ్నంగా ఉండటానికి అంగీకరించిన వాళ్ళకు లేని బాధ వీరికెందుకు ? నిజంగా ఇవి ఆపాలంటే మహిళలకు సిగ్గుపడడం నేర్పండి. కెబరా డాన్సులు చేయటం — బ్లూ ఫిల్ములలో యాక్టు చేయటం — నటన పేరిట సినిమాల్లో అసభ్యమైన శృంగార చేష్టలు చేయటం మానుకోమనండి. రోగం ఒకచోట వైద్యం ఒకచోట అన్నట్టుగా ఉంది వీరిపని.

కె. రామారావు, హైద్రాబాద్. ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao St., Gandhinagar, Vijayawada-3, Editor: S. Radhakrishna.



"యుద్ధం లో
కృష్ణ, జయప్రద


AMRUTANJAN'S
SWAS
MINTS
అమృతాంజన్
వారి మరొక గొప్ప తయారి
స్వాస్
మింట్
బిళ్ళలు
అమృతాంజన్ లిమిటెడ్